సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 283

మంగళవారం 3-1-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



కష్టకాలంలోనూ దూకుడు

క్లిష్టపరిస్థితుల్లోనూ భారత్ '2023'ను నెట్టుకురాగలదన్న అసోచామ్. - 13లో



భారత్ X శ్రీలంక

ముంబైలో నేడు జరిగే తొలి టి20 మ్యాచ్‌లో తలపడనున్న ఇరు జట్లు -12లో



సిరియాపై ఇజ్రాయెల్ దాడి

ఇజ్రాయెల్ మరోమారు సిరియాపై దాడులకు తెగబడింది. డమాస్కస్‌లోని అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌పై క్షిపణి దాడులకు దిగింది.
- వివరాలు 6లో▶



అక్కడ రష్యా.. ఇక్కడ చైనా..

యుద్ధంలో మునిగిన ఉక్రెయిన్, రష్యాలతో భారత్, చైనా సరిహద్దు వివాదాన్ని పోలుస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ వ్యాఖ్యలు చేశారు.
- వివరాలు 6లో▶



రెండు హెలికాప్టర్లు ఢీ

ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్ మెయిన్ బీచ్‌లో సోమవారం మధ్యాహ్నం రెండు హెలికాప్టర్లు ఢీకొన్న ఘటనలో నలుగురు చనిపోయారు.
- వివరాలు 6లో▶



అన్ని ఏజెన్సీలతో అనుసంధానం

వివిధ ఏజెన్సీల డేటాతో సులభంగా యాక్సెస్ చేసుకునేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేసుకుంది.
- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

నిలువెత్తు నయవంచన



కానుకలంటూ ఆశ పెట్టి రప్పించిన అక్క చెల్లెమ్మళ్లకు వెన్నుపోటు పొడిచారు.. రూ.300 నాసిరకం వస్తువులను రూ.వేల విలువైనవంటూ ఊరించారు.. చివరకు అవి కూడా ఇవ్వకుండా ఐదు గంటల పాటు నిర్బంధించారు.. ఆ మోసాన్ని భరించలేక కుప్పకూలిన మహిళల చావుకు చంద్రబాబు కారకుడయ్యారు.. ప్రచార వ్యామోహం.. పేదల ప్రాణాలంటే లెక్కలేనితనం.. నిలువెత్తు నిర్లక్ష్యానికి మూడు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. గుంటూరులో ఆదివారం టీడీపీ నిర్వహించిన చంద్రన్న కానుకల పంపిణీ కార్యక్రమం ఆద్యంతం ఆ పార్టీ కనుసన్నల్లోనే జరిగింది. సభ నిర్వహణకు పోలీస్‌శాఖకు దరఖాస్తు చేసుకోవటం నుంచి సంబంధిత చలాన్ల చెల్లింపు వరకు ఏర్పాట్లన్నీ టీడీపీ నేతలే స్వయంగా పర్యవేక్షించారు.

- వివరాలు 10లో▶

బీజేపీ మళ్లీ గెలిస్తే వినాశనమే



బీజేపీని ఓడించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. వచ్చే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు లౌకిక, ప్రజాతంత్ర పార్టీలు సమష్టిగా సరైన వ్యూహ రచన చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

- వివరాలు 2లో▶

కీలకాంశాలపై వాడివేడిగా!



గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని జలసౌధలో జరగనుంది. గోదావరిపై తెలంగాణ నిర్మిస్తున్న కడెం–గూడెం ఎత్తిపోతల పథకం తదితర కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

- వివరాలు 5లో▶

బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడిగా నియమితుడైన తోట చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో రావెల కిషోర్‌బాబు తదితరులు



కేంద్రంలో గద్దెనెక్కితే.. వెలుగు జిలుగులే

బీఆర్ఎస్‌కు రాజకీయం క్రీడ కాదు.. గొప్ప లక్ష్యం: సీఎం కేసీఆర్

దేశవ్యాప్తంగా ఏటా రూ.1.45 లక్షల కోట్లతో ఉచిత విద్యుత్

ఏటా 25 లక్షల దళిత కుటుంబాలకు 'దళితబంధు' ఇస్తాం

- గెలిచాక రెండేళ్లలో మార్పు చూపిస్తాం
- భారత్ బుద్ధూ దేశం కాదు.. బుద్ధిమంతుల దేశం
- బీఆర్ఎస్ ఒక ప్రాంతానికి, వ్యక్తికి పరిమితం కాబోదు
- ప్రతి గుండెను చేరి ఉజ్వల భారతాన్ని నిర్మిస్తాం
- ఇందులో ఏపీ ప్రజలు కూడా భాగం కావాలని పిలుపు
- సంక్రాంతి తర్వాత దూకుడుగా బీఆర్ఎస్ కార్యక్రమాలు ఉంటాయని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ''సువిశాల భారతదేశంలో గుణాత్మక మార్పు కోసం ప్రజల ఆలోచనా సరళిని మార్చాలి. ఇందుకోసం ఆలోచనాపరులను ఏకం చేస్తాం. దేశంలో ఒక మూల కోసమో, రాష్ట్రం కోసమో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)ని ఏర్పాటు చేయలేదు. మహోజ్వల భారతదేశ నిర్మాణం కోసం బీఆర్ఎస్ ఏర్పాటైంది. లక్ష కిలో మీటర్ల ప్రయాణమైనా తొలి అడుగుతోనే మొదలవుతుంది. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రెండేళ్లలో వెలుగు జిలుగుల భారత్‌ను సృష్టిస్తాం'' అని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, ఐఆర్ఎస్ మాజీ అధికారి చింతల పార్థసారథి, టీజే ప్రకాశ్ తదితరులు సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వేదికగా కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే.. ''బీఆర్ఎస్‌కు రాజకీయం క్రీడ కాదు. ఒక టాస్క్. ఒక లక్ష్యం. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా ఏటా రూ.1.45 లక్షల కోట్లు ఖర్చు చేసి రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తాం. ఏటా రూ. 2.5 లక్షల కోట్లతో 25 లక్షల దళిత కుటుంబాలకు 'దళిత బంధు' అమలు చేస్తాం. ప్రధాని మోదీ విధానం ప్రైవేటీకరణ అయితే.. మా విధానం జాతీయీకరణ. వారు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేసినా మేం అధికారంలోకి వస్తే వెనక్కి తీసుకుని జాతీయీకరణ చేస్తాం. లక్షల కోట్ల

మిగతా 2వ పేజీలో ▶

బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడిగా తోట చంద్రశేఖర్

బీఆర్ఎస్ ఏపీశాఖ అధ్యక్షుడిగా తోట చంద్రశేఖర్‌ను నియమిస్తున్నట్టు పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించారు. దళితుల సమస్యల పట్ల అవగాహన కలిగిన మాజీ మంత్రి రావెల కిషోర్ సేవలను జాతీయస్థాయిలో వినియోగించుకుంటామని చెప్పారు. ''ఇవాళ మాకు మంచి వజ్రాలు దొరికాయి. తోట చంద్రశేఖర్ పనితీరుపై సంపూర్ణ విశ్వాసంతో పాటు విజయం సాధిస్తారనే నమ్మకం ఉంది. అధికారిగా అనుభవమున్న ఆయనకు అవకాశం కలిగింది. ఇక తడాఖా చూపడమే తరువాయి'' అని కేసీఆర్ అన్నారు.

నోట్ల రద్దు సబబే: సుప్రీం

నిర్ణయ ప్రక్రియలో లోపాల్లేవు.. ధర్మాసనం మెజారిటీ తీర్పు

విభేదించిన జస్టిస్ నాగరత్న

రాహుల్ క్షమాపణలు చెప్పాలి: బీజేపీ

కేంద్రానికి చెంప దెబ్బ తీర్పే: కాంగ్రెస్

6 లో



రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేస్తూ కేంద్రం ఆరున్నరేళ్ల కింద తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ''ఈ నిర్ణయం తీసుకునే ముందు కేంద్రానికి, ఆర్‌బీఐకి మధ్య ఆర్నెల్ల పాటు సంప్రదింపులు జరిగాయి. కనుక పిటిషనర్లు ఆరోపించినట్టుగా నోట్ల రద్దు నిర్ణయ ప్రక్రియలో న్యాయ, రాజ్యాంగపరమైన లోపాలేవీ చోటుచేసుకోలేదు'' అని స్పష్టం చేసింది. నోట్ల రద్దును సవాలు చేస్తూ దాఖలైన 58 పిటిషన్లను కొట్టేసింది.



ముక్కోటి.. తరించిన భక్తజనకోటి

రాష్ట్రవ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు కనులపండువగా జరిగాయి. భద్రాచలం, యాదాద్రి, ధర్మపురి వంటి ప్రధాన క్షేత్రాలతో పాటు ఇతర దేవాలయాల్లోనూ వైకుంఠనాథుడిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకుని భక్తజనం తరించారు.

5 లో

యాదాద్రి ఉత్తర రాజగోపురం వద్ద గరుడ వాహనంపై వైకుంఠనాథుడి అవతారంలో దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి

ఎక్కడికక్కడ నిర్బంధం

కాంగ్రెస్ 'పంచాయతీ' ధర్నాను అడ్డుకున్న పోలీసులు

- నేతల ఇళ్ల వద్ద ఉదయం నుంచే మోహరింపు
- పలువురి హౌస్ అరెస్టు.. బొల్లారం పీఎస్‌కు రేవంత్
- పోలీసుల తీరుకు నిరసనగా ఆందోళనలకు పిలుపునిచ్చిన టీపీసీసీ
- ప్రగతి భవన్ ముట్టడికి, సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం.. ఉద్రిక్తత



రేవంత్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని కోరుతూ సర్పంచ్‌లకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళన నాటకీయ పరిణామాలకు దారితీసింది. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లందరితో కలిసి సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించేందుకు టీపీసీసీ అనుమతి కోరగా పోలీసులు అంగీకరించలేదు. అయినా ధర్నా నిర్వహించి తీరుతామన్న కాంగ్రెస్ నేతల ప్రకటనల నేపథ్యంలో ఉదయం నుంచే కాంగ్రెస్ నాయకులను గృహ నిర్బంధం చేశారు. తన నివాసం నుంచి ఇందిరాపార్కుకు బయలుదేరిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని బొల్లారం తరలించడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. రేవంత్ అరెస్టు, తమ ధర్నాను పోలీసులు అడ్డుకున్న తీరుకు నిరసనగా టీపీసీసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. హైదరాబాద్‌లో ప్రగతిభవన్‌ను ముట్టడించేందుకు, గాంధీభవన్ ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించాయి. ఈ కార్యక్రమాలను కూడా పోలీసులు అడ్డుకుని ఆందోళనకారులను అదుపులోనికి తీసుకున్నారు. గాంధీభవన్ ఎదుట పోలీసులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు వాగ్వాదం

మిగతా 2వ పేజీలో ▶



వీధిన 'బడి'..

ఓ ప్రభుత్వ పాఠశాల రోడ్డునపడింది. ఆదిలాబాద్ జిల్లా మావల మండలం దుబ్బగూడలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పదేళ్లుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడి ఐదు తరగతుల్లో 38 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. భవనం యజమాని ఇంటి నిర్మాణం నిమిత్తం సోమవారం బడికి తాళం వేశాడు. దీంతో పక్కనే ఉన్న చెట్ల కింద ఉపాధ్యాయులు పాఠాలు బోధించారు. సదరు పాఠశాల కోసం కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైందని, దాన్ని తిరిగి బడికి కేటాయించాలంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి నివేదించారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

చదువులమ్మ చెట్టు నీడలో..

- నేటి నుంచి ఓయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- 'ఉస్మానియా ఫౌండేషన్' ఆధ్వర్యంలో అలుమ్నీ మీట్– 2023



ఉస్మానియా యూనివర్సిటీ: ఒకే విద్యాలయంలో విద్యనభ్యసించి విశ్వవ్యాప్తంగా స్థిరపడి వివిధ హోదాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకునే అపూర్వ ఘట్టం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మంగళవారం ఆవిష్కృతం కానుంది. విశ్వవిద్యాలయం చరిత్రలో తొలిసారిగా 'ఉస్మానియా ఫౌండేషన్' ఆధ్వర్యంలో రెండు రోజులపాటు 'గ్లోబల్ అలుమ్నీ మీట్–2023' జరగనుంది. సమ్మేళనానికి 1,500 మంది పూర్వ విద్యార్థులు హాజరవుతారని అంచనా. ఇప్పటికే వెయ్యి మంది వరకు పేర్లను నమోదు చేసుకున్నట్లు వర్సిటీ వర్గాలు చెప్పాయి. రెండ్రోజుల కార్యక్రమ నిర్వహణకు 16 కమిటీలను ఏర్పాటు చేశారు. సమ్మేళనానికి హాజరయ్యే పూర్వ విద్యార్థులకు సహాయకులుగా ఉండేందుకు 300 మంది విద్యార్థులు వలంటీర్లుగా వ్యవహరిస్తారు.

తొలి రోజు అలుమ్నీ మీట్..

ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో మంగళవారం గ్లోబల్ అలుమ్నీ మీట్ ప్రారంభమవుతుంది. వీసీ రీసెర్చ్ అవార్డులను ప్రదానం చేస్తారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి, ఇతర అంశాలపై పూర్వ విద్యార్థులు బృంద చర్చలు జరుపుతారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. బుధవారం పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి పాత జ్ఞాపకాలను పంచుకుంటారు. అలుమ్నీ మీట్‌కు హాజరయ్యేందుకు మంగళవారం, బుధవారం కూడా స్పాట్ రిజిస్ట్రేషన్ల వెసులుబాటు ఉంది. వర్సిటీ సమగ్రాభివృద్ధిలో పూర్వ విద్యార్థులను భాగస్వాముల్ని చేసేందుకు ప్రత్యేకంగా ఉస్మానియా ఫౌండేషన్ ఏర్పాటైంది.

12,000 గురుకుల కొలువులు

పండుగ నాటికి నోటిఫికేషన్ల విడుదల

కేటగిరీల వారీగా జారీకి టీఆర్ఈఐఆర్‌బి కసరత్తు


వివరాలు 3లో▶

డీజే ముసుగులో డ్రగ్ పెడ్లింగ్



ఘరానా ఈవెంట్ల డీజే సప్లయర్ మోహిత్ అగర్వాల్ అలియాస్ మైరోన్ మోహిత్‌ను డ్రగ్స్ కేసులో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌వింగ్ (హెచ్–న్యూ) అధికారులు ఆదివారంరాత్రి అరెస్టు చేశారు. ఈయన సినీ నటి నేహా దేశ్‌పాండేకు భర్త.

14 లో



..ఎలాగోలాగా ప్రచారం మాత్రం వస్తోంది సార్!

సర్వం 'త్రిమూర్తుల' కనుసన్నల్లోనే!

రాష్ట్రంపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టిన నరేంద్ర మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా

- బీజేపీ ఎన్నికల సన్నద్ధతపై ప్రత్యక్ష పర్యవేక్షణ.. రాష్ట్రవ్యాప్తంగా 25 నుంచి 30 బృందాల మోహరింపు
- క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సర్వేలు.. అమిత్‌షాకే నేరుగా నివేదికలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీజేపీ ఎన్నికల సన్నద్ధతను పూర్తిస్థాయిలో పార్టీ అధినాయకత్వమే పర్యవేక్షిస్తోంది. పార్టీకి సంబంధించిన ప్రతీ కార్యక్రమం రూపకల్పన కూడా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కనుసన్నల్లోనే సాగుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తేవడంతోపాటు ఇక్కడ పది దాకా లోక్‌సభ సీట్లు గెలిచేందుకు సానుకూల పరిస్థితులున్నాయన్న అంచనాల మధ్య రాష్ట్రంపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో అధినాయకత్వం రాష్ట్రవ్యాప్తంగా 25 నుంచి 30 బృందాలను మోహరించినట్టు విశ్వసనీయ సమాచారం.

క్షేత్రస్థాయి పరిస్థితులపై కన్ను

మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సర్వేలతో ఇతర రూపాల్లో అవసరమైన సమాచారాన్ని అధినాయకత్వం సేకరిస్తోంది. ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్‌ను దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా రాజకీయంగా, ఇతరత్రా ముఖ్యమైన అంశాలపై సమాచారాన్ని సేకరిస్తోంది. వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలపై దృష్టితో ఈ బృందాలు అధ్యయనాలు, పరిశీలనలు, సర్వేలు వంటివి చేస్తూ చురుకుగా సాగుతున్నాయి. గ్రామస్థాయిలో ఉన్న రాజకీయ పరిస్థితులపై పార్టీకి సంబంధం లేకుండా సర్వేలు నిర్వహిస్తున్నాయి. అమిత్‌షా ప్రత్యక్ష పర్యవేక్షణలో, నేరుగా ఆయన కార్యాలయానికే నివేదించేలా 'అసోసియేషన్ ఆఫ్ బిలియన్ మైండ్స్' (ఏబీఎం) ఆధ్వర్యంలో నిపుణుల బృందాలు పనిచేస్తున్నాయి. దాదాపు ఏడాదిన్నర కాలంగా ఏబీఎం హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తూ సమాచార సేకరణలో తలమునకలైంది. గుజరాత్, యూపీ, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల్లో పార్టీకోసం పనిచేసిన బృందాలు కూడా తెలంగాణలో

మిగతా 2వ పేజీలో ▶



ఎట్ల రిజిస్ట్రేషన్ చేస్తవో.. చూస్తా!

- రియల్టర్‌కు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హెచ్చరిక
- వారి ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్
- బెదిరించలేదు: ఎమ్మెల్యే
- ఆ వాయిస్ నాది కాదు: రియల్టర్

ప్లాట్ల కొనుగోలు, డబ్బులు ముట్టజెప్పే వ్యవహారంలో ఓ రియల్టర్, ఆదిలాబాద్ జిల్లా బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మధ్య జరిగిన ఆడియో సంభాషణ సంచలనం రేపింది. ఏడాది క్రితం జరిగిందని ఎమ్మెల్యే చెబుతున్నా.. ఇటీవలే ఆ ప్లాట్ల వ్యవహారం జరిగినట్టుగా చర్చ సాగుతోంది. ఆ రియల్టర్ నిర్మల్ జిల్లా భైంసా ప్రాంతానికి చెందిన, హైదరాబాద్‌లో ప్రైవేట్ హాస్పిటల్ నిర్వహిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్ అని ప్రచారం సాగుతోంది. వివాదంపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. తానెవరినీ బెదిరించలేదని చెబుతున్నారు. -14లో▶

క్లుప్తంగా...

కేసీఆర్ బిహార్‌కు పారిపోవడం ఖాయం

టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ తెలంగాణకు పరాయివాడు, కిరాయివాడు అయ్యాడని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బిహార్‌తో కేసీఆర్‌కు రక్తసంబంధం ఉందని, అందుకే తెలంగాణలో బిహార్ అధికారుల రాజ్యం నడుస్తోందన్నారు. తెలంగాణలో కేసీఆర్ కాలం చెల్లిపోయిందని, బిహార్‌కు పారిపోవడం ఖాయమన్నారు. అయ్యప్ప స్వామిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం వెనుక రాజకీయ వ్యూహం ఉందని, దీని వెనుక టీఆర్ఎస్, బీజేపీలు న్నాయని రేవంత్ ఆరోపించారు. తెలంగాణకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజలను కలవని కేసీఆర్ పక్క రాష్ట్రం వారిని కలుస్తున్నారని, వారిని పార్టీలో చేర్చుకుంటున్నారని రేవంత్ విమర్శించారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బహిరంగ చర్చకు రావాలి

బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బహిరంగ చర్చకు రావాలని మంత్రి హరీశ్‌రావుకు బీజేపీ ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సవాల్ విసిరారు. సోమవారం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. వివిధ పథకాలు, కార్యక్రమాల కింద వస్తున్న కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని ఆయన ఆరోపించారు. గ్రామ పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు.

ఎంపీ జోగినపల్లిపై విచారణ చేపట్టండి

ఈడీకి బక్క జడ్సన్ ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీకి కేటాయించిన నిధులను హరిత హారం సహా కేంద్ర ప్రభుత్వం అనుమతించని ఇతర పథకాలకు మళ్లించి దుర్వినియోగం చేశారని తెలంగాణ కాంగ్రెస్ నాయకుడు బక్క జడ్సన్ ఆరోపించారు. 2015లో ప్రారంభమైన హరితహారం కార్యక్రమం ద్వారా ప్రతీ ఏడాది వందల కోట్ల రూపాయలు అధికార పార్టీ నాయకులు దుర్వినియోగం చేయడంతో పాటు దోచుకున్నారన్నారు. ఈ స్కాంలో 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' ద్వారా బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ కీలక సూత్రధారిగా ఉన్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు జడ్సన్ ఫిర్యాదు చేశారు. అందువల్ల ఎంపీ సంతోష్ కుమార్‌తో పాటు ఈ కుంభకోణంపై విచారణ చేపట్టాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో ఈడీ అధికారులను కలిసి ఒక వినతిపత్రాన్ని అందించారు.

'పాలమూరు-రంగారెడ్డి'పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి దాఖలు చేసిన పిటి షన్‌పై విచారణ సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ హిమా కోహ్లిలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపిస్తూ.. ప్రజల కోసం నిర్మించే ఈ ప్రాజెక్టు వేలాదిమందిపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ ప్రాజెక్టుపై పదేపదే పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ పిటిషన్‌లో పిటిషనర్ వాదనలు వినాల్సి ఉందని జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. మరికొంత సమాచారం అందించడానికి అనుమతించాలని నాగం జనార్దన్‌రెడ్డి తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టును కోరారు. అనుమతించిన ధర్మాసనం విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

రామయ్య ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రారంభం..



సాక్షి, హైదరాబాద్: ఇంటర్ పూర్తయిన విద్యార్థినీ, విద్యార్థులకు జేఈఈ, ఐఐటీ, నీట్ ప్రవేశపరీక్షలకు షార్ట్‌టర్మ్, లాంగ్‌టర్మ్ కోచింగ్ కోసం రామయ్య ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రారంభమైంది. ఈమేరకు సోమవారం సంస్థ చైర్మన్ సిరికొండ లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్ సిరికొండ సునీత అకాడమీని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రామయ్య ఎడ్యుకేషనల్ అకాడమీలో జేఈఈ, ఐఐటీ, నీట్ ప్రవేశపరీక్షలతోపాటు 6 నుంచి 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ఫౌండేషన్ కోచింగ్, ఎన్‌టీఎస్ఈ, ఒలంపియాడ్‌లకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఫీజులో రాయితీ కోసం ఈనెల 8వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు రామయ్య ఎడ్యుకేషనల్ అకాడమీ కోచింగ్ సెంటర్, ఫ్లాట్ నెం 103, 104 ఫస్ట్‌ఫ్లోర్, వాణిజ్య విహార్, విజయా డయాగ్నొస్టిక్స్ ఎదురుగా, దిల్‌సుఖ్‌నగర్ మెయిన్‌రోడ్‌లో ఫ్రీ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రామయ్య పోలీస్ అకాడమీ డైరెక్టర్ రమేశ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

బీజేపీ మళ్లీ గెలిస్తే వినాశనమే

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

- మోదీ సర్కారును ఓడించేందుకు లౌకిక శక్తులు ముందుకురావాలి
- సమష్టిగా వ్యూహ రచన చేయాలి



మీడియాతో మాట్లాడుతున్న డి.రాజా. చిత్రంలో అజీజ్‌పాషా, కూనంనేని

సాక్షి, హైదరాబాద్: బీజేపీని ఓడించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. వచ్చే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు లౌకిక, ప్రజాతంత్ర పార్టీలు సమిష్టిగా సరైన వ్యూహ రచన చేయాలని, ఇందుకు జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి పార్టీలు వాస్తవిక దృక్పథంతో వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఫాసిస్టు శక్తుల భారతీయ పరివర్తనా రూపమే (ఇండియన్ వేరియెంట్) ఆర్ఎస్ఎస్, బీజేపీ అని విమర్శించారు. బీజేపీ మళ్లీ గెలిస్తే దేశ వినాశనం తప్పదని హెచ్చరించారు. సోమవారం పార్టీ జాతీయ కార్యదర్శి సయ్యద్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది తెలంగాణ, తమిళనాడు, త్రిపుర తదితర రాష్ట్రాల శాసనసభలకు జరిగే ఎన్నికల్లో కూడా బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలని రాజా ప్రజలకు పిలుపునిచ్చారు. లౌకిక, ప్రజాతంత్ర పార్టీలన్నీ ఒక చోటకు చేరాలన్నారు. మోదీ పాలనలో ఆర్థిక సంక్షోభం తారాస్థాయికి చేరుకుందని, నిరుద్యోగిత రేటు 18 నెలల్లో అత్యధికంగా 8.5 శాతానికి పైగా నమోదైందని చెప్పారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా పేదలు మరింత నిరుపేదలవగా, అదానీ, అంబానీ వంటి వారి సంపద మరింత పెరిగి, వారు ప్రపంచ శత కోటీశ్వరులతో పోటీ పడుతున్నారని అన్నారు.

జమిలి ఎన్నికలు ఆచరణ సాధ్యం కాదు

పార్లమెంటు, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంపై సీపీఐ అభిప్రాయం కోరుతూ జాతీయ లా కమిషన్ ఇటీవల లేఖ రాసిందని డి.రాజా తెలిపారు. ఒకే దేశం, ఒకే ఎన్నికలు అనేది బీజేపీ విధానమని, అయితే బహుళ రాజకీయ పార్టీల వ్యవస్థ కలిగిన భారతదేశంలో ఇది అసాధ్యమని ఆయన పేర్కొన్నారు. నిరంతరం ఎన్నికలు జరుగుతుంటే స్థిరమైన ప్రభుత్వాలు ఎలా ఉంటాయనే ప్రశ్నకు అంబేడ్కర్ సమాధానం చెబుతూ.. మనకు స్థిరమైన ప్రభుత్వం కావాలా? జవాబుదారీ ప్రభుత్వం కావాలా? అంటే తాను జవాబుదారీ ప్రభుత్వాన్నే కోరుకుంటానని చెప్పార న్నారు. ప్రస్తుతం మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం జవాబుదారీతనం లేని ప్రభుత్వమని విమర్శించారు.నోట్ల రద్దు విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చింది ఏకగ్రీవ తీర్పు కాదని, ధర్మాసనంలో మెజారిటీ జడ్జీలు నోట్ల రద్దును సమర్థించినప్పటికీ, ఒక జడ్జి అందుకు భిన్నంగా వేరే తీర్పును ఇచ్చారని తెలిపారు.

డబ్బు, మతమే బీజేపీ ఎజెండా: కూనంనేని

ప్రజా సమస్యలపై పోరాటాలను వదిలేసి, డబ్బు, మతం ఎజెండాతో రాష్ట్రంలో అధికారంలోకి రావాలని బీజేపీ భావిస్తోందని కూనంనేని విమర్శించారు. టీఆర్ఎస్‌తో మునుగోడులో అవగాహన ఉన్నా ప్రజాసమస్యలపై సీపీఐ నిరతరం పోరాటాలను కొనసాగిస్తోందని, భూసమస్యలు,గవర్నర్ వ్యవస్థ, పోలీసు రిక్రూట్‌మెంట్‌లో తప్పులపై ఉద్యమాలు చేస్తోందన్నారు. బీజేపీ ఒక్క ప్రజా సమస్యపైనైనా పోరాటం చేసిందా అని ప్రశ్నించారు.

ముస్లింలకు అండగా నిలబడతా..

- పదవులు రాలేదని ఖమ్మంలో బీజేపీని పుట్టించాలని చూస్తున్నారు
- ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్



ఖమ్మంలో జరిగిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి అజయ్

ఖమ్మం మయూరిసెంటర్: కొందరికి పదవులు రాలేదనో, రావనో లేక ఇతర కారణాలో తెలియదు కానీ.. ఖమ్మంలో బీజేపీని పుట్టించాలని చూస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఖమ్మంలోని షాదీఖానాలో సోమవారం ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. 'మతతత్వ పార్టీలకు ఖమ్మం వేదిక కాదని గుర్తుపెట్టుకోండి.. తస్మాత్ జాగ్రత్త' అని సూచించారు. ప్రభుత్వంలో ఇద్దరు ముస్లింలు మంత్రులుగా ఉంటే అందులో ఒకరు మహమూద్ అలీ, రెండో వ్యక్తి అజయ్‌ఖాన్ అని పేర్కొన్నారు. తనకు ఆత్మీయులైన ముస్లిం మైనార్టీలతో మొదటి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పువ్వాడ తెలిపారు. కమ్యూనిస్టు కుటుంబం నుంచి వచ్చిన తాను ఇప్పటి మాదిరిగానే భవిష్యత్‌లోనూ ముస్లింలకు అండగా నిలబడతానని వెల్లడించారు. మతతత్వ శక్తులపట్ల ముస్లిం యువత అప్రమత్తంగా ఉంటూ బీఆర్ఎస్ అభివృద్ధి కోసం కృషి చేస్తూనే, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టేందుకు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. గతంలో ఎక్కువ శాతం మైనార్టీలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినా, తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్ఎస్‌ను నమ్ముతున్నారన్నారు. సెక్యులరిజాన్ని కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని నమ్మిన ముస్లిం మైనారిటీలు ఈ పార్టీని వదులుకునేందుకు సిద్ధంగా లేరని తెలిపారు. ఖమ్మంలో ఇంత అభివృద్ధి, పేదలకు సంక్షేమ పథకాలు అందడానికి తనకు వ్యక్తిగతంగా సాధ్యం కాలేదని, ప్రభుత్వం వల్లే ఇంత చేయగలిగామని తెలిపారు. వేలాది మంది కార్యకర్తలు ఉండగా, అందరికీ పదవులు ఇవ్వలేమని.. పది, పదిహేను మందికే ఇవ్వగలమన్నారు. చాలామందికి పదవులు రాకపోయినా బాధ్యతతో వ్యవహరిస్తుండగా... కొందరికి పదవులు వచ్చినా కడుపునొప్పి ఎందుకో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. వేదికపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బాల్క సుమన్, ప్రశాంత్‌రెడ్డి, గంగుల, జగదీశ్‌రెడ్డి, రావెల, తోట చంద్రశేఖర్, వద్దిరాజు, ఎర్రబెల్లి, మల్లారెడ్డి, జీవన్‌రెడ్డి, గణేశ్ గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కేంద్రంలో గద్దెనెక్కితే.. వెలుగు జిలుగులే

▶ మొదటి పేజీ తరువాయి

రూపాయల విలువైన రైల్వే, విమాన, నౌకాశ్రయాలు, టెలిఫోన్ సంస్థలను మోదీ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలకు అమ్మేతోంది. మేం అధికారంలోకి వస్తే అవన్నీ వాపస్ తీసుకుని ప్రభుత్వ రంగంలో చేర్చుతాం.

అన్ని వనరులు ఉన్నా అభివృద్ధి లేదు..

స్వాతంత్య్రం తర్వాత నెహ్రూ, అంబేడ్కర్ తదితరుల మార్గదర్శకత్వంలో చక్కటి ప్రయాణం మొదలై దేశాన్ని ముందుకు నడిపే ప్రయత్నాలు సాగాయి. కానీ తర్వాతి కాలంలో రాజకీయాలు, ప్రజాజీవితంలో జరిగిన మార్పులతో దేశం గమ్యాన్ని చేరుకోలేదు. అమెరికా, చైనాతో పోలిస్తే దేశ విస్తీర్ణంలో సగానికిపైగా అంటే 40కోట్ల ఎకరాల సాగుయోగ్య భూమి, ఆపిల్స్ మొదలుకుని మామిడి పండ్లు దాకా పండే పర్యావరణ మండలాలు, 40వేల టీఎంసీల నీరు, పనిచేసే మానవ వనరులు అందుబాటులో ఉన్నా అనుకున్న రీతిలో అభివృద్ధి జరగలేదు. కేంద్ర విధానాలు సరిగా లేకపోవడం వల్లే 13 నెలల పాటు ఢిల్లీ శివారులో రైతులు ఆందోళన చేశారు. అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. దేశంలో స్థాపిత విద్యుత్ సామర్థ్యం 4 లక్షల మెగావాట్లు ఉన్నా ఏనాడూ 2.10లక్షల మెగావాట్లకు వినియోగం మించడం లేదు. ఈ దుస్థితిని నివారించేందుకు ప్రజాజీవితంలో ఉన్న ప్రతివ్యక్తి ఆలోచించాలి. లక్ష్యశుద్ధి, సంకల్ప శుద్ధితో సాధించలేనిది ఏమీ ఉండదు. ఇది గతంలో అనేక సార్లు రుజువైంది.

రాజకీయాల్లో ఉండాల్సిన లక్షణం ఇదేనా?

సువిశాల భారతదేశానికి సామూహిక లక్ష్యం లేకుండా పోయింది. ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా లక్షల అబద్ధాలు, కోట్లకొద్దీ డబ్బు కుమ్మరిస్తున్నారు. మత కల్లోలాలు రేపుతున్నారు. పదవులు రాగానే నేతలు నేల విడిచి సాము చేస్తూ అసహజంగా ప్రవర్తిస్తున్నారు. రాజకీయాల్లో ఉండాల్సిన లక్షణం ఇదేనా? మనం సింగపూర్, చైనా తరహాలో పురోగతి ఎందుకు సాధించలేకపోయాం? జింబాబ్వే, రష్యా, చైనా, అమెరికా తదితర దేశాల తరహాలో భారత్‌లో భారీ జలాశయాలు ఎందుకు లేవు? కేంద్ర ప్రభుత్వ విధానాలు సక్రమంగా లేకపోవడం, పార్టీలు ప్రజలను వంచించడం వల్లే ఈ దుస్థితి నెలకొంది. ప్రజలు గెలవాల్సిన చోట పార్టీలు, నాయకులు గెలుస్తున్నందునే ప్రజల ఆకాంక్షలు కనుమరుగవుతున్నాయి. భారత్ బుద్ధూ దేశం కాదు.. బుద్ధిమంతుల దేశం. ప్రతి గుండెను చేరగలిగితే భారత్ స్పందిస్తుందని గతంలో జయప్రకాశ్ నారాయణ్ నిరూపించారు. ఉజ్వల భారత్ నిర్మాణం వైపు అందరినీ సిద్ధం చేయడమే బీఆర్ఎస్ లక్ష్యం. బీఆర్ఎస్ ఒక ప్రాంతం, భాష, వ్యక్తికి పరిమితం కాదు. ఏ గొప్ప పని ప్రారంభించినా అవహేళనలు ఎదురవుతాయి. మొదట కొంచెం హేళన చేయడం ప్రారంభిస్తారు. తర్వాత మన మీద దాడి చేస్తారు. చివరికి మనకు విజయం చేకూరుతుంది. ఇదొక యజ్ఞం.. కష్టాలు, నష్టాలు వస్తాయి.

సంక్రాంతి తర్వాత దూకుడే..

భవిష్యత్తులో పార్టీ కేడర్‌కు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. బీఆర్ఎస్‌లో చేరేవారికి స్వాతంత్య్ర సమరయోధుల తరహాలో గుర్తింపు దక్కుతుంది. దేశ వ్యాప్తంగా 6.64 లక్షల గ్రామాల్లో బీఆర్ఎస్ కమిటీల ఏర్పాటుతో కార్యాచరణ మొదలవుతుంది. 4,123 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అడుగుపెడతాం. విద్యార్థి, మహిళా కమిటీలు కూడా ఏర్పాటు చేస్తాం. ఏపీ, మహారాష్ట్ర, పంజాబ్, హరియాణా, ఒడిషా వంటి ఏడెనిమిది రాష్ట్రాల్లో సంక్రాంతి తర్వాత బీఆర్ఎస్ కార్యక్రమాలను ఉరుకులు పరుగులు పెట్టిస్తాం. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు.. తూర్పు కనుమల నుంచి పశ్చిమ కనుమల వరకు పార్టీని విస్తరిస్తాం. ప్రజల సమస్యలే ఇతివృత్తం, పరిష్కారమే బీఆర్ఎస్ లక్ష్యం.

ఏపీ ప్రజలూ కలిసిరావాలి

భారత్‌ను ఉజ్వలంగా తయారుచేసే మహాయజ్ఞంలో ఏపీ ప్రజలు కూడా భాగస్వాములు కావాలి. బీఆర్ఎస్‌లో చేరిక కోసం తట్టుకోలేనంత ఒత్తిడి వస్తోంది. త్వరలోనే ఆశ్చర్యపరిచే రీతిలో చేరికలు ఉంటాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా ఫోన్లు చేస్తున్నారు. మీరు సిట్టింగ్ కదా అని అడిగితే.. తాము అక్కడ ఫిట్టింగ్‌గా లేమని అంటున్నారు..'' అని కేసీఆర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీకి చెందిన తాడివాక రమేశ్‌నాయుడు (కాపునాడు జాతీయ అధ్యక్షుడు), గిద్దల శ్రీనివాస్‌నాయుడు (కాపునాడు ప్రధాన కార్యదర్శి), రామారావు (ఏపీ ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు), భారతి (మంగళగిరి) తదితరులకు కేసీఆర్ గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

బీఆర్ఎస్, బీజేపీ | నా ఫోన్ ట్యాప్ చేస్తున్నాయి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్



ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: ప్రశ్నించే గళాలను అణచివేయడానికి బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఈ కుట్రల్లో భాగంగా తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. తన ఆపిల్ సెల్‌ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నట్లు ఆ సంస్థ తనకు మెయిల్ పంపించిందని తెలిపారు. ప్రవీణ్‌కుమార్ చేపట్టిన రెండో విడత బహుజన రాజ్యాధికార యాత్ర సోమవారం కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బహుజన రాజ్యం కోసం తాను చేస్తున్న పోరాటాన్ని జీర్ణించుకోలేక, బీఎస్పీకి పెరుగుతున్న ఆదరణను తట్టుకోలేక ప్రభుత్వాలు ఇలాంటి నేరపూరిత చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు జర్నలిస్టులు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని, బీజేపీ, బీఆర్ఎస్ కలిసే ఈ పనిచేస్తున్నాయని ఆరోపించారు. కాగా, రైతుస్వరాజ్య వేదిక నాయకులను ఉద్దేశించి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, రైతులకు పల్లా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సిర్పూర్ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల ఆగడాలు ఎక్కువయ్యాయని, పేదల భూములను ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధ్యక్షుడు ఆకుల సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల బకాయిలపై | శ్వేతపత్రం విడుదల చేయాలి

నల్లగొండ ఎంపీ ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: మోసపూరిత బదిలీ ద్వారా రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు రావాల్సిన రూ.35 వేల కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించిందని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సిన ఆర్థిక సంఘం నిధులను దోచుకోవడానికే రాష్ట్ర ప్రభుత్వం నాటకం ఆడిందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోనే తెలంగాణ మోడల్ అని, రిచెస్ట్ స్టేట్ అని అభివర్ణిస్తున్న రాష్ట్రంలో పథకాల అమలుకు నిధులు లేకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. పథకాల అమలు మాట అటుంచితే ఉద్యోగులకు సమయానికి వేతనాలు అందడం లేదని, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా ఒక పద్దు నిధులను మరో పద్దుకు బదిలీ చేయడంతో చేతులు దులుపుకుంటోందని ఉత్తమ్ మండిపడ్డారు. రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అప్పులపాలై సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకునేందుకు సీఎం కేసీఆరే కారణమని ఆరోపించారు. సర్పంచ్‌లకు మద్దతుగా ఆందోళన చేసేందుకు సిద్ధమైన కాంగ్రెస్ నేతలను గృహ నిర్బంధం చేయడాన్ని ఆ ప్రకటనలో ఉత్తమ్ తీవ్రంగా ఖండించారు.

సర్వం 'త్రిమూర్తుల' కనుసన్నల్లోనే!

▶ మొదటి పేజీ తరువాయి



రంగంలోకి దిగి పనిచేయడం ప్రారంభించాయి.

ఐఐటీ, ఐఐఎం నిపుణులతో...

దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీ, ఐఐఎంలలో పట్టాలు పొందిన వారిని బీజేపీ అధినాయకత్వం రంగంలోకి దించింది. ఎన్నికలకు సంబంధించిన కసరత్తు, గణాంకాల సేకరణ, విశ్లేషణలతో అనుభవమున్న వారిని ఈ విధులకు వినియోగిస్తున్నట్టు తెలిసింది. ఒక్కో అసెంబ్లీ స్థానం పరిధిలోకి వచ్చే మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు.. వాటి పరిధిలోని కులాలు, వర్గాల వారీగా ఓట్లు ఎన్ని ఉన్నాయనేది వీరు సేకరిస్తున్నారు. ఆ నియోజక వర్గంలో పోటీకి సిద్ధపడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీల అభ్యర్థులు ఎవరు, వారి సామాజికవర్గం, ఎన్ని ఓట్లు ఉన్నాయి, ప్రభావితం చేసే కులాలు, ఆయా అభ్యర్థుల బలాలు, బలహీనతలు, అక్కడి రాజకీయ పరిస్థితులపైనా ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి, బీఆర్ఎస్ లోటుపాట్లు, రాజకీయంగా ఎదురవుతున్న సవాళ్లు తదితర అంశాలపై ఈ బృందాలు ఎప్పటికప్పుడు నివేదికలు పంపుతున్నాయి. దీనికి సంబంధించి ఒక ప్రత్యేక వ్యవస్థ పార్టీకి సమాంతరంగా పనిచేస్తోంది. ఆయా పర్యటనల్లో పార్టీ ముఖ్య నేతలు ఏ అంశాలు మాట్లాడాలి, ఎలాంటి హామీలు ఇవ్వాలి, ఫీడ్‌బ్యాక్ తదితరాల్లోనూ ఏబీఎం సూచనలే కీలకంగా మారినట్టు తెలుస్తోంది. రాష్ట్ర పార్టీలోని అన్ని స్థాయిల నాయకులకు బాధ్యతల నిర్వహణపై టార్గెట్లు విధించడంతోపాటు ఆయా బాధ్యతలను వారు ఎలా నిర్వర్తిస్తున్నారనే దానిపైనా పర్యవేక్షణ సాగిస్తున్నట్టు సమాచారం.

అభివృద్ధి పనులు సత్వరం చేయండి: ఎర్రబెల్లి

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత కీలకమని, వివిధ అభివృద్ధి కార్యక్రమాల పనులు సత్వరం పూర్తి చేయడంతో పాటు నాణ్యతలు పాటించాలని తమ శాఖ వివిధ విభాగాల అధికారులకు పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ పనుల్లో జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ వేగంగా నిర్వహించాలన్నారు. ఈ ఏడాది పీఆర్ శాఖాపరంగా వివిధ విభాగాల్లో పనులు వేగంగా, సమర్థంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం మంత్రిని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ హనుమంతరావు, డిప్యూటీ కమిషనర్లు రవీందర్‌రావు, రామారావు, ఈఎన్సీ సంజీవరావు, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి కలుసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

7న బీజేపీ పోలింగ్ బూత్ సభ్యుల సమ్మేళనం...

ఆ లోగా సంస్థాగత కమిటీల నియామకం పూర్తిచేయాలని ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 7న రాష్ట్రంలోని 119 అసెంబ్లీ కేంద్రాల్లో (ఒక్కో నియోజకవర్గంలో 3, 4 వేల మందితో) 'బీజేపీ పోలింగ్ బూత్ సభ్యుల సమ్మేళనం' నిర్వహించనున్నారు. ఈ సమ్మేళనాల సందర్భంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా లైవ్ ప్రసంగం లేదావీడియో రికార్డ్‌ను ప్రదర్శించనున్నారు. ఈ నెల 4 నుంచి 7 తేదీల మధ్య పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీలు, పాలక్‌లు వారికి కేటాయించిన నియోజకవర్గాల్లోని కార్యకర్తల ఇళ్లలోనే బస చేయాలని జాతీయ నాయకత్వం ఆదేశించింది. ఈ నెల 7లోగా అన్ని అసెంబ్లీ స్థానాల్లోని ఒక్కో పోలింగ్ బూత్ కమిటీలో 22 మంది చొప్పున సభ్యుల నియామకం, నాలుగైదు పోలింగ్‌బూత్ లకు కలిపి ఒక శక్తి కేంద్రం ఏర్పాటు, మండలపార్టీ కమిటీల ఏర్పాటు, తదితర సంస్థాగత కమిటీల నియామకం పూర్తిచేయాలని ఆదేశించింది.

ఉదయం 10 నుంచి 2 వరకు...

ఈ నెల 7న ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ఈ సమ్మేళనాలు ఉంటాయని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఈ సమ్మేళన సన్నాహకాల నిమిత్తం రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ ఆధ్వర్యంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఢిల్లీ నుంచి రాష్ట్ర ఇన్‌చార్జీలు తరుణ్ చుగ్, సునీల్ బన్సల్ పాల్గొన్నారని తెలియజేశారు. జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో భేటీలు నిర్వహించారన్నారు. ఈ సమావేశాల్లో జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె.అరుణ, తమిళనాడు సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ పాల్గొన్నారని తెలిపారు.



మల్లు రవిని నిర్బంధిస్తున్న పోలీసులు



హౌస్ అరెస్ట్‌లో జీవన్‌రెడ్డి



గాంధీభవన్ వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఎక్కడికక్కడ నిర్బంధం

▶ మొదటి పేజీ తరువాయి

జరగడం, కార్యకర్తలు గేట్లు దూకి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఇలావుండగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు.

పక్కా ప్రణాళికతో ఉక్కుపాదం

రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాను అడ్డుకునేందుకు పోలీసులు పక్కా ప్రణాళికను అమలు చేశారు. జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసంతో పాటు పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకుల ఇళ్ల వద్ద మోహరించి వారు బయటకు రాకుండా అడ్డుకున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. మధ్యాహ్నం సమయంలో రేవంత్ తన నివాసం నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించడంతో ఆయన్ను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో రేవంత్.. 'నా ఇంటి వద్దకే వచ్చి నన్ను బయటకు వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం ఏమిటంటూ నిలదీశారు. అయినా పట్టించుకోకుండా అక్కడినుంచి వాహనంలో బొల్లారం పీఎస్‌కు తరలించారు. కాగా రేవంత్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. ఆయన్ను వెంటనే విడుదల చేయాలంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. పీఎస్ ఎదుట సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు.

పోలీసుల తీరును ఖండించిన నేతలు

కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళనను పోలీసులు అడ్డుకున్న తీరును పలువురు నేతలు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ఎమ్మెల్యేలు సీతక్క, శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్‌యాదవ్, పార్టీ సీనియర్ నేతలు షబ్బీర్‌అలీ, ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బలరాం నాయక్, సంపత్‌కుమార్, రేణుకాచౌదరి, వంశీచందర్‌రెడ్డి, చిన్నారెడ్డి, మల్లు రవి, పొన్నం ప్రభాకర్ తదితరులు పోలీసుల వైఖరిని ఖండించారు.

రూ. 35 వేల కోట్ల నిధులు కాజేశారు..

సీఎంపై రేవంత్‌రెడ్డి ఆరోపణ

నిధులు ఇవ్వకపోవడంతో గ్రామ పంచాయతీలన్నీ నిర్వీర్యం అయ్యాయని, అప్పులు చేసి గ్రామ అభివృద్ధి పనులు చేపట్టిన సర్పంచ్‌లు, ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు ఇవ్వాల్సిన రూ.35 వేల కోట్ల నిధులను కాజేసిన గజదొంగ సీఎం కేసీఆర్ అని ఆరోపించారు. బొల్లారం పీఎస్ నుంచి బయటకు వచ్చిన అనంతరం రేవంత్ అక్కడ మీడియాతో మాట్లాడారు. నెలనెలా పంచాయతీలకు చెల్లించాల్సిన వందలాది కోట్ల రూపాయలను ఇవ్వకపోగా, కేంద్రం ఇచ్చిన వేల కోట్ల రూపాయల 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా కొల్లగొట్టారని విమర్శించారు. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీలకు నేరుగా నిధు లు ఇవ్వాల్సి ఉండగా, రాజ్యాంగ స్ఫూర్తిని విస్మరించిన కేసీఆర్, పంచాయతీరాజ్ వ్యవస్థనే నాశ నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. రూ.35 వేల కోట్లు మళ్లించి కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. గ్రామాలకు ఇవ్వాల్సిన నిధులను కాజేసిన కేసీఆర్‌ను జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు.

బీజేపీ విచారణ ఎందుకు కోరడం లేదు?

కేంద్రం ఇచ్చిన నిధులు దుర్వినియోగమైతే దాని మీద విచారణ చేయాలని బీజేపీ నేతలు కిషన్ రెడ్డి తదితరులు ఎందుకు డిమాండ్ చేయడం లేదని రేవంత్ ప్రశ్నించారు. తండాలను గ్రామ పంచాయతీలు చేశానని గొప్పలు చెప్పుకుంటున్న కేసీఆర్ ఏ తండాలోనైనా గ్రామ పంచాయతీలకు భవనాలు నిర్మించారా? అని ప్రశ్నించారు. గ్రామాల్లో శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనం పనుల పేరుతో సర్పంచ్‌లు అప్పుల పాలయ్యారని తెలిపారు. సిరిసిల్లలో ఆనంద్ రెడ్డి అనే సర్పంచ్ అప్పు చేసి అభివృద్ధి పనులు చేపట్టాడని, డబ్బు కోసం అప్పులోళ్లు నిలదీస్తే ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. మునుగోడు సర్పంచ్ జీతాల కోసం బస్టాండ్‌లో భిక్షమెత్తేందుకు ప్రయత్నించాడని, సూర్యాపేటలో శాంతమ్మ అనే సర్పంచ్.. చేసిన అప్పులు తీర్చలేక తాళిబొట్టు తాకట్టు పెట్టిందని పేర్కొన్నారు. సర్పంచ్‌లకు కాంగ్రెస్ అండగా నిలబడితే ప్రభుత్వం భయపడుతోందని ఎద్దేవా చేశారు.

క్లుప్తంగా...

ఇల్లు నిర్మించుకునేవారికి రూ. 3 లక్షలు..

- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు
- సంక్రాంతి తర్వాత ఆర్థిక సాయం అందజేత



స్వర్ణ కిరీటాన్ని తీసుకెళ్తున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: సంక్రాంతి పండుగ తర్వాత సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేవారికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం ఆయన సిద్దిపేట పట్టణంలోని వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి 2 కిలోల స్వర్ణ కిరీటాన్ని స్వామి వారికి కానుకగా సమర్పించారు. మంత్రి హరీశ్‌రావుతోపాటు భక్తులు ఇచ్చిన విరాళాలతో ఈ కిరీటాన్ని రూపొందించారు. అనంతరం ఆయన బస్తీ దవాఖానాను ప్రారంభించి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో హరీశ్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. బస్తీ ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకే ఈ బస్తీ దవాఖానాను ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, ఇతర నేతలు పాల్గొన్నారు.

నేడు సీడబ్ల్యూఓ అర్హత పరీక్ష

ఏర్పాట్లు పూర్తిచేసిన టీఎస్‌పీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలో బాలల సంరక్షణాధికారి (సీడబ్ల్యూఓ) పోస్టులకు సంబంధించి అర్హత పరీక్ష నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీ ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 23 సీడబ్ల్యూఓ ఖాళీలకు 19,812 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1,394 మంది టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నట్లు కమిషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. అర్హత పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాల పరిధిలో 75 కేంద్రాల్లో సీబీఆర్‌టీ పద్ధతిలో నిర్వహించనుంది. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులను పరీక్ష సమయానికి గంటన్నర ముందే అనుమతిస్తారు. పరీక్ష సమయానికి 45 నిమిషాల ముందు సెంటర్ గేట్లు మూసివేయనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటనలో తెలిపింది.

బీఎల్ సంతోష్‌కు 41ఏ నోటీసులపై స్టే పొడిగింపు..

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత బీఎల్ సంతోష్, కేరళ వైద్యుడు జగ్గుస్వామి, తుషార్, న్యాయ వాది భూసారపు శ్రీనివాస్‌లకు సిట్ జారీ చేసిన 41ఏ సీఆర్‌పీసీ నోటీసులపై విధించిన స్టేను హైకోర్టు ఈ నెల 23 వరకు పొడిగించింది. ఈ వ్యవహారంలో కోర్టు నవంబర్ 25న స్టే విధించడం, లుక్‌అవుట్ నోటీసులను కూడా నిలుపుదల చేయడం తెలిసిందే. 41ఏ నోటీసు, లుక్‌అవుట్ నోటీసులను కొట్టివేయాలంటూ ఆ నలుగురు హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్ సోమవారం విచారణ జరిపి స్టేను పొడిగించారు. తదుపరి విచారణను వాయిదా వేశారు.

మద్యం స్కాం నిందితులకు రిమాండు పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితులకు రౌజ్ అవెన్యూ కోర్టు జ్యుడీషియల్ రిమాండు పొడిగించింది. అభిషేక్ బోయినపల్లి, బినోయ్‌బాబు, విజయ్ నాయర్, శరత్‌చంద్రా రెడ్డిల రిమాండు ముగియడంతో ఈడీ అధికారులు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీరిని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగ పాల్ ముందు హాజరు పరిచారు. కేసు దర్యాప్తు వేగవంతం అవుతోందని మరికొన్ని రోజులు నిందితులకు రిమాండు పొడిగించాలని ఈడీ తరఫు సీనియర్ న్యాయవాది నవీన్‌కుమార్ కోరారు. విచారణలో పలు విషయాలు వివరించారని తెలిపారు. కేసు పురోగతి వివరిస్తూ ఈ నెల 5 అనుబంధ ఛార్జిషీటు దాఖలు చేయ నున్నట్లు వివరించారు. ఈడీ విజ్ఞప్తిని పరిగణించిన న్యాయమూర్తి నిందితులకు జనవరి 6 వరకూ జ్యుడీషియల్ రిమాండు పొడిగించారు. తదుపరి విచారణ జనవరి 7కు వాయిదా వేశారు.

ఎమ్మెల్యేలకు ఎర కేసు.. పిటిషన్ ఉపసంహరణ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఎమ్మెల్యేలకు ఎర అంశంపై కేంద్రమంత్రి అమిత్ షాను విచారించాలంటూ దాఖలైన పిటిషన్‌ను పిటిషనర్ ఉపసంహరించుకున్నారు. తెలంగాణలో ఎమ్మెల్యే కొనుగోలు అంశంపై సిట్ దర్యాప్తునకు ఆదేశించాలని, అమిత్‌షాను కూడా విచారించాలని సామాజిక కార్యకర్త ఎం.ఎల్. శర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. అయితే, ఈ కేసులో తాజా పరిణామాల నేపథ్యంలో తాను పిటిషన్ ఉపసంహరించుకుంటున్నానన్న పిటిషనర్ అభ్యర్థనను ధర్మాసనం అనుమతించింది.

పండుగ నాటికి 12,000 పోస్టులు

- ఇక గురుకుల కొలువుల సంబురాలు!
- కేటగిరీల వారీగా జారీకి టీఆర్‌ఈఐఆర్‌బీ కసరత్తు
- బీసీ గురుకుల సొసైటీలో కొన్ని పోస్టులకు రాని క్లియరెన్స్
- ఒకట్రెండు రోజుల్లో వాటికి గ్రీన్ సిగ్నల్.. ఆ తర్వాత వరుసగా ప్రకటనలు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ ఖాళీల భర్తీలో భాగంగా ఇప్పుడు గురుకుల కొలువులకు సమయం ఆసన్నమైంది. గత నెల రోజులుగా తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ), తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎంహెచ్‌ఎస్ఆర్‌బీ) ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీ ప్రకటనలు జారీ అయ్యాయి. ఉద్యోగాల భర్తీకి రాష్ట్రంలో నాలుగు ప్రధాన నియామక సంస్థలుండగా.. మూడు సంస్థల ద్వారా నోటిఫికేషన్లు వెలువడ్డాయి. కానీ తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్‌ఈఐఆర్‌బీ) ద్వారా మాత్రం ఇప్పటివరకు ఒక్క ప్రకటన కూడా విడుదల కాలేదు. వాస్తవానికి 9 వేల కొలువులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్నిరకాల అనుమతులు జారీ చేసింది. దీంతో సంబంధిత గురుకుల సొసైటీలు ప్రతిపాదనలు పంపాయి. అయితే బీసీ గురుకుల సొసైటీ పరిధిలో కొత్త పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు కావడంతో వాటికి శాశ్వత ప్రాతిపదికన పోస్టులు మంజూరయ్యాయి. దీంతో వీటికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా ఇస్తే ఒకేసారి ప్రకటనలు విడుదల చేయవచ్చని గురుకుల నియామకాల బోర్డు సూచించింది. అయితే బీసీ గురుకుల సొసైటీ పరిధిలో కొత్తగా మంజూరైన పోస్టులకు ప్రభుత్వ అనుమతులు రావడంలో ఇప్పటివరకు జాప్యం నెలకొంది. దీంతో కొలువుల ప్రకటనల జారీ కాస్త ఆలస్యమైంది. ప్రస్తుతం వీటికి సంబంధించిన అనుమతులు దాదాపుగా వచ్చాయి. ఈ క్రమంలో ఉద్యోగ ప్రకటనల జారీకి టీఆర్‌ఈఐఆర్‌బీ కసరత్తు వేగవంతం చేసింది.

పండుగ నాటికి ప్రకటనల జారీ..

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతులు సంక్షేమ విద్యా సంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎంఆర్‌ఈఐఎస్) పరిధిలో 9,096 కొలువుల భర్తీకి ప్రభుత్వం ఇదివరకే ఆమోదం తెలిపింది. తాజాగా బీసీ గురుకులాల్లో మరో 3 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందులో దాదాపు 69 కేటగిరీలకు చెందిన కొలువులున్నాయి. ఈ పోస్టుల భర్తీకిగాను గురుకుల సొసైటీలు జోనల్, మల్టీజోనల్, జిల్లా కేడర్లు, రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్లు తదితర పూర్తిస్థాయి సమాచారంతో రూపొందించిన ప్రతిపాదనలను గురుకుల నియామకాల బోర్డుకు సమర్పించాయి. బోర్డు అధికారులు వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి నిర్ధారించుకున్నాక ప్రకటనలు జారీ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. పరిశీలన ప్రక్రియతో పాటు బీసీ గురుకుల సొసైటీకి సంబంధించిన కొన్ని పోస్టులకు పూర్తిస్థాయి అనుమతులు జారీ అయ్యేందుకు మరో రెండ్రోజుల సమయం పడుతుందని సొసైటీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో రానున్న వారం, పది రోజుల్లో అంటే సంక్రాంతి పండుగ నాటి కల్లా టీఆర్‌ఈఐఆర్‌బీ నుంచి ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు శ్రీధర్‌రెడ్డి కన్నుమూత

1969 నాటి ఉద్యమంలో ఉస్మానియా విద్యార్థి నేతగా పోరాటం



సాక్షి, హైదరాబాద్: తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు, నాటి ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేత ఎం.శ్రీధర్ రెడ్డి (77) కన్నుమూశా రు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో శ్రీధర్‌రెడ్డి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యార్థి నేతగా ఉద్యమంలోకి..

1969లో తొలిదశ తెలంగాణ ఉద్యమం జరిగినప్పుడు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు ముందుండి పోరాడారు. ఆ సమయంలో యూనివర్సిటీ విద్యార్థి నేతగా ఉన్న శ్రీధర్‌రెడ్డి.. ఉవ్వెత్తున ఉద్యమాన్ని రేపి, ముందుండి నడిపించారు. అప్పట్లో మర్రి చెన్నారెడ్డి ఏర్పాటు చేసిన సంపూర్ణ తెలంగాణ ప్రజాసమితి (ఎస్‌టీపీఎస్)కు పోటీగా తెలంగాణ ప్రజాసమితి (టీపీఎస్)ని ఏర్పాటు చేశారు. జనతాపార్టీ ఆవిర్భావం తర్వాత అందులో చేరి ఆలిండియా యువ జనతా విభాగానికి అధ్యక్షుడిగా పనిచేశారు. తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్.జనార్దన రెడ్డి ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఏపీ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్‌గా పనిచేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలోనూ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రముఖుల దిగ్భ్రాంతి..

శ్రీధర్‌రెడ్డి మృతి తీరని లోటు అని టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన నాయకత్వ లక్షణాలున్న గొప్ప నేత అని, ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని చెప్పారు. శ్రీధర్‌రెడ్డి మృతి పట్ల రాష్ట్ర కాంగ్రెస్ నేతలు మహేశ్‌కుమార్‌గౌడ్, వీహెచ్, నిరంజన్, కోటూరి మానవతారాయ్ తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీధర్‌రెడ్డి నిఖార్సయిన తెలంగాణ పోరాట యోధుడని.. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అని పేర్కొన్నారు. 1969 తొలి తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకు డిగా రాజీలేని పోరాటం చేసిన శ్రీధర్‌రెడ్డి మర ణం తెలంగాణకు తీరని లోటు అని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు.

విలువల కోసం కట్టుబడిన శ్రీధర్‌రెడ్డి: సీఎం

తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు శ్రీధర్‌రెడ్డి మృతి పట్ల సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో శ్రీధర్‌రెడ్డి చేసిన కృషిని స్మరించుకున్నారు. 1969 నాటి ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన శ్రీధర్‌రెడ్డి.. తాను నమ్మిన విలువలకు కట్టుబడి, రాజీపడకుండా పనిచేశారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. శ్రీధర్‌రెడ్డి మృతి పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ వినోద్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు.

8 ఏళ్లు 3.30 లక్షల కోట్ల పెట్టుబడులు

- కేవలం ఐటీ, అనుబంధ రంగాల్లోనే వచ్చిన పెట్టుబడులివి
- రియల్ ఎస్టేట్, ఆతిథ్య రంగాల్లో మరిన్ని పెట్టుబడులు వచ్చాయి
- 8 ఏళ్లలో ప్రైవేటు రంగంలో 22.5 లక్షల ఉద్యోగాలు లభించాయి
- ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి కేటీఆర్.. అధికారులకు అభినందన



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో సీఎస్ సోమేశ్‌కుమార్, జయేశ్ రంజన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ విప్లవాత్మక విధానాలు, ముఖ్యమంత్రి కేసీఆర్ పారదర్శక పాలనతో గత ఎనిమిదేళ్లలో తెలంగాణకు భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చాయని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక, ఐటీ, అనుబంధ రంగాల పురోగతితోపాటు ఈ ఏడాదిలో చేపట్టబోయే కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలపై తన శాఖల ఉన్నతాధికారులతో మంత్రి కేటీఆర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సులభతర, సత్వర పారిశ్రామిక అనుమతుల జారీ కోసం తీసుకొచ్చిన టీఎస్-ఐపాస్ విధానం కింద 2014 నుంచి 2022 నవంబర్ వరకు కేవలం ఐటీ, అనుబంధ రంగాల్లోనే ఏకంగా రూ. 3.3 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయన్నారు. ఇవి కాకుండా మైనింగ్, రియల్ ఎస్టేట్, లాజిస్టిక్స్, ఆతిథ్య రంగంతోపాటు ఇతర రంగాల్లో వచ్చిన పెట్టుబడులన్నింటినీ కలిపితే ఈ విలువ మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ పెట్టుబడులతో ఇదే కాలానికి రాష్ట్రంలో 22.5 మందికి ఉద్యోగాలు లభించాయని వివరించారు.

పెట్టుబడుల కోసం 14 ప్రాధాన్యతా రంగాలు

తెలంగాణ ఏర్పడిన తొలినాళ్ల నుంచే పారిశ్రామిక రంగంలో పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్లాలని సీఎం కేసీఆర్ సూచించారని మంత్రి కేటీఆర్ చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించేలా ప్రభుత్వ పాలసీలను రూపొందించడంతోపాటు అవసరమైన పారిశ్రామిక పార్కులు, మౌలికవసతుల కల్పనను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా భావించిందన్నారు. ఇందుకోసం రాష్ట్రంలో దాదాపు 14 రంగాలను ప్రాధాన్యతా రంగాలుగా గుర్తించి పక్కా ప్రణాళికతో భారీ పెట్టుబడులను సాధించిందని కేటీఆర్ తెలిపారు. ఒక్కో రంగానికి ప్రత్యేకంగా అధికారిని నియమించడంతోపాటు ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్న కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు నిర్వహించినట్లు కేటీఆర్ వివరించారు. తెలంగాణ ప్రభుత్వ విధానాలు, ఇక్కడి మౌలిక వసతుల గురించి వివరించడం వల్లే అనేక రంగాల్లో భారీగా పెట్టుబడులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో భారీ పెట్టుబడులతో లక్షలాది మందికి ఉపాధి లభించడం తనకు అత్యంత సంతృప్తినిచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఎన్నో ఏళ్లుగా అగ్రస్థానంలో ఉన్న దేశంలోని ఇతర నగరాలను హైదరాబాద్ దాటిందని కేటీఆర్ చెప్పారు. భవిష్యత్తులోనూ రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తాయన్నారు.

పూర్తి పెట్టుబడుల నివేదిక తయారు చేయండి

పెట్టుబడుల సాధనకు కృషి చేసిన అధికారులను అభినందించిన కేటీఆర్... వివిధ రంగాల్లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల పూర్తి వివరాలతో కూడిన నివేదికను తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, టీఎస్‌ఐఐసీఎండీ వెంకట నరసింహారెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఆంజనేయగౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఈడిగ ఆంజనేయగౌడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అందుకు సంబంధించిన నియామకపత్రాన్ని సోమవారం ప్రగతి భవన్‌లో సీఎం చేతుల మీదుగా ఆంజనేయ గౌడ్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త జిల్లాల్లో న్యాయసేవాధికార సంస్థలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ జిల్లాల్లో జిల్లాకోర్టుల ఏర్పాటు నేపథ్యంలో న్యాయ సేవాధికార సంస్థలను హైకోర్టు సోమవారం ప్రారంభించింది. వర్చువల్ విధానంలో న్యాయసేవాధికార సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జస్టిస్ పి.నవీన్ రావు, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు. కొత్తగా ఏర్పాటైన న్యాయ సేవాధికార సంస్థల ద్వారా పేదలకు న్యాయ సాయం అందనుంది.



న్యాయసేవాధికార సంస్థలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్

'సాంఘిక బహిష్కరణపై వెంటనే చర్యలు చేపట్టండి '

నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సాంఘిక బహిష్కరణపై వెంటనే చర్యలు చేపట్టాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ)పై కఠిన నిర్ణయం తీసుకోకపోతే ఇదే విధానం ఇతర గ్రామాలకు వ్యాపించే అవకాశం ఉందని పేర్కొంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ జిల్లా జాక్రాన్‌పల్లిలో కల్లు గీత ద్వారా జీవనోపాధి పొందుతున్న వారిని.. తమ కార్యకలాపాలు కొనసాగించుకోవడానికి అనుమతించినందుకు రూ.10 లక్షలు కట్టాలని వీడీసీ సభ్యులు డిమాండ్ చేశారు. దీన్ని కట్టకపోవడంతో సాంఘిక బహిష్కరణ విధించారు. తమ నిర్ణయాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే.. రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా కట్టాల్సి ఉంటుందని తీర్మానించారు. దీన్ని సవాల్ చేస్తూ జక్రాన్‌పల్లికి చెందిన శంకర్ గౌడ్‌తో పాటు మరో నలుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున వి.మల్లిక్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఇలాంటి బహిష్కరణలను రూపుమామేందుకు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు.

భారత్ రక్షా మంచ్ రాష్ట్ర అధ్యక్షుడిగా భరత్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: భారత్ రక్షా మంచ్ రాష్ట్ర అధ్యక్షుడిగా గవ్వల భరత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బీఆర్ఎం జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కొత్వాల్, జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ ఆచార్య నియామక పత్రాలు పంపించారు. రాష్ట్రంలో ఈ సంస్థ బలోపేతానికి ఆశయాలు ముందుకు తీసుకెళ్లడానికి భరత్ కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. తన నియామకం పట్ల జాతీయ అధ్యక్షుడు సత్యనారాయణ జటియాకు, జాతీయ కన్వీనర్ సూర్యకాంత్ కేల్కర్, ప్రశాంత్ కొత్వాల్, అశోక్ ఆచార్యలకు భరత్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

తుపాకులు అన్‌లాక్ ఎందుకు చేశారు?

'దిశ'ఎన్‌కౌంటర్ కేసులో పిటిషనర్ల న్యాయవాది వాదనలు

- పోలీసులు అన్‌లాక్ చేయడం అనుమానాస్పదం
- సంకెళ్లు ఎందుకు తీసారో చెప్పలేదన్న న్యాయవాది



సాక్షి, హైదరాబాద్: 'ఎన్‌కౌంటర్‌కు ముందు నిందితులు తుపాకులను ఎలా అన్‌లాక్ చేశారు?.. ఒకవేళ పోలీసులే అన్‌లాక్ చేస్తే.. ఎందుకు చేశారో చెప్పడం లేదు. నిందితులపై గతంలోనూ పలు కేసులు ఉన్నాయని చెప్పిన పోలీసులు వారికి సంకెళ్లు ఎందుకు వేయలేదు. ఇలాంటి వన్నీ అనుమానాలకు తావిస్తున్నాయి'అని 'దిశ'ఎన్‌కౌంటర్ కేసులో పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది బృందా గ్రోవర్ సుదీర్ఘ వాదనలు వినిపించారు. 2019, డిసెంబర్ 6న జరిగిన 'దిశ' కేసు నిందితుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి దాఖలైన పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాం జీ ధర్మాసనం సోమ వారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. '2019, నవంబర్ 27న చటాన్‌పల్లి వద్ద ఓ వైద్యురాలు హత్యాచారానికి గురైంది. 28న ఉదయం బాధితురాలి మృతదేహాన్ని కనుగొన్న పోలీసులు.. కొద్ది రోజుల్లోనే నలుగురు అనుమానితులను అరెస్టు చేశారు. డిసెంబర్ 6న ఘటనాస్థలికి వారిని తీసుకెళ్లిన పోలీసులు.. నిందితులు తమపై దాడికి యత్నించారని, ఆత్మరక్షణ కోసం కాల్చామని చెబుతున్నారు. 10 మంది సీనియర్ అధికారులు ఎన్‌కౌంటర్ సమయంలో ఉన్నారని చెబుతున్నా.. నిందితులను ఎక్కడ కాల్చారో కూడా చెప్పలేకపోయారు. ఈ 10 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిర్పూర్కర్ కమిషన్ నివేదికలో పేర్కొంది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. కేసు వివరాలను నిందితుల తల్లిదండ్రులకు చెప్పకుండా.. క్రమంగా మీడియా ద్వారా ప్రజలకు తెలియజేశారు. కావాలనే మీడియాకు లీకులు ఇవ్వడంతోపాటు 2019లో నవంబర్ 29, డిసెంబర్ 6న ప్రెస్‌మీట్ పెట్టి వివరాలు ఇచ్చారు. ఎన్‌కౌంటర్ స్థలంలోని మెటీరియల్‌ను స్వాధీనం చేసుకోకముందే సీపీ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఇది తాము సత్వర న్యాయం అందించామని ప్రజలకు చెప్పడం కోసమే ఏర్పాటు చేసినట్లు ఉంది. చట్టం తన పని తాను చేసుకుపోతుందని కూడా సీపీ వ్యాఖ్యానించారు. సిట్ కూడా దర్యాప్తు పారదర్శకంగా నిర్వహించలేదు. సీసీ ఫుటేజీలను పరిశీలించాకే నిందితులను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు చెబుతుండగా, లారీ ఓనర్ శ్రీనివాస్‌రెడ్డి మాత్రం నిందితుల్లో ఇద్దరిని ఫుటేజీలో చూడలేదని చెప్పారు. నిందితుల్లో జోలు నవీన్ ఎవరో కూడా తనకు తెలియదన్నారు. స్కూల్ రికార్డుల ప్రకారం నిందితుల్లో ముగ్గురు మైనర్లే అయినా.. జువెనైల్ చట్టప్రకారం దర్యాప్తు చేయలేదు. ఈ కేసును ఇతర రాష్ట్రాల పోలీసు అధికారులతో కోర్టు పర్య వేక్షణలో దర్యాప్తు చేయిస్తే వాస్తవాలు వెలుగుచూస్తాయి'అని వృందా నివేదించారు. కాగా, ప్రభు త్వం తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ)వాదనలు వినిపించేందుకు సమయం కావాలని న్యాయవాది కోర్టును విజ్ఞప్తి చేశారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను జనవరి 23కు వాయిదా వేసింది.

వారిని నిందితులుగా చేర్చమనలేం

- 'ఎమ్మెల్యేలకు ఎర'కేసులో బీఎల్ సంతోష్, మరో ముగ్గురికి హైకోర్టులో ఊరట
- పోలీసులు, సిట్‌కు ఈ కేసు దర్యాప్తు చేసే అధికారం లేదన్న ఏసీబీ కోర్టు తీర్పునకు సమర్థన
- ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: 'ఎమ్మెల్యేలకు ఎర'కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, బీడీజేఎస్ అధ్యక్షుడు తుషార్ వెల్లంపల్లి, కేరళకు చెందిన జగ్గుస్వామి, కరీంనగర్‌కు చెందిన న్యాయవాది శ్రీనివాస్‌లను నిందితులుగా చేర్చేందుకు అంగీకరించాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో ఏసీబీ కోర్టు అన్ని అంశాలను పరిశీలించాకే ఉత్తర్వులు ఇచ్చిందని.. అందులో జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదని తేల్చిచెప్పింది.

ఆ నలుగురినీ చేర్చాలన్న విజ్ఞప్తి తోసిపుచ్చుతూ

వాస్తవానికి పోలీసులు 'ఎమ్మెల్యేలకు ఎర'కేసు ఎఫ్ఐఆర్‌లో ముగ్గురిని నిందితులుగా పేర్కొన్నారు. తర్వాత వారితోపాటు బీఎల్ సంతోష్, మరో ముగ్గురిని కూడా నిందితులుగా చేరుస్తూ నవంబర్ 22న నాంపల్లి ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేశారు. కానీ దానిని ఏసీబీ కోర్టు తిరస్కరించింది. ''టీఆర్ఎస్ ఎమ్మెల్యేల బేరసారాల కేసు దర్యాప్తుకు లా అండ్ ఆర్డర్‌కుగానీ, సిట్‌కుగానీ అధికారం లేదు. ఏసీబీ మాత్రమే ఈ కేసు దర్యాప్తు చేయాలి. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17 ప్రకారం.. ఎఫ్ఐఆర్ నమోదు చేసే అర్హత లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్‌కు లేదు. అలాంటప్పుడు నిందితులను ఎలా విచారిస్తారు? ఎలా అరెస్టు చేస్తారు? మొదటి ముగ్గురు నిందితుల నేరాంగీకార వాంగ్మూలంలో ఎక్కడా ఈ నలుగురి పేర్లు లేవు. ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్టుల్లోనూ ఈ నలుగురి పాత్రపై ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవు. బీఎల్ సంతోష్, తుషార్, జగ్గుస్వామి, శ్రీనివాస్‌లను నిందితులుగా పరిగణించలేం''అని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును పోలీసులు డిసెంబర్ 7న హైకోర్టులో సవాల్ చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ డి.నాగార్జున్ సోమవారం తీర్పు వెలువరించారు.

సుదీర్ఘ వాదనల తర్వాత..


ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. ''సుప్రీంకోర్టు విచారణ జరిపిన, హైకోర్టు విచారణ జరుపుతున్న పరిస్థితుల్లో ఈ కేసులో మెమోను ఏసీబీ కోర్టు ఎలా తిరస్కరిస్తుంది? మెమోను తిరస్కరించే అధికారం ఏసీబీ కోర్టుకు లేదు. అనుమానాలున్న వారిని ప్రతిపాదిత నిందితులుగా చేరుస్తూ మెమో దాఖలు చేసే అధికారం పోలీసులకు ఉంటుంది. ఇది తదుపరి విచారణకు ఎంతో అవసరం. అంతేగాక నిందితులు తమపై నమోదు చేసిన కేసు (ఎఫ్ఐఆర్ నంబర్ 455/2022)ను ఏ కోర్టులోనూ సవాల్ చేయలేదు. దర్యాప్తును సీబీఐతో జరిపించాలని మాత్రమే కోరారు''అని కోర్టుకు విన్నవించారు. వెంటనే ఏసీబీ కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. మరోవైపు దీనికి భిన్నంగా ప్రతివాదుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. నిందితుడిపై మెమో దాఖలు చేయడంలో సిట్ అనుసరించిన విధానంలోనే లోపాలున్నాయని.. వారు పాటిస్తున్న పద్ధతి క్రిమినల్ చట్టంలోనే లేదని కోర్టుకు విన్నవించారు. ''అసలు అఫిడవిట్ వేయకుండా సిట్ మెమో ఎలా దాఖలు చేస్తుంది? నిందితులకు, ఎమ్మెల్యేలకు మధ్య రూ.100 కోట్ల డీల్ సాగిందని చెప్తున్న పోలీసులు ఇప్పటివరకు ఒక్క రూపాయి దొరికినట్లు ఆధారాలు చూపలేకపోయారు. ఈ విషయంలో ఏసీబీ కోర్టు సరైన నిర్ణయం తీసుకుంది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న సెక్షన్లన్నీ అవినీతి నిరోధక చట్ట ప్రకారం, ఎన్నికల సంబంధిత అపరాధాలే. వాట్సాప్ సందేశాలు, ఫొటోలను ఆధారాలుగా పేర్కొనలేం. సిట్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలి''అని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. ఏసీబీ కోర్టు తీర్పును సమర్థిస్తూ తీర్పు ఇచ్చింది.

హైకోర్టు తీర్పును స్వాగతించిన బీజేపీ

క్రిమినల్ రివిజన్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేయడాన్ని బీజేపీ అధికార ప్రతినిధి రచనారెడ్డి స్వాగతించారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు.

భారత రాజ్యాంగం పెను ప్రమాదంలో ఉంది

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా



గన్‌ఫౌండ్రీ: భారత రాజ్యాంగం పెను ప్రమాదంలో ఉందని, ఈ ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు మార్క్సిస్టులు ఏకం కావాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో లతారాజా ఫౌండేషన్, ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, హెల్ప్ డెస్క్‌ల ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు రచించిన సంకెళ్లను తెంచుకుంటూ ఓ దళిత చీఫ్ సెక్రెటరీ ఆత్మకథ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చి మనుస్మృతిని అమలు చేసేందుకు కుట్రపన్నుతుందని ఆరోపించారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి బీజేపీ, ఆర్ఎస్ఎస్ తమ లక్ష్యాలను అమలు చేస్తున్నాయన్నారు. నేటికీ కులవర్గ, అంటరానితనం దేశాన్ని పట్టి పీడిస్తుందని వీటి నిర్మూలనకు స్పష్టమైన అవగాహన కావాలని సూచించారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తే నక్సలైట్లుగా, దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాధవరావు సామాజిక అంశాలను ఎంతో అద్భుతంగా రచించారని రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్‌లు కె.సుజాతరావు, కొప్పుల రాజు, ప్రొఫెసర్ హరగోపాల్, పద్మశ్రీ నర్రా రవి కుమార్, రచయిత్రి ఓల్గా పాల్గొన్నారు.



సుఖపడడం మాయ ఐనా బాధ పడడమనేది మాయ కాదు.
– చలం

సాక్షి
మంగళవారం, జనవరి, 3

వలస ఓట్లపై హడావిడి

ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం పెంచడానికి చేస్తున్న సరికొత్త ఆలోచన చర్చ రేపుతోంది. దేశీయంగా వలస వెళ్ళిన ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకొనేందుకు వీలుగా రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఆర్వీఎం)లను తీసుకురావాలనే ప్రయత్నంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. భారత ఎన్నికల సంఘం జనవరి 18న ఈ కొత్త యంత్రాల ప్రయోగాత్మక ప్రదర్శన జరుపుతోంది. అది చూసి, నెలాఖరులోగా తమ సూచనలు తెలియపరచాలని రాజకీయ పార్టీలను ఆహ్వానించింది. ఏడు పదులు దాటిన భారత ప్రజాస్వామ్య ఎన్నికల చరిత్రలో ఇలా దేశంలోని లక్షలాది వలసజీవుల్ని సైతం భాగం చేయాలనే ఆలోచన స్వాగతనీయమే. కానీ, ఇప్పుడున్న ఈవీఎంల వినియోగంపైనే సందేహాలు ముసురుతున్న వేళ... కొత్త ప్రయత్నం ఏ మేరకు లోపరహితమన్నది చూడాలి. ఇప్పటికే, కాంగ్రెస్, తృణమూల్, డీఎంకె సహా ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు జవాబులు వెతకాలి.

వలస జీవులకు రిమోట్ ఓటింగ్ కల్పించడంపై ఎన్నికల సంఘంలో చర్చలు కొత్తేమీ కాదు. దేశీయ వలసదారులకు ఓటింగ్ అవకాశాలు కల్పించాలంటూ కొన్నేళ్ళుగా అభ్యర్థనలున్నాయి. అలా వచ్చిన ఓ అభ్యర్థనపై సుప్రీమ్ కోర్ట్ 2015లోనే ఆదేశాలిచ్చింది. రిమోట్ ఓటింగ్‌కు అవకాశాలు పరిశీలించాలని ఎన్నికల సంఘాన్ని నిర్దేశించింది. పరోక్ష ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్, ఇంటర్నెట్ ఓటింగ్, ముందస్తు ఓటింగ్ లాంటి పలు మార్గాలను ఎన్నికల సంఘ అధికారుల కమిటీ పరిశీలించింది. రకరకాల కారణాలతో ఆ పద్ధతులను సిఫార్సు చేయలేదు. సమగ్ర ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని సదరు కమిటీ సిఫార్సు చేసింది. ఎన్నికల సంఘం మాత్రం తాజాగా సమస్య సాంకేతిక పరిష్కారంతో, ఈ బహుళ నియోజకవర్గ రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఆర్వీఎం) నమూనాను ముందుకు తెచ్చింది. ఇప్పటికే వాడుతున్న ఈవీఎం మోడల్‌కు మార్పులు చేర్పుల రూపమే – ఆర్వీఎం. వలసజీవులు తాము పనిచేస్తున్న నగరాల్లోని పోలింగ్ కేంద్రాల్లోనే తమ స్వస్థలానికి చెందిన నియోజక వర్గాల ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఇది వీలు కల్పిస్తుంది.

ఈ ప్రతిపాదన అమలైతే సొంతూరికి దూరంగా ఉన్న ఓటర్ తన సొంత నియోజక వర్గం తాలూకు రిటర్నింగ్ అధికారితో ఆన్‌లైన్‌లో కానీ, ఆఫ్‌లైన్‌లో కానీ ముందుగా రిమోట్ ఓటరుగా రిజిస్టర్ చేయించుకోవాలి. అప్పుడు ప్రస్తుతం సదరు ఓటర్ నివసిస్తున్నచోటే ప్రత్యేక పోలింగ్ కేంద్రం, ఆర్వీఎం పెడతారు. ప్రభుత్వ రంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూపొందించిన ఈ ఆర్వీఎం వివిధ నియోజక వర్గాలకు ఒకేసారి పనిచేస్తుందట. ఓటర్ నియోజక వర్గాన్ని బట్టి అప్పటికప్పుడు మారే డైనమిక్ బ్యాలెట్ డిస్‌ప్లే ద్వారా ఒకే రిమోట్ పోలింగ్ బూత్ నుంచి 72 నియోజక వర్గాలకు అది పనికొస్తుందట. దీనికి ఇంటర్నెట్ కనెక్టివిటీ అవసరం లేదట. ఆలోచన మంచిదే. ఈ యంత్రాల్ని సరిగ్గా వినియోగిస్తే గనక స్వస్థలం నుంచి వలస వెళ్ళిన ఓటర్లు ఇప్పుడిక తమ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కు వినియోగానికి కష్టపడి సొంత జిల్లాలకు వెళ్ళాల్సిన అవసరం లేదు. వెళ్ళలేని పరిస్థితుల్లో తమ హక్కును వృథా కానివ్వనక్కర లేదు.

2011 నాటి జనాభా లెక్కల ప్రకారం 37 శాతం జనాభా (45.36 కోట్ల మంది) తమ స్వస్థలాల్ని వదిలి, దేశీయంగా వలసపోయినవారే. వీరిలోనూ నూటికి 85 మంది తమ సొంత రాష్ట్రంలోనే విద్య, ఉద్యోగం, వివాహం లాంటి రకరకాల కారణాలతో గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసపోతున్నారు. వీరంతా ఎన్నికల వేళ స్వస్థలాల్లో ఓటు వినియోగించుకోలేక పోతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 91.2 కోట్ల మంది భారతీయులకు ఓటు హక్కుంటే, వారిలో 67.4 శాతమే ఓటేశారు. 30 కోట్ల పైచిలుకు మంది తమ హక్కును వినియోగించుకోలేదు. అంటే, ప్రతి ముగ్గురిలో ఒకరు ఓటు వేయనే లేదు. వలస వల్ల అధికశాతం ఓటు హక్కు వినియోగించు కోవట్లేదు గనక, వారు ఎక్కడున్నా ఓటేసే వీలు కల్పిస్తే పోలింగ్ శాతం పెరుగుతుందనేది ఎన్నికల సంఘం ఆలోచన.

దీనికి చట్టపరంగా, సాంకేతికంగా, పాలనాపరంగా అనేక సమస్యలున్నాయి. 'వలసజీవి' అనే మాటకు భారత రిజిస్ట్రార్ జనరల్, కేంద్ర కార్మిక శాఖ, జాతీయ నమూనా సర్వే సంస్థల్లో ఒక్కోచోట ఒక్కో నిర్వచనం ఉంది. అసలు స్వస్థలానికి ఎంతకాలంగా దూరంగా ఉంటే వలస ఓటర్? రిమోట్ నియోజకవర్గాల్లో ఎన్నికల నియమావళి అమలుచేసేదెట్లా? ఈ వలసజీవుల్ని ఎలా గుర్తించాలి, ఎలా సురక్షిత వాతావరణం కల్పించాలి? రిమోట్ ఓటర్ల డేటా లేదని ఎన్నికల సంఘమే చెబుతోంది. కానీ, 2023లో 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా ఆర్వీఎంలను వాడాలనీ, 2024 సార్వత్రిక ఎన్నికలకు పూర్తిగా అమలు చేయాలనీ పాలకుల పనుపున తహతహలాడుతోంది.

అసలు ముందుగా ప్రజాప్రాతినిధ్య చట్టం, ఎన్నికల నిర్వహణ, ఓటర్ల నమోదు నియమాలు మార్చాలి. ఆలోచించి చేయాల్సిన ఈ పనుల్ని హడావిడిగా నడిపించి, చటుక్కున చేతిలోకి రిమోట్ తీసుకుంటే అనుమానాలు బలపడతాయి. ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేతో ఓటింగ్‌పై అంతర్జాతీయంగానూ అనుమానాలున్నాయి. బలమైన ఆధారాలు లేకున్నా ఎన్నికల్లో మోసాలకు ఇది వీలు కల్పిస్తుందని ఓ భావన. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్‌లో కుయుక్తులు, యంత్రాల భద్రత, వేసిన ఓట్లు ఏ మేరకు సురక్షితం లాంటి చర్చనీయాంశాలున్నాయి. ఇటీవల గుజరాత్ ఎన్నికల్లో ఆఖరి గంటలో 10 – 12 శాతం ఓటింగ్ రేపిన సందేహాలనూ విస్మరించలేం. రేపు రిమోట్ ఓటింగ్‌లోనూ ఇలాంటివే పరిపాటైతే, అసలు ఎన్నికల ప్రక్రియపైనే నమ్మకం పోతుంది. అప్పుడిక ప్రజాస్వామ్యానికి అర్థం ఏముంటుంది!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** శు.ద్వాదశి రా.11.02 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** కృత్తిక సా.6.03 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.46 నుండి 9.30 వరకు, తదుపరి రా.10.45 నుండి 11.37 వరకు, **అమృతఘడియలు:** ప.3.30 నుండి 5.10 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

అమృతోత్సవ దీక్షకు ఫలితం?!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

కోరేగావ్ దళిత మహాసభ ఉద్దేశాన్ని వక్రంగా చిత్రించి, ఆ సభకు హాజరైన కొందరు వామపక్ష సభ్యులు పాలకుల్ని హత్య చేయడానికి కుట్ర పన్నారన్న మిషపైన దేశవ్యాప్తంగా కొందరు పౌర హక్కుల నాయకుల్ని నిష్కారణంగా అరెస్టులు చేసి వేధింపులకు గురిచేశారు. గూఢచర్య 'పెగసస్'తో భారతదేశ పౌర సమాజంపై పాలక పక్షం విరుచుకుపడింది. ఆఖరికి చిన్న దేశమైన భూటాన్ కరెన్సీతో ఇండియా రూపాయి సమానమైంది. ఇలా గడిచిన ఏడాది ఎన్నో పరిణామాల్ని భారతీయ సమాజం చవిచూసింది. భారత స్వాతంత్ర్య అమృతోత్సవాల వేళ పాలకులు, పాలితులు మిగిలిన పాఠాలను స్మరించుకోవలసి ఉంది. గడిచిన 75 ఏళ్ల చరిత్ర నుంచి గుణపాఠాలు నేర్చుకోవలసి ఉంది.

భారత స్వాతంత్ర్యానికి 75 ఏళ్లు నిండిన వేళ దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ దేశ న్యాయ స్థానాలకూ, పాలక వర్గానికీ, పౌర సమాజానికీ బాధ్యతాయుతమైన కర్తవ్యాన్ని (30 డిసెంబర్ 2022) నిర్దేశించారు. రాబోయే రోజుల్లో దేశ న్యాయ వ్యవస్థలో మహిళలదే ప్రధాన పాత్ర కాబోతున్నదనీ, వలసవాద ఆలోచనా విధానాల నుంచి న్యాయ వ్యవస్థను రక్షించవలసిన సమయం వచ్చిందనీ అన్నారు. వ్యక్తులను అకారణంగా అరెస్టులు చేసి, జైళ్లలో పెట్టడం వారి వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనంటూ పలువురు పౌరుల విడుదలకు మార్గాన్ని సుగమం చేశారు.

కోరేగావ్ దళిత మహాసభ ఉద్దేశాన్ని వక్రంగా చిత్రించి, ఆ సభకు హాజరైన కొందరు వామపక్షాల సభ్యులు పాలకుల్ని హత్య చేయడానికి కుట్ర పన్నారన్న మిషపైన దేశవ్యాప్తంగా కొందరు పౌర హక్కుల నాయకుల్ని నిష్కారణంగా అరెస్టులు చేసి వేధింపులకు గురి చేస్తూ వచ్చారు. కోరేగావ్ దళితుల సభలో స్వయంగా పాల్గొన్న న్యాయమూర్తులు ఈ అరెస్టులను, వేధింపులను నిరసించినా పాలకుల కుట్రపూరిత వైఖరి కొనసాగుతూనే వచ్చింది. కాగా జస్టిస్ చంద్రచూడ్ ప్రధాన న్యాయమూర్తిగా పదవిని స్వీకరించిన తర్వాత ఈ వేధింపుల విషయంలో కూడా స్పష్టమైన వైఖరి తీసుకున్నారు. అరెస్టయినవాళ్లు జైళ్లలో నిరవధికంగా విచారణ లేకుండా మగ్గడాన్ని గమనించి, నిష్కారణ పరిణామానికి ఫుల్‌స్టాప్ పెట్టడానికి నిర్ణయించారు. విచారణను త్వరితం చేసి, డిటెన్యూల విడుదలకు క్రమంగా చర్యలు తీసుకోవడం హర్షించదగిన పరిణామం.

ఫాదర్ స్టాన్ స్వామి అరెస్టు ఉదంతం పాలక వర్గాల అత్యంత నీచమైన చర్య. భారత నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) సేకరించానని ప్రకటించిన 'సాక్ష్యం' ఫాదర్ స్టాన్ స్వామి, తదితర నిందితుల కంప్యూటర్లలోకి పనిగట్టుకొని చొప్పించిన దొంగ సాక్ష్యాలేనని ప్రసిద్ధ అమెరికన్ డిజిటల్ ఫోరెన్సిక్ కంపెనీ 'ఆర్సెనల్ కన్సల్టెన్సీ' విడుదల చేసిన నివేదికలో (10 డిసెంబర్ 2021) పేర్కొంది. విచిత్రమేమంటే, ఏ ఇజ్రాయిల్ స్పైవేర్ 'పెగసస్'ను భారత పాలకులు ఉపయోగించారో, దాని సంస్థతో ఎన్ఐఏ కూడా సంబంధాలు పెట్టుకుంది. అయితే సుప్రీంకోర్టు (27 అక్టోబర్ 2021) విచారణ కోసం ఒక సాంకేతిక సంఘాన్ని నియమించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్.వి. రవీంద్రన్ అధ్యక్షులుగా ఉన్న ఈ కమిటీలో ప్రొఫెసర్ పి. ప్రభాకరన్, ప్రొఫెసర్ అశ్విన్ గుమస్తే సభ్యులుగా ఉన్నారు. నిందితుల ఫోన్లను ఇజ్రాయిల్ పెగసస్ స్పైవేర్ ట్యాంపర్ చేస్తున్న విషయం నిజమా? కాదా? అని తేల్చాలని ఈ కమిటీ ఎన్ఐఏను ఆదేశించింది. కానీ, ఇంతవరకూ ఆ విషయాన్ని ఎన్ఐఏ తేల్చకుండా దాటవేసిందని వార్తలు. ఈ 'కప్పదాట్లు' అంతటితో ఆగలేదు. 'పెగసస్'తో భారతదేశ పౌర సమాజంపై పాలక పక్షం విరుచుకుపడేంతవరకు కొనసాగుతూనే వచ్చింది. అంతేగాదు, కాంగ్రెస్ పాలకుల 'బోఫోర్స్' కొనుగోళ్ల వల్ల దేశం నష్టపోయింది రూ. 70 కోట్లు కాగా, బీజేపీ–ఆరెస్సెస్ పాలకుల రఫేల్ (ఫ్రెంచి) విమానాల కొనుగోళ్ల వల్ల దేశం కోల్పోయింది రూ. 70 వేల కోట్లని తెలినా నిగ్గతీయగల చైతన్యాన్ని ప్రతిపక్షాలూ కోల్పోయాయి.

రెండో మాట



ఆ మాటకొస్తే, 2002లో గుజరాత్‌లో ఏమైంది? పాలకుల అధికారిక దౌర్జన్యాలను, ఆగడాలను ఎండగట్టి, వారు శిక్షార్హులేనని సుప్రీంకోర్టు ప్రత్యేక సలహాదారుగా విచారణకు నియమితులైన 'ఎమికస్ క్యూరీ' ప్రసిద్ధ న్యాయవాది రాజు రామచంద్రన్ సమర్పించిన నివేదికను కూడా పాలకులు తొక్కిపట్టిన ఉదంతాన్ని దేశం మరచిపోలేదు. ఇన్ని రకాల దారుణాలకు, పాలక పక్షాలు ఒడిగట్టిన దేశంలో – స్వాతంత్ర్య దినోత్సవ అమృతోత్సవాలు ముగిసిన వేళలో పాలకులకు, పాలితులకు మిగిలిన గుణపాఠాన్ని స్మరించుకోవలసిన సమయమిది. దేశ స్వాతంత్ర్యం కోసం సకల వ్యక్తిగత సౌకర్యాలను గడ్డిపోచగా భావించి ప్రాణాలు సహా సర్వస్వాన్ని త్యాగం చేసిన లక్షలాదిమంది దేశభక్తులను ఒక్కసారి తలచుకోవలసిన సమయం ఇదే. గడిచిన 75 ఏళ్ల పరిణామాల నుంచి గుణపాఠాలు తీసుకోవలసిన ఘడియ కూడా ఇదే!

అంతేగాదు, ఈ 75 ఏళ్లలోనే క్రమంగా పత్రికా రంగంలో కూడా జాతీయ ప్రయోజనాల పరిరక్షణ స్పృహకన్నా కార్పొరేట్ ఇండియాలో భాగంగా కార్పొరేట్ మీడియా బలిసింది. పత్రికా రంగంలో ప్రయివేట్ రంగ ప్రయోజనాల ప్రాధాన్యం పెరిగింది. తద్వారా జర్నలిజం స్వరూప స్వభావాలనే అది తారుమారు చేస్తూ వచ్చింది. 1955 నాటికే వర్కింగ్ జర్నలిస్టుల, తదితర వార్తా పత్రికా ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతూ ప్రత్యేక చట్టమే వచ్చింది. ఫలితంగా ఇతర సంస్థలలో పనిచేసే వివిధ వృత్తిదారుల ప్రయోజనాలను కూడా రక్షించే నిబంధనలు అందులో పొందు పర్చడం జరిగింది. ఇది లేబర్ కోర్టుల ద్వారా ఉద్యోగుల సమస్యల సామరస్య పరిష్కారానికి తోడ్పడింది. తొల్లింటి ప్రయివేట్ మీడియాను జైన్లు, బిర్లాలు, గోయెంకా లాంటి జూట్ వ్యాపారులు నిర్వహించగా, ఇప్పుడు ఆ స్థానాన్ని నడమంత్రపు 'సిరి' పారిశ్రామికవేత్తలు భర్తీ చేశారు. వీళ్లపైన భారత రాజ్యాంగ నిబంధనల ఆజమాయిషీ బొత్తిగా మృగ్యమై పోవడం కూడా కాంగ్రెస్, బీజేపీ–ఆరెస్సెస్ పాలనల 'పుణ్యమే'. కాబట్టి ఈ సమీక్ష అనివార్యమవుతోంది.

చివరికి మన కరెన్సీ కూడా ఈ 75 ఏళ్లలో ఏ స్థాయికి దిగజారిపోయిందో, ఆ దిగజారుడులో కాంగ్రెస్ పాలకులు కూడా భాగస్వాములయినా ఒక ఆలోచనాపరురాలిగా, కాంగ్రెస్ వాదిగా భావికా కపూర్ నిర్మొహమాటంగా ఇలా వర్ణించారు: మన ప్రగతి 'వేగం' ఇప్పుడు ఏ స్థాయిలో ఉందంటే – ''భూటాన్ కరెన్సీ ఇప్పుడు ఇండియా కరెన్సీతో సమానం. ఒక భూటానీస్ గుల్‌ట్రమ్ (కరెన్సీ) ఒక రూపాయితో సమానమైంది. భూటాన్ ఒక్కటే కాదు, అఫ్గానిస్తాన్ రూపాయి కూడా ఇండియా రూపాయితో సమానమై కూర్చుంది. అంటే, మనమిప్పుడు తాలిబన్ల రాజ్యానికి సమానమన్నమాట. వావ్ మోదీజీ.. వావ్!'' (30 డిసెంబర్ 2022)

ఏది ఏమైనా, 75 ఏళ్ల భారత అమృతోత్సవాలు ముగిసిన వేళలో ఒక మహాకవి, స్వతంత్ర భారత మానవుడిని తలచుకుని అతని నేటి దుఃస్థితికి స్పందించిన తీరును మరొక్కసారి గుర్తు చేసుకుందాం:

''ఆ మానవమూర్తి ముఖం మీద
ఎప్పుడూ ఉండే పసిపాప నవ్వులేదు!
స్వతంత్ర భరతవర్ష వాస్తవ్యుడా మానవుడు
అర్ధనగ్నంగా ఆకాశాన్నే కప్పుకొని
నిండని కడుపుతో మండుతూన్న కళ్లతో
ఇలా ఎంతకాలం ఇంకా నిలబడతాడా ప్రాణి?
అందుకే అతణ్ణి జాగ్రత్తగా చూడండి
స్వతంత్ర భారత పౌరుడు
అతని బాధ్యత వహిస్తామని
అందరూ హామీ ఇవ్వండి
అతని యోగ క్షేమాలకు / అందరూ పూచీపడండి
అతికించండి మళ్లీ / అతని ముఖానికి నవ్వు!
స్వాతంత్ర్యం ఒక చాలా సున్నితమైన పువ్వు,
చాలా వాడైన కత్తి, విలువైన వజ్రం
స్వాతంత్ర్యం తెచ్చేవెన్నెన్నో బాధ్యతలు
సామర్థ్యంతో నిర్వహిస్తామని / సంకల్పం చెప్పుకుందాం''

ఇంతకీ మహాకవి ఆశించిన ఆ 'సామర్థ్యం, సంకల్పం' మనలో ఏది? అది మనలో కరువయింది కాబట్టే పాలకుల పాలనా సామర్థ్యాన్ని గత సుమారు రెండు దశాబ్దాలుగా బొడ్లో చేయివేసి ప్రశ్నిస్తున్న 'ఏడీఆర్'(అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్) నిరంతర నివేదికలు కూడా 'బుట్టదాఖలు' అవుతున్నాయి.

abkprasad2006@yahoo.co.in



సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

మనుషులే భిన్నం



కేరళలో ఎంత ఎక్కువ తిరుగుతుంటే అంతగా నేను సమాధాన పడుతున్నది ఏమంటే, 'కేరళ మోడల్'ను అంత సులభంగా అనుసరించలేం. అది ఈ ప్రభుత్వమా, ఆ ప్రభుత్వమా : ఈ విధానమా, ఆ విధానమా గురించి కాదు. కేరళకు ఒక విభిన్న చరిత్ర ఉంది. అది ఎన్నో అంశాల సంగమం. కొన్ని భాగాల్ని అనుసరించొచ్చు. కానీ మొత్తాన్నీ కాదు.

– పత్రలేఖా ఛటర్జీ, విజిటింగ్ ఫెలో

మీకంటే పాతది



జెరూసలేం ఆక్రమణలో ఉందని ఐక్య రాజ్య సమితి ఎన్నిసార్లు చెప్పినా సరే – క్రీ.పూ.1000 సంవత్సరంలో కింగ్ డేవిడ్ తన రాజ్యానికి దాన్ని రాజధాని చేసుకున్నారనే చారిత్రక వాస్తవాన్ని తుడిచెయ్యలేరు. అప్పటికి 'పాలస్తీనా' లేదు, ఐక్యరాజ్యసమితి కూడా లేదు.

– హనన్య నఫ్తాలీ, ఇజ్రాయిల్ వ్యాఖ్యాత

అసలు సమస్య



అవును... పెద్దనోట్లను రద్దు చేయడానికి పాటించిన విధానం చట్టబద్ధమే. కానీ అది అత్యధిక భారతీయ ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం.

– రాన్ దెల్నెవో, ఆర్థికాంశాల వ్యాఖ్యాత

ఆపేయండ్రో!



ఒకవేళ నాకు ఈ 'బ్రో', 'డ్యూడ్' లేదా 'చిల్' అనే మాటలు పూర్తి పెద్దవాళ్ల నుంచి వినిపిస్తే గనక నేను బద్దలైపోతాను.

– దుష్యంత్ ఎ., న్యాయవాది

అధికారిక ధోరణి



రష్యా అధికారిక ఛానల్ నిర్వహించిన నూతన సంవత్సర స్పెషల్ షోలో వాళ్లు బహిరంగంగా పాశ్చాత్య దేశాలను ఉద్దేశించి ఈ మాట చెప్పారు: "మీకు ఇష్టమున్నా లేకపోయినా, రష్యా విస్తరిస్తోంది." దానికి స్టూడియోలో ఉన్న అతిథుల మూడ్ ఎంతో ఉల్లాసంగా కనిపించింది.

– జూలియా డేవిస్, కాలమిస్ట్

ప్రచారంలో భాగం



టీకాలు వేసుకోని పౌరులను జైల్లో పెట్టడానికి ఇదే తగిన సమయం అంటూ వ్యాఖ్యలు చేశారు హాలీవుడ్ నటుడు షాన్ పెన్. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈ కళాకారులు, 'ఇన్‌ఫ్లుయెన్సర్లు' అందరూ కూడా టీకాల గురించి ప్రచారం చేయడానికి డబ్బులు తీసుకున్నారు. అది ఎప్పటికీ మరిచిపోవద్దు.

– రాబర్ట్ డబ్ల్యూ.మలోని, టీకా శాస్త్రవేత్త

హింసకు సరేకానీ...



పాకిస్తానీయుల మనస్తత్వానికి 'ద లెజెండ్ ఆఫ్ మౌలా జట్' కచ్చితమైన ఉదాహరణ. ఒక పురుషుడి ఖండిత శిరస్సును ఒక మహిళ తన చేతిలో పట్టుకునే దృశ్యం ఉన్న ఈ సినిమాను చూడటానికి కుటుంబ సమేతంగా వెళ్లొచ్చు. కానీ సినిమాలో ఒక్క శృంగార దృశ్యం కూడా ఉండకూడదు. ఎందుకు? ఎందుకంటే అది కుటుంబ చిత్రం. ప్రేమ వాళ్లను రెచ్చగొడుతుంది. కానీ హింస అనేది సాధారణం.

– సయ్యద్ ముజమ్మిల్ షా, పాక్ టీవీ హోస్ట్

మహిళా విద్యా ప్రదాత

విద్య ద్వారా సమాజంలో ఉన్న అసమానతలను చదును చేయాలని... 18వ శతాబ్దంలోనే మహాత్మ జ్యోతిబాఫూలే, సావిత్రీబాయి ఫూలే దంపతులు ప్రయత్నించారు. మొక్కవోని వారి దీక్ష వల్ల అప్పటి సమాజంలో హీన స్థితిలో ఉన్న స్త్రీల జీవితాలకు అండ దొరికింది. భర్త జ్యోతిబా ఫూలే ప్రోత్సాహంతో స్వయంగా చదువుకున్న సావిత్రీబాయి దేశంలో మహిళా విద్యకు దారిదీపం అయింది.

1840లో 9 ఏళ్ల సావిత్రీబాయి వివాహం 13 ఏళ్ల జ్యోతిబా ఫూలేతో జరిగింది. స్త్రీలకు విద్య చాలా అవసరం అని గ్రహించి ముందు తన భార్య సావిత్రీబాయికి చదువు నేర్పాడు జ్యోతిబా. భారతదేశ చరిత్ర లోనే స్త్రీ విద్యను మొట్ట మొదట ప్రవేశపెట్టిన వాడు జ్యోతిబాఫూలే. తన పొలం దగ్గర మామిడి చెట్టు నీడలో మొట్ట మొదటి పాఠశాల పెట్టాడు. ఆ పాఠశాలలో ఆయన అక్క సుగుణబాయి, భార్య సావిత్రీబాయి విద్యార్థులు! స్త్రీ విద్యా ప్రయోగ శాలగా ఆ పాఠశాల చరిత్రలో మిగిలిపోయింది.



సావిత్రీబాయి ఫూలే

1848లో ఓ భవంతిలో స్త్రీల కోసం పాఠశాలను ఏర్పాటు చేశాడు ఫూలే. చదువు నేర్చుకునే క్రమంలో సావిత్రీబాయి ఎన్నో పుస్తకాలు చదివి స్త్రీ ఎంత దారుణ స్థితిలో ఉందో అర్థం చేసుకుంది. అదే సమయంలో అమెరికా నల్లజాతి వివక్ష వ్యతిరేక పోరాట నాయకులు థామస్ క్లార్క్ జీవిత చరిత్ర చదివి స్ఫూర్తి పొందింది. బ్రాహ్మణ స్త్రీలతోపాటూ బహుజన స్త్రీ జనోద్ధరణకు భర్తతో పాటూ నడుం బిగించింది. స్త్రీ జనోద్ధరణకు సంబంధించిన అన్ని కార్యక్రమాలకూ ఆమే ఇన్‌చార్జ్‌గా వ్యవహరించింది.

1851లో పూణేలో అమ్మాయిల కోసం మరో స్కూలు ప్రారంభించారు. మెల్లమెల్లగా ఫూలే దంపతులు 18 పాఠశాలలను స్థాపించారు. అయితే నాటి ఛాందసవాదులు సావిత్రీబాయి మామగారిని... ఆయన కొడుకూ, కోడలూ శాస్త్ర విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని రెచ్చగొట్టారు. దీంతో ఫూలే దంపతులను మామగారు ఇంటి నుండి వెళ్లగొట్టారు. అయినా ఆ దంపతులు తమ మార్గాన్ని మార్చుకోలేదు. ఆత్మహత్య చేసుకోబోతున్న కాశీ బాయి అనే గర్భవతి అయిన బ్రాహ్మణ వితంతు మహిళను కాపాడి ఆమె కన్న పిల్లవాడిని దత్తత తీసుకుని 'యశ్వంతరావు' అని పేరు పెట్టుకొని పెంచి పెద్ద చేశారు. 1876–77లో మహారాష్ట్రలో భయంకరమైన కరువు వచ్చి జనాలు ఆకలితో అలమటిస్తుంటే తమ 'సత్య శోధక సమాజ్' ద్వారా ఆహార సేకరణ చేసి ఆదుకున్నారు. ఆమె మంచి ఉపాధ్యాయురాలే కాదు, కవయిత్రి కూడా. ఆమె రచించినటువంటి 'కావ్య పుష్పాలు' అనే సంపుటి చాలా గొప్పది.

ప్లేగు వ్యాధి గ్రస్తులకు సేవ చేస్తూ ఆ వ్యాధికే బలై 1897 మార్చి 10వ తేదీన తుది శ్వాసవిడిచి ఎందరికో స్ఫూర్తిప్రదాతగా నిలిచిన మహనీయురాలు సావిత్రీబాయి.

– తండ సదానందం, టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్
(నేడు సావిత్రిబాయి ఫూలే జయంతి)

ఉస్మానియా అలాయ్ బలాయ్!

వందేళ్ళకు పైగా ఘన చరిత్ర, కీర్తి గల ఉస్మానియా యూనివర్సిటీ మరొక అద్భుతమైన ఘట్టానికి తెరలేపుతోంది. గ్లోబల్ అలుమ్నయి మీట్ (జీఏఎమ్–23)ను జనవరి మూడు, నాలుగు తేదీలలో నిర్వహిస్తోంది. స్వాతంత్ర్య ఉద్యమ కాలంనాటి వందేమాతరం ఉద్యమం నుండి తొలి, మలి తెలంగాణ ఉద్యమాల వరకూ ఎన్నో ప్రజా యుద్ధాలకూ, తెలంగాణ ప్రజల అస్తిత్వానికీ, ఆత్మగౌరవానికీ చిహ్నంగా నిలిచింది ఉస్మానియా.

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల 57వ రూమ్ ఎన్నో సామాజిక, రాజకీయ, అస్తిత్వ ఉద్యమాలకూ, మేధో చర్చలకూ వేదిక అయింది. హైదరాబాద్‌కు మణిహారం లాంటి ఆర్ట్స్ కళాశాల నుండి ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మేధావులు, పాత్రికేయులు, రాజకీయ నాయకులు, కళాకారులు, సాహితీ వేత్తలు, వ్యాపారవేత్తలు, సినీ, క్రీడా ప్రముఖులు తయారయ్యారు. మిగతా కళాశాలల నుంచి గొప్ప ఇంజినీరింగ్, శాస్త్ర సాంకేతిక నిపుణులూ, సైంటిస్టులూ తలెత్తారు. ఈ దేశానికి ప్రధాన మంత్రి అయిన పీవీ నర్సింహారావు, పార్లమెంట్‌లో గొప్ప వక్తగా, విమర్శకునిగా పేరున్న ఎస్. జైపాల్ రెడ్డి, లోక్‌సభ మాజీ స్పీకర్ శివరాజ్ పాటిల్, వామపక్ష ఉద్యమాలకు ఊపిరులూదిన జార్జిరెడ్డి; గొప్ప కవి, రచయిత, టీచర్‌గా పేరున్న సి. నారాయణ రెడ్డి, సినీ దిగ్గజం శ్యాంబెనెగల్, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ వైవీ రెడ్డి... ఇలా చెప్పుకుంటూ పోతే ఉస్మానియా ఉత్పత్తి చేసిన మహామహుల పేర్లకు అంతుండదు. నిజానికి ఉస్మానియా చరిత్ర రాస్తే ఒక ఉద్గ్రంథమే అవుతుంది.



కడుపు చేత పట్టుకొని వచ్చిన వేలాది మంది విద్యార్థులను అమ్మలాగా ఆదరించి అక్కున చేర్చుకొని వారికి సుందరమైన భవిష్యత్తును తీర్చిదిద్ది దేశ సేవ కోసం బయటికి పంపింది ఉస్మానియా.

'ఎన్‌సీసీ' నుండి యూనివర్సిటీ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే ఏదో తెలియని అనుభూతి అనుభవిస్తే గాని మనసు కుదుటపడదు. పచ్చని చెట్లు, పిట్టల కిలకిలారావాలతో జీవ వైవిధ్యం ఉట్టిపడే క్యాంపస్‌లో అడుగుపెడితే ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలు! యూనివర్సిటీ లైబ్రరీలో రేయింబవళ్లూ కూర్చొని చదువుకోవడం, ఇంజనీరింగ్ కాలేజీ క్యాంటీన్ కబుర్లూ; అబ్బాయిలూ, అమ్మాయిలూ కలిసి చెట్టాపట్టాల్ వేసుకుని తిరిగే దృశ్యాలూ, ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర జరుపుకొన్న వేడుకలూ, యూనివర్సిటీలోని చాయ్ కొట్టుల దగ్గర జరిపిన సుదీర్ఘమైన సామాజిక, రాజకీయ చర్చలూ, సరదా సంభాషణలూ... ఎన్ని జ్ఞాపకాలు!

మన యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆత్మీయ ఆలింగనాలు చేసుకుని మరోసారి పలకరించుకుందాం రండి. సుదీర్ఘకాలం తర్వాత మళ్లీ ఒకసారి అందరం ఒక దగ్గర కూడి ఆనాటి మధుర జ్ఞాపకాలను తలుచుకుని తరించే అవకాశం యూనివర్సిటీ కల్పిస్తోంది. ఇలాంటి అవకాశాలు, సందర్భాలు రావడం బహు అరుదు. అన్ని విధాలా అభివృద్ధి చెందిన మన పాత విద్యార్థులు యూనివర్సిటీ అభివృద్ధికి తమ వంతు సాయం అందించడానికి తగిన సందర్భమూ ఇదే!

– వలిగొండ నరసింహ, రీసెర్చ్ స్కాలర్, ఓయూ
(నేడు, రేపు ఓయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం)

అవసరంలో ఒక అసత్యం

ఎప్పుడూ సత్యమే పలకాలనీ, అబద్ధాలాడటం వ్యక్తిత్వానికి మచ్చ అనీ, అసత్యాలు పలికేవారిని సమాజం గౌరవించకుండా చిన్న చూపు చూస్తుందనీ... సాధారణంగా పెద్దవాళ్ళు ఇలా పిల్లలకు చెపుతూ ఉంటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు సత్య వాక్యం గొప్పదనాన్ని బోధిస్తూ ఉంటారు. అయితే, జీవితంలో ఎప్పుడూ అబద్ధాలాడకుండా ఉండడం సాధ్యమేనా? కానే కాదు. అవసరం లేకపోయినా అదో అలవాటుగా మారిపోయి, తరచూ అబద్ధాలాడే వ్యక్తి ఎప్పుడైనా నిజం చెప్పినా ఎవరూ నమ్మరు. కాని, అవసర సమయాలలో అబద్ధం చెప్పటం తప్పు కాదని, ప్రాచీన గ్రంథాలు చెపుతున్నాయి.



ఆదిపర్వంలో శుక్రచార్యుని కుమార్తె దేవయానిని యయాతి పెళ్లాడినప్పుడు, ఆమె వద్ద దాసిగా ఉన్న వృషపర్వుని కూతురు శర్మిష్ఠ యయాతి వద్దకు దేవయానితో పాటు వస్తుంది. శర్మిష్ఠ తనను భార్యగా స్వీకరించమని యయాతిని కోరుతుంది. అతడు, శుక్రచార్యునికి ఇచ్చిన మాట తప్పినట్లవుతుందనీ, అసత్య దోష మౌతుందనీ చెపుతాడు. అప్పుడు శర్మిష్ఠ 'ప్రాణాలకు నాశనం కలిగే సమయాన, తమ ధనం అపహరించబడే సమయాన, పెళ్లి వేళలందు అసత్య మాడటం దోషం కాద'ని చెపుతుంది. తనను వివాహమాడమని కోరుతుంది. అందుకే, వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్లి చేయాలనే సామెత పుట్టి ఉంటుంది.

ఇదే విషయాన్ని భాగవతంలో పోతన చెపుతాడు. వామనావతార ఘట్టంలో, దానమడగటానికి వచ్చిన బాలుడు విష్ణువని గ్రహించిన దానవ గురువు శుక్రాచార్యులు బలి చక్రవర్తితో... 'స్త్రీల విషయంలో, వివాహ సమయంలో; ప్రాణానికి, సంపదకు, మానానికి హాని కలుగుతున్నప్పుడూ అబద్ధం ఆడితే తప్పు లేదనీ, వామనునికి ఇచ్చిన మాట వెనక్కి తీసుకొని ప్రాణాలు కాపాడుకో'మనీ చెపుతాడు. అయినా, బలి చక్రవర్తి మాట తప్పలేదు. వామనునికి దాన మిచ్చాడు.

నేటి మానవ జీవితంలో ఒక అబద్ధమైనా ఆడకుండా మనుగడ సాగించటం సాధ్యం కాదు. అత్యవసర సందర్భాలలో తమను తాము రక్షించుకోవటానికి, మనుషులు అరుదుగా అసత్యమాడినా దోషం కాదు కాని, అబద్ధాలాడటం ఒక మార్చుకోలేని అలవాటుగా పరిణమిస్తే మాత్రం గౌరవ హాని కలుగుతుందనేది తథ్యం.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి



భద్రాద్రిలో ఉత్తర ద్వారం గుండా దర్శనమిస్తున్న సీతారాములు



ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తజనం



యాదాద్రిలో వైకుంఠ ఏకాదశి వేడుకలలో పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఇతర ప్రముఖులు

కనుల పండువగా ఉత్తర ద్వార దర్శనాలు

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

- వైకుంఠనాథులుగా దర్శనమిచ్చిన భద్రాద్రి శ్రీరాముడు, యాదాద్రి, ధర్మపురి లక్ష్మీనృసింహుడు
- గరుడ వాహనాలపై ఊరేగింపు.. వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

భద్రాచలం/యాదగిరిగుట్ట/ధర్మపురి: రాష్ట్రవ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ప్రధానాలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలకు భక్తులు పోటెత్తారు. దక్షిణ అయోధ్యగా ఖ్యాతిగాంచిన భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంతోపాటు యాదాద్రి, ధర్మపురి ల్లోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాలకు వేకువ జామునే భక్తులు చేరుకున్నారు. భద్రాచలంలో జగదభి రాముడు గరుడవాహనంపై, సీతమ్మవారు గజవాహనంపై, లక్ష్మణస్వామి హనుమత్ వాహనంపై ఆసీనులై ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనం ఇవ్వగా యాదాద్రిలో లక్ష్మీనృసింహస్వామి గరుడ వాహనంపై పరవాసుదేవ అలంకారంలో వేంచేసి ఆలయ ఉత్తర ద్వారం గుండా వైకుంఠనాథుడిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే జగిత్యాల జిల్లా ధర్మపురి ఆలయంలోనూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఉత్తర ద్వారం ద్వారా భక్తులను అనుగ్రహించారు.

భద్రాద్రిలో...: భద్రాచలంలో సోమవారం తెల్లవారుజామున వైకుంఠ ద్వార దర్శనానికి ముందు రుగ్వేద, యజుర్వేద, సామవేద, అదర్వణ వేదాలను పఠించిన అనంతరం ద్వారదర్శన ప్రాశస్త్యాన్ని వేదపండితులు భక్తులకు వివరించారు. సరిగ్గా 5 గంటలకు ఉత్తర ద్వారాలు తెరుచుకోగా గరుడవాహన రూఢుడై విచ్చేసిన శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ని భక్తులు కన్నులారా వీక్షించి తరించారు. ఉత్తర ద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశించి గర్భగుడి లోని మూలవరులను దర్శించుకున్నారు.

యాదాద్రిలో...
యాదాద్రిలో వేకువజామునే ప్రధానాలయంలో స్వామి అమ్మవార్లకు అర్చ కులు సుప్రభాతం, ఆరాధన, బాలభోగం, తిరుప్పావై చేపట్టి అలంకార సేవలు చేశారు. సరిగ్గా ఉదయం 6:48 గంటలకు స్వామి వారు గరుడ వాహనంపై ఉత్తర ద్వారం నుంచి భక్తులను అనుగ్రహించారు. ఉదయం 6:48 గంటల నుంచి 7:30 గంటల వరకు స్వామిని దర్శించుకొనేందుకు భక్తులకు అవకాశం కల్పించారు. అనంతరం ఆలయ తిరువీధుల్లో స్వామిని ఊరేగించారు. ఆ తర్వాత ఆలయంలో అధ్యయనోత్సవాలకు శ్రీకారం చుట్టారు. సాయంత్రం స్వామిని విష్ణుమూర్తిగా అలంకరించి మత్స్య అవతారంలో ఊరేగించారు. యాద్రాద్రి ప్రధానా లయ ఉద్ఘాటన తర్వాత తొలిసారి జరిగిన ఉత్తర ద్వార దర్శనానికి మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కాగా, యాదాద్రి కొండకు దిగువనున్న తులసీ కాటేజీలో దాతల సహకారంతో రూ. 21 కోట్ల వ్యయంతో నిర్మించిన 240 గదుల సముదాయాన్ని మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. ఇక పాతగుట్ట (పూర్వగిరి) ఆలయంలో సైతం ఉదయం 6:48 గంటలకు నృసింహుని వైకుంఠద్వార దర్శనాన్ని భక్తులకు కల్పించారు. మరోవైపు ధర్మపురిలో ఉదయం 5:55 గంటలకు ఉత్తర ద్వార దర్శనాలను ఆలయ అధికారులు అనుమతించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ సహా పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు.

వేంకటేశ్వరాలయంలో సీఎం సతీమణి పూజలు



వేంకటేశ్వర కాలనీ: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా సీఎం కేసీఆర్ సతీమణి శోభ సోమవారం శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆమెకు వేద ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో లావణ్య, స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీయూటీఎస్ డైరీని ఆవిష్కరించిన సీఎస్

సాక్షి,హైదరాబాద్: రాష్ట్రోపాధ్యాయ సంఘం, తెలంగాణ రాష్ట్రం (ఎస్టీయూటీఎస్) డైరీని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదానందంగౌడ్, పర్వత్‌రెడ్డి, ఎస్టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావు పాల్గొన్నారు.

కీలకాంశాలపై వాడివేడిగా

నేడు గోదావరి బోర్డు సమావేశం

- కడెం-గూడెం, మొడికుంటవాగు ప్రాజెక్టులపై చర్చ!
- కడెంలో పూడిక వల్లే ప్రత్యామ్నాయ ప్రాజెక్టు చేపట్టామంటున్న తెలంగాణ
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆంధ్రప్రదేశ్
- టెలిమెట్రీ, నీటి లభ్యత లాంటి అంశాలపై నిర్ణయం!

సాక్షి, హైదరాబాద్: గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో జరగనుంది. గోదావరి నదిపై తెలంగాణ నిర్మిస్తున్న కడెం-గూడెం ఎత్తిపోతల పథకం, మొడికుంటవాగు ప్రాజెక్టులకు సాంకేతిక అనుమతుల జారీ/అబ్జర్వేషన్ల నమోదు, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు పెద్దవాగు ఆనకట్ట ఆధునికీకరణ, రాష్ట్రాల సరిహద్దుల్లో గోదావరిపై టెలిమెట్రీ వ్యవస్థ ఏర్పాటు, ఉమ్మడి రాష్ట్ర కాలంలో గోదావరిలో నీటి లభ్యతపై అధ్యయనానికి కన్సల్టెన్సీ నియామకం వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

వాడివేడి చర్చకు అవకాశం!
కడెం-గూడెం ప్రాజెక్టుపై ఏపీ ఇప్పటికే అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య వాడివేడి చర్చ జరిగే అవకాశం ఉంది. కడెం ప్రాజెక్టు ఆయకట్టుకు అవసరమైన నీటి లభ్యత ఉన్న నేపథ్యంలో గూడెం ఎత్తిపోతల పథకం నిర్మించాల్సిన అవసరం లేదని గత ఏడాది ఆగస్టులో ఏపీ ప్రభుత్వం గోదావరి బోర్డుకు లేఖ రాసింది. అయితే కడెం ప్రాజెక్టులో పూడిక చేరడంతో 3 టీఎంసీల మేరకు నీటి నిల్వ సామర్థ్యం తగ్గినందున ప్రత్యామ్నాయ ప్రాజెక్టును చేపట్టినట్టు ఇటీవల తెలంగాణ అధికారులు స్పష్టత ఇచ్చారు. మరోవైపు పెద్దవాగు ప్రాజెక్టు శిథిలావస్థకు చేరుకోవడం వల్ల అత్యవసర మరమ్మతు పనులు చేయాల్సి ఉంది. రూ.7,826 కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టు ఆధునీకరణకు తెలంగాణ 2019లో ప్రతిపాదనలు సమర్పించింది. ఆయకట్టు శాతం ఆధారంగా ఏపీ 85.75 శాతం, తెలంగాణ 14.75 శాతం వ్యయం భరించాలని తెలంగాణ కోరగా, ఏపీ కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ఇదే దామాషా లెక్కన రూ.92 కోట్లతో అత్యవసర మరమ్మతులు చేసేందుకు ఏపీ అంగీకరించింది. ఆధునీకరణతో పాటు అత్యవసర మరమ్మతులపై ఈ సమావేశంలో ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



నీటి లభ్యత ఎంత ?
గోదావరిలో నీటి లభ్యతపై స్పష్టత లేకపోవడం, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నీటి పంపకాలను ఇప్పటివరకు నిర్ణయించక పోవడంతో రెండు రాష్ట్రాల్లో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు అనుమతుల జారీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గోదావరి నీటి పంపకాలపై రెండు రాష్ట్రాల మధ్య ఎలాంటి ఒప్పందం జరగలేదు. 1980లో వచ్చిన గోదావరి ట్రిబ్యునల్ అవార్డులోకూడా నీటి లభ్యతపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. అయితే గోదావరిలో 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా 3,216 టీఎంసీల జలాల లభ్యత ఉండగా, అందులో ఉమ్మడి రాష్ట్రానికి కేవలం 1,360 టీఎంసీల లభ్యత ఉందని వ్యాప్కోస్ అధ్యయనంలో తేలిందని ఏపీ వాదిస్తోంది. తెలంగాణకు 1,480 టీఎంసీలు, ఏపీకి 1,486.155 టీఎంసీల లభ్యత ఉందని తెలంగాణ పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో గోదావరిలో వాస్తవ నీటి లభ్యతపై జాతీయ స్థాయి సంస్థతో అధ్యయనం చేయించాలని గోదావరి బోర్డు ప్రతిపాదించింది. ఈ అంశంపై బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

రూ.265.18 కోట్ల 'రైతుబంధు' నిధుల జమ

సాక్షి, హైదరాబాద్: ఐదోరోజు రూ.265.18 కోట్ల రైతుబంధు నిధులు 51,468 మంది రైతుల ఖాతాల్లోకి జమ అయ్యాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ నిధులు 5,30,371.31 ఎకరాలకు గాను ఇచ్చినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల కళ్లలో ఆనందమే సీఎం కేసీఆర్ లక్ష్యమని స్పష్టం చేశారు. కేవలం ఎనిమిదేళ్లలో తెలంగాణ వ్యవసాయరంగ స్వరూపం మారిపోయిందని, రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంట్ పథకాలు చరిత్రాత్మకమైనవని, వ్యవసాయ రంగం బలపడితేనే దేశం పటిష్టంగా ఉంటుందని వివరించారు. సంపద పెంచి ప్రజలకు పంచాలన్నదే కేసీఆర్ విధానమని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

20 రోజుల సెలవులో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు సోమవారం నుంచి 20 రోజుల సెలవు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. జ్వరంతో బాధపడుతున్నందున ఆయన సెలవు కోరారు. కాగా, ఆయనకు సెలవు మంజూరు, ఇన్‌చార్జి సీఎండీ నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఇంధన శాఖ వర్గాలు తెలిపాయి.

హిందూ దేవుళ్లను కించపర్చిన వ్యక్తిపై కేసు

అశ్వాపురం: అయ్యప్ప స్వామి జనన వృత్తాంతాన్ని విమర్శిస్తూ ఇటీవల హనుమకొండ జిల్లాకు చెందిన బైరి నరేశ్ చేసిన వ్యాఖ్యలను సమర్థించడమే కాక హిందూ దేవుళ్లను కించపరిచేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు తాటిపల్లి రాధాకృష్ణ.. బైరి నరేశ్ వ్యాఖ్యలను సమర్థిస్తూనే హిందూ దేవుళ్లను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టుపెట్టారు. ఇదేంటని అయ్యప్ప మాలధారులు సోమవారం ప్రశ్నించగా వారితో అతను దుర్భాషలాడారు. దీంతో మాలధారులు ఆర్ఎస్ఎస్, బజరంగదళ్, బీజేపీ నాయకులు చేసిన ఫిర్యాదుతో రాధాకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జితేందర్ తెలిపారు.

పరిహారం కోసం రైతు ఆత్మహత్యాయత్నం

- ఓపెన్‌కాస్ట్ కోసం భూమి సేకరించిన సింగరేణి
- పూర్తి పరిహారం అందించడంలో మూడేళ్లుగా జాప్యం
- ప్రజావాణి దగ్గర పురుగుమందు తాగిన రైతు
- విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్



పురుగు మందు తాగి పడిపోయిన సాంబయ్య

భూపాలపల్లి: సింగరేణి ఓపెన్‌కాస్ట్ ఏర్పాటులో ఉన్న భూమి పోయింది. పరిహారం కోసం ఆఫీసుల చుట్టూ ఎంత తిరిగినా పూర్తిస్థాయిలో అందలేదు. దీంతో విసిగివేసారిన ఓ రైతు కలెక్టరేట్‌లో ప్రజావాణి వద్దకు వచ్చి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. సోమవారం కలెక్టరేట్ పక్కన ఉన్న ఇల్లందు క్లబ్‌హౌస్‌లోని మీటింగ్ హాల్లో ప్రజావాణి కార్యక్రమం జరుగుతోంది. కలెక్టర్ భవేష్ మిశ్రా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలో గణపురం మండలం మాధవరావుపల్లికి చెందిన జిట్టబోయిన సాంబయ్య అనే రైతు క్లబ్‌హౌస్ బయట క్రిమిసంహారక మందు తాగి పడిపోయాడు. అక్కడున్న వారు అతడిని లేపి ఏమైందని అడగ్గా.. తనకు అన్యాయం జరిగిందని, ఎవరూ పట్టించుకోకపోవడంతో పురుగుమందు తాగానని చెప్పాడు. మాధవరావుపల్లిలో సర్వే నంబర్ 318/92లో తనకు ఎకరన్నర భూమిలో 500 టేకు చెట్లు ఉండేవని, 2019లో సింగరేణి సంస్థ ఓపెన్‌కాస్ట్-3 నిర్మాణంలో భాగంగా ఆ భూమిని సేకరించిందన్నాడు. ఎకరన్నర భూమికి గాను ఎకరాకే పరిహారం వచ్చిందని, మిగిలిన 20 గుంటల పరిహారం ఓ దళారి పేరుపై వచ్చిందని వాపోయాడు. అలాగే, 78 చెట్లకు కూడా పరిహారం రాలేదన్నాడు. నష్టపరిహారం కోసం మూడేళ్లుగా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నానని చెప్పాడు. గతంలో గణపురం తహసీల్దార్‌ను ప్రశ్నిస్తే.. విధులకు ఆటంకం కలిగించానని పోలీసులకు ఫిర్యాదు చేశారని, పది రోజులు జైల్లో ఉండి వచ్చానని సాంబయ్య పేర్కొన్నాడు. రైతు ఆత్మహత్యాయత్నం విషయం తెలుసుకున్న కలెక్టర్ భవేష్ మిశ్రా వెంటనే సిబ్బందిని పంపి రైతును ఆస్పత్రిలో చేర్పించారు. సాంబయ్య ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు.

అమెరికాలో మంచిర్యాల యువకుడు మృతి



వంశీకృష్ణ

మంచిర్యాల క్రైం: అమెరికాలో గత ఏడాది డిసెంబర్ 31న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల రెడ్డికాలనీకి చెందిన పెండ్యాల సుబ్రహ్మణ్యం, జ్యోతి దంపతుల కుమా రుడు వంశీకృష్ణ(36) మృతి చెందాడు. పదేళ్ల క్రితం అమెరికాకు వెళ్లిన అతను ఆరిజోనా స్టేట్‌లోని ఫోనిక్స్‌సిటీలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. 31న రాత్రి స్నేహితులతో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకొని రూమ్‌కి వస్తుండగా రోడ్డు ప్ర మాదం జరిగినట్లు తెలుస్తోంది. అమెరికాలోనే ఉంటున్న మృతుడి సోదరి పద్మ దంపతులు ఘటనా స్థలానికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. వంశీకృష్ణ మృతదేహాన్ని ఇండియాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా.. మంచు అధికంగా ఉండడం వల్ల విమానాలు తగిన సంఖ్యలో నడవడం లేదని తెలిసింది. మృత దేహం మంచిర్యాల చేరేందుకు వారం రోజులు పట్టే అవకాశం ఉందని అంటున్నారు. అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి మృత దేహాన్ని త్వరగా పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం'



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులు తమ సమస్యలను ఉద్య మాలతోనే పరిష్కరించుకోవాలని, పైరవీలతో కాదని విద్యావేత్త చుక్కా రామయ్య స్పష్టం చేశారు. ఉపాధ్యా యులు ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. సోమవారం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలిసి టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర డైరీ, కేలెండర్, అధ్యాపకదర్శిని-39ని చుక్కా రామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నో త్యాగాలతో బలమైన ఉపాధ్యాయ ఉద్యమం నిర్మితమైందని, ఆ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించటానికి టీఎస్‌యూటీఎఫ్ డైరీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యకర్తల మధ్య ఉండటమే తనకు సంతోషమని, కార్యకర్తల మధ్యనే తుదిశ్వాస విడవాలనుకుంటున్నానని అందుకే టీఎస్‌యూటీఎఫ్ నాయకులు నన్ను ఓపిక లేదని వద్దన్నా ఆవిష్కరణకు వచ్చానన్నారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ, టీఎస్‌యూటీఎఫ్ డైరీలో పొందుపరచిన 90 పేజీల సమాచారం ఎంతో విజ్ఞానదాయకంగా ఉందన్నారు. రాష్ట్రంలో బదిలీలు, పదోన్నతులు, నియామకాలు లేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి చావ రవి, రాష్ట్ర కార్యదర్శులు గాలయ్య, శారద, ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతు సేవలకే మొదటి ప్రాధాన్యం: నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతుల సేవలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, మార్కెటింగ్ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని శాఖ అధికారులకు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సూచించారు. సోమవారం టీఎన్జీవో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల కేంద్ర సంఘం డైరీ, కేలండర్‌ను తన కార్యాలయంలో నిరంజన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎనిమిదేళ్లలో పెరిగిన పంటల విస్తీర్ణం, ఉత్పత్తితో మార్కెటింగ్ ఉద్యోగులపై బాధ్యత పెరిగిందని తెలిపారు. పంటల కొనుగోళ్లలో మార్కెటింగ్ ఉద్యోగుల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు రాజేందర్, కార్యదర్శి ప్రతాప్, మార్కెటింగ్ సంచాలకురాలు లక్ష్మీ బాయి, అడిషన ల్ డైరెక్టర్లు లక్ష్మణుడు, రవికుమార్, టీఎన్జీవోస్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్యదర్శి ఫసియొద్దీన్ పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ కేలండర్ ఆవిష్కరణ
వ్యవసాయశాఖ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను మంత్రుల నివాస సముదాయంలోని తన నివాసంలో సోమవారం నిరంజన్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమానికి వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు హాజరయ్యారు.

క్లుప్తంగా...

ఆధునిక భారతదేశ చరిత్రపై విస్తృత పరిశోధనలు చేయాలి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు

న్యూఢిల్లీ: ఆధునిక భారతదేశ చరిత్రపై మరిన్ని పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి చెప్పారు. ఆ అంశంపై దృష్టి పెట్టాలని పరిశోధకులకు పిలుపునిచ్చారు. అలాగే ప్రఖ్యాత సామాజిక సంస్కర్త స్వామి దయానంద సరస్వతి, 1875లో ఏర్పాటైన ఆర్య సమాజ్ అందించిన సేవలను వెలుగులోకి తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో విద్యా, సాంస్కృతిక సంస్థలు చొరవ తీసుకోవాలని అన్నారు. సోమవారం ఢిల్లీలోని నెహ్రూ స్మారక మ్యూజియం, లైబ్రరీ(ఎన్ఎంఎంఎల్) వార్షిక సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. విస్తృత పరిశోధనల ద్వారా ఆధునిక భారతదేశ చరిత్ర గురించి నేటి తరానికి మరిన్ని విషయాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

అన్ని ఏజెన్సీలతో ఈడీ అనుసంధానం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఆర్థిక నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో అవకతవకల సత్వర గుర్తింపునకు వీలుగా ఇతర ఏజెన్సీల డేటాతో సులభంగా యాక్సెస్ చేసుకునేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సిద్ధంచేసుకుంది. సీబీఐ, నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్ (ఎన్ఐజీ), ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ), కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ)తో పాటు ఇతర ఏజెన్సీల వద్ద ఉన్న వివరాలను సరిపోల్చుకునే వ్యవస్థను సిద్ధంచేసుకుంది. కోర్ ఈడీ ఆపరేషన్ సిస్టమ్ పేరుతో అభివృద్ధి చేసిన ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా నేర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు, వారి ఆర్థిక లావాదేవీలు, వారిపై నమోదైన కేసులు, అనుబంధ పత్రాలను ఆన్‌లైన్ ద్వారా పొందటం సులభం కానుంది. ఆర్థిక నేరాల పరిశోధనలో వేగాన్ని పెంచేందుకు, ఇతర ఏజెన్సీలతో సమన్వయం చేసుకునేందుకు ఇది దోహదపడనుంది.

వారికి నెగటివ్ సర్టిఫికెట్ తప్పనిసరి

న్యూఢిల్లీ: చైనాతోపాటు హాంకాంగ్, సింగపూర్, థాయ్‌ల్యాండ్, జపాన్, దక్షిణ కొరియాల ద్వారా వచ్చే ప్రయాణికులకు కోవిడ్ నెగటివ్ సర్టిఫికెట్ తప్పనిసరి అని కేంద్రం స్పష్టం చేసింది. వారు ఏ దేశస్తులైనా సరే భారతీయ విమానాశ్రయాల్లోకి ప్రవేశించేందుకు ఇది అవసరమని సోమవారం రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొంది.

ఆస్ట్రేలియాలో రెండు హెలికాప్టర్లు ఢీ.. నలుగురు మృతి

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో సోమవారం మధ్యాహ్నం రెండు హెలికాప్టర్లు ఢీకొన్న ఘటనలో నలుగురు చనిపోయారు. క్వీన్స్‌ల్యాండ్ రాష్ట్రం గోల్డ్‌కోస్ట్‌లోని మెయిన్ బీచ్‌లో ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో ఒక హెలికాప్టర్ ల్యాండవుతుండగా, అదే సమయంలో మరో హెలికాప్టర్ ప్రయాణికులతో టేకాఫ్ తీసుకుంటోంది. రెండూ ఢీకొన్న వెంటనే పెద్ద శబ్దంతో ఒక హెలికాప్టర్ కూలిపోయింది. అందులోని ప్రయాణికులు నలుగురు చనిపోగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మరో హెలికాప్టర్ సురక్షితంగానే ల్యాండయింది.

మెక్సికో జైలుపై దుండగుల దాడి..14 మంది మృతి

మెక్సికో సిటీ: మెక్సికోలోని చిహువాహువా రాష్ట్రం సియుడాడ్ జువారెజ్ జైలుపై ఆదివారం దుండగులు జరిపిన దాడిలో 10 మంది భద్రతా సిబ్బంది సహా 14 మంది చనిపోయారు. ఉదయం 7 గంటల సమయంలో వాహనాలపై వచ్చిన సాయుధులు జైలు సిబ్బందిపై విచక్షణా రహితంగా కాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో 10 మంది భద్రతా సిబ్బంది, నలుగురు ఖైదీలు చనిపోయారు. సుమారు 24 మంది ఖైదీలు తప్పించుకుపోయారు.

తుపాకీతో డ్యాన్స్.. కాంగ్రెస్ ఎమ్మెల్యేపై కేసు

భోపాల్: నూతన సంవత్సర వేడుకల్లో చేతిలో తుపాకీ పట్టుకుని స్టేజీపై డ్యాన్స్ వేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం కేసు నమోదు చేసింది. కోట్మా నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ సరాఫ్ మరో నలుగురితో కలిసి తుపాకీ చేతబట్టుకుని చిందులు వేస్తున్న వీడియో వైరల్ అవుతోంది.

కశ్మీర్‌లో మరో ఉగ్ర ఘాతుకం

రాజౌరి/జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి జిల్లా దాంగ్రి గ్రామంలో మరో విషాద ఘటన చోటుచేసుకుంది. 14 గంటల వ్యవధిలో చోటుచేసుకున్న ఘటనల్లో ఆరుగురు చనిపోగా 12 మంది వరకు గాయపడ్డారు. సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో ఐఈడీ పేలి సమీక్షా శర్మ(16), విహాన్ కుమార్ శర్మ(4) అనే ఇద్దరు చిన్నారులు అసువులు బాశారు. మరో ఆరుగురు గాయపడ్డారు. ఆదివారం ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన నలుగురిలో ఒకరైన ప్రీతమ్ లాల్ నివాసానికి సమీపంలోనే ఈ పేలుడు చోటుచేసుకుంది. 14 గంటల వ్యవధిలో చోటుచేసుకున్న ఈ ఘటనలపై ప్రజలు నిరసనలకు దిగారు. జిల్లా వ్యాప్తంగా బంద్ పాటించారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వచ్చే వరకు మృతులకు అంత్యక్రియలు జరపబోమంటూ గ్రామస్తులు భీష్మించారు. డీజీపీ నచ్చజెప్పినా వినలేదు. దీంతో, సోమవారం సాయంత్రం మనోజ్ సిన్హా అక్కడికి వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడారు. భద్రతా చర్యలు కట్టుదిట్టం చేస్తామని, దోషులను వదిలిపెట్టబోమని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, కాల్పులు, పేలుడు ఘటనలపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) బృందం దర్యాప్తు ప్రారంభించింది. ఐఈడీ పేలుడు సమాచారం తెలిసిన వెంటనే భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి, పెద్ద ఎత్తున సోదాలు ప్రారంభించాయి.



అంతరిక్షంలో సినిమా షూటింగ్

రష్యా రికార్డు • దుమ్ము రేపుతున్న ట్రైలర్

హాలీవుడ్ స్టార్ టామ్ క్రూయిజ్ తన తదుపరి సినిమాలో ఒక సీక్వెన్స్‌ను నాసా సహకారంతో అంతరిక్షంలో షూట్ చేయబోతున్నారన్న వార్త ఇటీవల అందరినీ ఆకర్షించింది. కానీ ఆయన కంటే ముందే రష్యా ఈ ఘనత సాధించేసింది. రష్యా దర్శకుడు క్లిమ్ షిపెంకో రూపొందిస్తున్న సినిమా 'ద చాలెంజ్'లో ఒక సీక్వెన్స్‌ను 2021 అక్టోబర్లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో తీశారు. అందులో నటించిన యూలియా పెరెస్లిడ్‌తో కలిసి ఇందుకోసం 12 రోజుల పాటు ఐఎస్ఎస్‌లో గడిపారు. తద్వారా అంతరిక్షంలో షూటింగ్ జరుపుకున్న తొలి సినిమాగా ద చాలెంజ్ రికార్డు సృష్టించింది. తాజాగా విడుదలైన దీని ట్రైలర్ దుమ్ము రేపుతోంది. ఓ కాస్మోనాట్ ప్రాణాలు కాపాడేందుకు ఐఎస్ఎస్‌కు వెళ్లిన డాక్టర్‌గా యూలియా ఇందులో నటిస్తోంది. షూట్ కోసం సినిమా బృందం ఐఎస్ఎస్‌లో లాండైన తీరును కూడా సినిమాలో చూపించనున్నారు. మున్ముందు చంద్రునితో పాటు అంగారకునిపైనా షూటింగ్ చేస్తానని క్లిమ్ చెబుతున్నారు!

దుబాయ్‌లో మద్యంపై పన్ను రద్దు



దుబాయ్: పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా దుబాయ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం విక్రయాలపై ఇప్పటిదాకా విధిస్తున్న 30 శాతం పన్నును పూర్తిగా రద్దు చేసింది. ఇది ఆదివారం నుంచే అమల్లో వచ్చింది. అంతేకాకుండా వ్యక్తిగత ఆల్కహాల్ లైసెన్స్‌లకు ఇకపై ఎలాంటి చార్జీ వసూలు చేయబోరు. దుబాయ్‌లో ఎవరైనా ఇళ్లలో మద్యం సేవించాలంటే వ్యక్తిగత ఆల్కహాల్ లైసెన్స్ ఉండాల్సిందే. దుబాయ్ ప్రభుత్వం ఇటీవలి కాలంలో మద్యం విషయంలో కొన్ని చట్టాలను సడలిస్తోంది. అయితే, పన్ను రద్దు అనేది తాత్కాలికమా? లేక శాశ్వతమా? అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు.

నోట్ల రద్దు సబబే: సుప్రీం

నిర్ణయ ప్రక్రియలో లోపాల్లేవు • ధర్మాసనం మెజారిటీ తీర్పు

- విభేదించిన జస్టిస్ నాగరత్న
- రద్దు చట్ట విరుద్ధమంటూ తీర్పు
- రాహుల్ క్షమాపణలు చెప్పాలి: బీజేపీ
- కేంద్రానికి చెంప దెబ్బ తీర్పే: కాంగ్రెస్



న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానంలో మరో భారీ ఊరట లభించింది. రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేస్తూ కేంద్రం ఆరేళ్ల కింద తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ''ఈ నిర్ణయం తీసుకునే ముందు కేంద్రానికి, ఆర్‌బీఐకి మధ్య ఆర్నెల్ల పాటు సంప్రదింపులు జరిగాయి. కనుక పిటిషనర్లు ఆరోపించినట్టుగా నోట్ల రద్దు నిర్ణయ ప్రక్రియలో న్యాయ, రాజ్యాంగపరమైన లోపాలేవీ చోటుచేసుకోలేదు'' అని స్పష్టం చేసింది. నోట్ల రద్దును సవాలు చేస్తూ దాఖలైన 58 పిటిషన్లను కొట్టేసింది. ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు సోమవారం మెజారిటీ తీర్పు వెలువరించింది. ''దొంగ నోట్లకు, నల్లధనానికి, ఉగ్రవాదానికి నిధులకు అడ్డుకట్ట వేసే ఉదాత్త లక్ష్యాలతో తీసుకున్న ఆర్థిక విధానపరమైన నిర్ణయమిది. వెనక్కు మరల్చడం వీలు కాని ఇలాంటి నిర్ణయాలను కేవలం వాటిని తీసుకునేందుకు అనుసరించిన ప్రక్రియ ఆధారంగా అసమంజసమని తేల్చి కొట్టేయలేం'' అని ధర్మాసనానికి సారథ్యం వహించిన జస్టిస్ ఎస్.ఎ.నజీర్‌తో పాటు బి.ఆర్.గవాయ్, ఎ.ఎస్.బొపన్న, వి.రామసుబ్రమణియన్ పేర్కొన్నారు. అంతేగాక ఇలాంటి నిర్ణయాలు సమంజసమైనవేనా, ఆశించిన ఫలితాలిచ్చాయా అనే అంశాలపై న్యాయ వ్యవస్థ సమీక్ష జరపజాలదన్నారు. రద్దు చేసిన నోట్ల మార్పిడికి ఇచ్చిన 52 రోజుల గడువు సమంజసమైనదేనని అభిప్రాయపడ్డారు. ధర్మాసనం తరఫున మెజారిటీ తీర్పును జస్టిస్ గవాయ్ చదివి విన్పించారు. ధర్మాసనంలోని ఐదో సభ్యురాలు జస్టిస్ బి.వి.నాగరత్న దీనితో విభేదించారు. నోట్ల రద్దు నిర్ణయం చట్ట విరుద్ధమంటూ ఆమె విడిగా తీర్పు వెలువరించారు. నోట్ల రద్దును సవాలు చేస్తూ పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేయడం తెలిసిందే. వాటన్నింటినీ కలిపి విచారించిన ధర్మాసనం డిసెంబర్ 7న తీర్పును రిజర్వు చేసింది. నిర్ణయానికి సంబంధించిన కొన్ని కీలక డాక్యుమెంట్లను సీల్డ్ కవర్లో తమకు సమర్పించాలని అంతకుముందు కేంద్రాన్ని ఆదేశించింది.

ఇప్పుడేమంటారు?

దేశ ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయం ఉగ్రవాదం నడ్డి విరవడంలో కీలక పాత్ర పోషించింది. ఆ నిర్ణయాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. నోట్ల రద్దుకు వ్యతిరేకంగా దేశ విదేశాల్లో ప్రచారం చేసిన రాహుల్‌గాంధీ ఇప్పుడు క్షమాపణ చెబుతారా?

\- బీజేపీ

సమర్థించలేదు

నోట్ల రద్దు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందనడం సరికాదు. తాజా తీర్పు కేవలం నిర్ణయ ప్రక్రియపైనే తప్ప నోట్ల రద్దు లక్ష్యాలు నెరవేరాయా, లేదా అన్న కీలక అంశంపై కాదు. నోట్ల రద్దు చట్టవిరుద్ధమంటూ జస్టిస్ నాగరత్న వెలువరించిన మైనారిటీ తీర్పు మోదీ సర్కారుకు చెంప పెట్టు. లక్షలాది కంపెనీలను నాశనం చేసి, కోట్లాది మంది ప్రజల పొట్ట కొట్టిన ఇలాంటి పిచ్చి తుగ్లక్ నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని మోదీయే జాతికి క్షమాపణ చెప్పాలి.

\- కాంగ్రెస్

పిటిషనర్ల వాదనేమిటి?

నోట్ల రద్దు కేసులో పిటిషనర్ల తరఫున చిదంబరం తదితరులు వాదించారు. వాళ్లేమన్నారంటే...

- రద్దు నిర్ణయానికి అనుసరించిన ప్రక్రియ పూర్తిగా లోపభూయిష్టం. సంబంధిత పత్రాలన్నింటినీ కోర్టు ముందుంచాలి
- నోట్ల రద్దుకు కేంద్రం నేరుగా నిర్ణయం తీసుకోజాలదు. అందుకు ఆర్‌బీఐ కేంద్ర బోర్డు సిఫార్సు తప్పనిసరి.
- రద్దు ద్వారా ఆశించిన లక్ష్యాలేవీ నెరవేరలేదు
- నిర్ణయాన్ని ఇప్పుడు వెనక్కు తీసుకోవడం అసాధ్యమే అయినా మున్ముందు ప్రభుత్వాలు ఇలాంటి దుస్సాహసాలకు పాల్పడకుండా స్పష్టమైన చట్ట నిబంధనలను ఏర్పరచాలి
- గడువు లోగా పాత నోట్లు మార్చుకోలేకపోయిన వారికి మరో అవకాశం కల్పించాలి

కేంద్రం ఏం చెప్పింది...

కేంద్రం తరఫున అటార్నీ జనరల్ వెంకట రమణితో పాటు ఆర్‌బీఐ తరఫున న్యాయవాది నోట్ల రద్దును సమర్థిస్తూ వాదనలు విన్పించారు...

- దొంగ నోట్లు, నల్లధనం, ఉగ్రవాదానికి నిధులు, పన్నుల ఎగవేత వంటి జాఢ్యాల ఏరివేత నోట్ల రద్దు నిర్ణయం లక్ష్యం
- అన్ని కోణాల్లోనూ లోతుగా ఆలోచించి, అవసరమైన సంప్రదింపులన్నీ జరిపిన మీదట తీసుకున్న నిర్ణయమిది
- ఈ విషయమై ఆర్‌బీఐతో సుదీర్ఘ సంప్రదింపులు జరిగాయి
- ఆరేళ్ల కింద జరిగిపోయిన ఈ నిర్ణయానికి సంబంధించి ఇప్పుడు 'కాలాన్ని వెనక్కు తిప్పి' జరిగిపోయిన వాటిని సరి చేయడం, పరిహారం వంటివి ఇవ్వడం సాధ్యం కాదు. కనుక దీనిపై విచారణే కూడదు.

మెజారిటీ తీర్పులో సుప్రీంకోర్టు ధర్మాసనం చెప్పిందిదీ...

నోట్ల రద్దు నిర్ణయం సబబేనంటూ ధర్మాసనం తరఫున జస్టిస్ నజీర్ మెజారిటీ తీర్పు చదివి విన్పించారు. 382 పేజీల ఈ తీర్పులో ఆయనేం చెప్పారంటే...

- ఆర్‌బీఐతో ఆర్నెల్లపాటు సంప్రదింపులు జరిపిన మీదటే నోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నారు
- ఇది హడావుడిగా తీసుకున్న నిర్ణయమన్న వాదన అర్థరహితం
- కేవలం కొన్ని సిరీస్‌ల నోట్లనే తప్ప వాటిని మొత్తానికే రద్దు చేసే అధికారం కేంద్రానికి లేదనడం అసంబద్ధం
- ఎందుకంటే నోట్ల రద్దు నిర్ణయాన్ని సొంతంగా తీసుకుని అమలు చేసే స్వతంత్ర అధికారాలు ఆర్‌బీఐకి లేవు
- ఆర్‌బీఐ చట్టంలోని 26 (2) సెక్షన్ కింద కేంద్రానికి ఉన్న అధికారాలు పరిమితమైనవడం, కొన్ని సిరీస్‌ల నోట్లనే తప్ప వాటిని కేంద్రం సంపూర్ణంగా రద్దు చేయజాలదని చెప్పడం సరికాదు



జస్టిస్ నజీర్



జస్టిస్ గవాయ్



జస్టిస్ బొపన్న



జస్టిస్ రామసుబ్రమణియన్

- గతంలో జరిగిన నోట్ల రద్దు నిర్ణయాలను పార్లమెంటు చట్టం ద్వారా తీసుకున్నంత మాత్రాన ఈ విషయంలో మరో విధమైన నిర్ణయం తీసుకునేందుకు కేంద్రానికి అధికారం లేదని కూడా చెప్పలేం
- కేవలం కేంద్రం చేపట్టిన చర్యల ఫలితం ఆధారంగా నోట్ల రద్దు నిర్ణయాన్ని కొట్టేయలేం
- ఈ నిర్ణయం వెనక మూడు లక్ష్యాలను గుర్తించాం. వాటిని చేరుకోవడంలో తేడాలున్నంత మాత్రాన నిర్ణయాన్ని కొట్టేయాలనడం సరికాదు
- ఇలాంటి నిర్ణయాల విషయంలో పూర్తిస్థాయి ముందస్తు గోప్యత చాలా అవసరం. అవి లీకైతే ఎంతటి అనర్థం జరిగేదో ఊహించుకోవడం కూడా కష్టమే.
- రద్దయిన నోట్ల మార్పిడికి ఇచ్చిన 52 రోజుల గడువు సమంజసమైనదే
- కొంతమందికి తాత్కాలికంగా కాస్త కష్టం కలిగినంత మాత్రాన మొత్తం నిర్ణయాన్నే తప్పుబట్టలేం
- నోట్ల రద్దు ప్రభావం తదితరాలను మదింపు చేయడం కోర్టుల పని కాదు

జస్టిస్ నాగరత్న ఏమన్నారంటే...

నోట్ల రద్దు నిర్ణయం చట్ట విరుద్ధమని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. ధర్మాసనంలో అందరికంటే జూనియర్ న్యాయమూర్తి అయిన ఆమె మెజారిటీ తీర్పుతో విభేదిస్తూ ఈ మేరకు విడిగా 124 పేజీల తీర్పు వెలువరించారు. అందులో ఏం చెప్పారంటే...

- నోట్ల రద్దు నిర్ణయం దొంగ నోట్లు, నల్లధనం, ఉగ్రవాదానికి నిధులకు అడ్డుకట్టే వేసేందుకు బాగా ఆలోచించి, సదుద్దేశంతో తీసుకున్నదే.



సమాజ మూలాలను పెకిలిస్తున్న జాఢ్యాలను నిర్మూలించాలన్న ఉద్దేశాన్ని అభినందించాల్సిందే

- కానీ ఇది కేవలం 24 గంటల్లో తీసుకున్న హడావుడి నిర్ణయం. పైగా అందుకు అనుసరించిన తీరు కూడా పూర్తిగా చట్టవిరుద్ధం
- ఇది కేంద్రం సిఫార్సు చేసిన నిర్ణయమని ఆర్‌బీఐ సమర్పించిన పత్రాలే చెబుతున్నాయి. అంటే ఇది ఆర్‌బీఐ స్వతంత్ర ఆలోచన కాదని స్పష్టమవుతోంది
- కేంద్ర ప్రభుత్వానికి ఉన్న విస్తృతమైన అధికారాల దృష్ట్యా కేవలం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడానికి బదులు ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహించే పార్లమెంటులో నోట్ల రద్దుపై విస్తృతంగా చర్చించి ఈ మేరకు చట్టం చేయాల్సింది.
- అయితే ఇది ఆరేళ్ల క్రితం నాటి నిర్ణయం. కనుక దీనిపై స్టే గానీ, పిటిషనర్లకు ఉపశమనం గానీ ఇవ్వలేం

ఇప్పటికీ క్యాషే కింగ్!

- నోట్ల రద్దుతో చెల్లకుండా పోయిన 86 శాతం కరెన్సీ
- ఆరేళ్ల తర్వాత 83 శాతం పెరిగిన నగదు చలామణి
- చెల్లింపుల్లో మాత్రం డిజిటల్ దెబ్బకు కుదేలైన నగదు వాటా

న్యూఢిల్లీ: పెద్ద నోట్ల రద్దు. ఆరేళ్ల క్రితం మోదీ సర్కారు తీసుకున్న సంచలన నిర్ణయం. అప్పటికి దేశవ్యాప్తంగా చలామణిలో ఉన్న కరెన్సీలో 86 శాతం వాటి రూ.1,000, రూ.500 నోట్లదే. కేంద్రం నిర్ణయంతో అవి ఒక్క దెబ్బతో రద్దయ్యాయి. కానీ ఆర్థిక లావాదేవీల్లో ఇప్పటికీ నగదుదే పెద్ద వాటా! పైగా నోట్ల రద్దు నాటితో పోలిస్తే జనం దగ్గరున్న నగదు ఏకంగా రెట్టింపైందని తాజా గణాంకాలు చెబుతుండటం ఆసక్తికరం. నోట్ల రద్దుకు కాస్త ముందు, అంటే 2016 నవంబర్ 4న చలామణిలో ఉన్న కరెన్సీ విలువ కేవలం 17.74 లక్షల కోట్ల రూపాయలు. రద్దు నిర్ణయం తర్వాత అది ఏకంగా రూ.9 లక్షల కోట్లకు పడిపోయింది. కానీ తాజాగా 2022 డిసెంబర్ 23 నాటికి ఏకంగా 32.42 లక్షల కోట్ల రూపాయల విలువైన కరెన్సీ చలామణిలో ఉందని రిజర్వు బ్యాంకు గణాంకాలే చెబుతున్నాయి. రద్దయిన నోట్లు మార్చుకోవడానికి అప్పట్లో 52 రోజుల గడువు ఇవ్వడం తెలిసిందే. ఆ గడువు లోపల రూ.15.3 లక్షల కోట్ల విలువైన పెద్ద నోట్లు, అంటే 99.3 శాతం వెనక్కొచ్చాయని ఆర్‌బీఐ పేర్కొంది. అలాంటప్పుడు నోట్ల రద్దుతో సాధించింది ఏమిటన్న ప్రశ్నలు అప్పట్లోనే తలెత్తాయి. రద్దు అనంతరం కొత్తగా రూ.2,000 నోటు ప్రవేశపెట్టడం తెలిసిందే. రూ.500 నోట్లను సరికొత్త రూపంలో తిరిగి జారీ చేసినా రూ.1,000 నోట్లను మాత్రం పునరుద్ధరించలేదు. ఒకవైపు డిజిటల్ చెల్లింపుల్లో భారత్ కొన్నేళ్లుగా ప్రపంచంలోనే అగ్ర స్థానంతో దూసుకుపోతున్నా మరోవైపు నగదు చలామణి కూడా అంతకంతకూ పెరుగుతుండటం ఆసక్తికరమే. అయితే నగదు చలామణి క్రమంగా తగ్గుతోందని ఎస్‌బీఐ తాజా సర్వే ఒకటి తేల్చింది. ''మొత్తం చెల్లింపుల్లో నగదు వాటా 2015–16 ఆర్థిక సంవత్సరంలో 88 శాతం కాగా 2021–22 నాటికి అది 20 శాతానికి తగ్గింది. 2026–27 కల్లా కేవలం 11 శాతానికి పరిమితమవుతుంది. అదే సమయంలో 2015–16లో కేవలం 11.26 శాతంగా నమోదైన డిజిటల్ చెల్లింపులు 2021–22 నాటికి ఏకంగా 80 శాతానికి ఎగబాకాయి. 2026–27 కల్లా 88 శాతానికి చేరతాయి'' అని అది పేర్కొంది.

చలామణిలో ఉన్న నోట్ల మొత్తం విలువ	
2017 మార్చి 31	రూ.13.1 లక్షల కోట్లు
2018 మార్చి 31	రూ.18.03 లక్షల కోట్లు
2019 మార్చి 31	రూ.21.1 లక్షల కోట్లు
2020 మార్చి 31	రూ.24.2 లక్షల కోట్లు
2021 మార్చి 31	రూ.28.26 లక్షల కోట్లు
2022 మార్చి 31	రూ.31.05 లక్షల కోట్లు
2022 డిసెంబర్ 23	రూ.32.42 లక్షల కోట్లు

చలామణిలో ఉన్న మొత్తం నోట్ల సంఖ్య	
2017 మార్చి 31	9,026.6 కోట్లు
2022 మార్చి 31	13,053.3 కోట్లు

(రూ.2, 5, 10, 20, 50, 100, 200, 500, 2,000 నోట్లన్నీ కలిపి)

అక్కడ రష్యా.. ఇక్కడ చైనా..

ఒకే తరహా వైఖరి : రాహుల్ ధ్వజం



న్యూఢిల్లీ: యుద్ధంలో మునిగిన ఉక్రెయిన్, రష్యాలతో భారత్, చైనా సరిహద్దు వివాదాన్ని పోలుస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారు. 'ఉక్రెయిన్‌ను ఆక్రమిస్తూ రష్యా ఆ దేశంతో ఉన్న సరిహద్దులను మార్చేస్తోంది. అదే తరహాలో భారత్‌తో ఉన్న సరిహద్దును మార్చేందుకు చైనా తన సైన్యం చొరబాట్లతో దుస్సాహసానికి తెగబడుతోంది' అని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం చీఫ్ కమల్ హాసన్‌తో చర్చాగోష్ఠి తాలూకు సుదీర్ఘ వీడియోను రాహుల్ గాంధీ సోమవారం ట్వీట్ చేశారు. 'బలహీన ఆర్థిక వ్యవస్థ, దమ్ములేని నాయకత్వంలో దార్శనికత కొరవడిన ప్రజలు, విద్వేషం, ఆగ్రహం కలగలిసిన ఈ పరిస్థితులను చైనా తనకు అనువుగా మలచుకుంటోంది. లద్దాఖ్‌లోకి వస్తామంటోంది. అరుణాచల్‌లో అడుగుపెడతామంటోంది' అని రాహుల్ ఆందోళన వ్యక్తంచేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఈనెల 3వ తేదీ నుంచి మొదలయ్యే భారత్ జోడో యాత్రలో పాల్గొనాలంటూ ఆహ్వానం పంపిన రాహుల్ గాంధీకి ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ చీఫ్ మాయావతి కృతజ్ఞతలు తెలిపారు.

ఫిబ్రవరి 24 నుంచి కాంగ్రెస్ ప్లీనరీ

ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఫిబ్రవరి 24 నుంచి 26 దాకా.. మూడు రోజులపాటు తమ పార్టీ 85వ ప్లీనరీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం తెలియజేశారు. పార్టీ రాజ్యాంగం ప్రకారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ)కి సైతం ప్లీనరీ సందర్భంగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సిరియాపై ఇజ్రాయెల్ దాడులు

బీరుట్: ఇజ్రాయెల్ ప్రభుత్వం మరోమారు సిరియాపై దాడులకు తెగబడింది. సిరియా రాజధాని నగరం డమాస్కస్‌లోని అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌పై క్షిపణి దాడులకు దిగింది. ఈ ఘటనలో ఇద్దరు సిరియా సైనికులు, ఇద్దరు విమానాశ్రయ సిబ్బంది మరణించారు. ఎయిర్‌పోర్ట్‌లో ఒకవైపు రన్‌వే దెబ్బతింది. రెండు టర్మినళ్లలో నిర్వహణ వ్యవస్థ ధ్వంసమైంది. ఆదివారం అర్ధరాత్రి దాటాక ఈ దాడి ఘటన జరిగింది. గత ఏడు నెలల్లో డమాస్కస్ ఎయిర్‌పోర్ట్‌పై ఇజ్రాయెల్ క్షిపణులు ప్రయోగించడం ఇది రెండోసారి. బషర్ అల్ అసద్‌కు మద్దతు పలుకుతున్న స్థానిక ఉగ్రవాదులకు ఇరాన్, లెబనాన్ హిజ్‌బుల్లాల నుంచి ఆయుధాల సరఫరాను అడ్డుకునేందుకే ఈ దాడులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎయిర్‌పోర్ట్‌తోపాటు డమాస్కస్ దక్షిణాన ఉన్న సిరియా ఆయుధాగారంపైనా ఇజ్రాయెల్ క్షిపణులను ఎక్కుపెట్టింది.

వెస్ట్‌బ్యాంక్‌లో కాల్పులు

రమల్లా: ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ సైన్యంతో ఆదివారం జరిగిన ఘర్షణల్లో ఇద్దరు పాలస్తీనియన్లు చనిపోయారు. జెనిన్‌లోని కాఫిర్‌దాన్‌లోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ ఆర్మీని పాలస్తీనియన్లు అడ్డుకున్నారు. దీంతో ఆర్మీ వారిపైకి కాల్పులకు దిగింది. కాల్పుల్లో సమెర్ హౌషియెహ్(21), ఫవాద్ అబెద్(25) అనే వారు మృతి చెందారు.

ఒక్క క్షిపణితో 400 మంది హతం !

డోనెట్స్‌క్‌లో దాడిలో రష్యా సైనికుల్ని చంపామన్న ఉక్రెయిన్

కీవ్: దురాక్రమణకు దిగిన రష్యా సేనలను క్షిపణి దాడుల్లో అంతమొందించే పరంపర కొనసాగుతోందని ఉక్రెయిన్ ప్రకటించింది. డోనెట్స్‌క్ ప్రాంతంలో తమ సేనలు జరిపిన భారీ క్షిపణి దాడిలో ఏకంగా 400 మంది రష్యా సైనికులు చనిపోయారని ఉక్రెయిన్ పేర్కొంది. ఈ దాడిలో మరో 300 మంది గాయపడ్డారని తెలిపింది. అయితే 63 మంది సైనికులే మరణించారని రష్యా స్పష్టంచేసింది. మకీవ్కా సిటీలో ఆదివారం అర్ధరాత్రి ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఒక పెద్ద భవంతిలో సేద తీరుతున్న రష్యా సైనికులే లక్ష్యంగా ఉక్రెయిన్ క్షిపణి దాడి జరిగింది. అమెరికా సరఫరా చేసిన హిమార్స్ రాకెట్లను ఆరింటిని ఉక్రెయిన్ సేనలు ప్రయోగించగా రెండింటిని నేలకూల్చామని మిగతావి భవనాన్ని నేలమట్టంచేశాయని రష్యా సోమవారం తెలిపింది. భవనంలోని సైనికులు ఇంకా యుద్ధంలో నేరుగా పాల్గొనలేదని, ఇటీవల రష్యా నుంచి డోనెట్స్‌క్‌కు చేరుకున్నారని, అదే భవనంలో యుద్ధంతాలూకు పేలుడుపదార్థాలు ఉండటంతో విధ్వంసం తీవ్రత పెరిగిందని స్థానిక మీడియా తెలిపింది. మరోవైపు, డోనెట్స్‌క్‌లో దాడి తర్వాత ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా మరోసారి డ్రోన్లకు పనిజెప్పింది. కీలకమైన మౌలిక వ్యవస్థలపై సోమవారం 40 డ్రోన్లు దాడికి యత్నించగా అన్నింటినీ కూల్చేశామని కీవ్ మేయర్ విటలీ క్లిష్చెకో చెప్పారు. కీవ్ ప్రాంతంలో కీలక మౌలిక వ్యవస్థలు, జనావాసాలపై డ్రోన్ దాడులు సోమవారం సైతం కొనసాగాయని కీవ్ ప్రాంత గవర్నర్ కుబేలా చెప్పారు.



రష్యా దాడిలో ధ్వంసమైన కీవ్ ప్రాంతం

పొడవులో ఘనాపాటి

- ఎత్తు 7 అడుగుల 4 అంగుళాలు
- త్వరలో గిన్నిస్ రికార్డుకెక్కే చాన్స్



అక్రా: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన వ్యక్తిగా టర్కీకి చెందిన 40 ఏళ్ల సుల్తాన్ సేన్ గతంలోనే గిన్నిస్ ప్రపంచ రికార్డులకెక్కాడు. అయితే, ఇతడిని దాటేసేందుకు ఘనాకు చెందిన 29 ఏళ్ల వ్యక్తి నెలనెలా తెగ పెరిగిపోతున్నాడు. ఇతని పేరు సులేమనా అబ్దుల్ సమీద్. అందరిలా సాధారణ ఎత్తు ఉన్న సమీద్ 22 ఏళ్ల వయసులో వేగంగా పెరగడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. దగ్గర్లోని ఆస్పత్రికి వెళ్లి ఎత్తు కొలవమంటే వారి దగ్గర సరిపడా టేప్ లేదు. ఒక ఎత్తయిన కర్ర తీసుకుని ఎత్తు తేల్చారు. అప్పుడు అతని ఎత్తు 7 అడుగుల 4 అంగుళాలు. గిన్నిస్‌లో స్థానం సంపాదించిన సుల్తాన్(ఎత్తు 8 అడుగుల 2.8 అంగుళాలు)ను త్వరలోనే దాటేస్తావని అందరూ తెగ పొగిడేశారు. సమీద్ ఇంకా ఎత్తు పెరుగుతుండటం గమనార్హం. కాగా 'మార్ఫాన్ సిండ్రోమ్‌గా పిలిచే ఈ జన్యుసంబంధ వ్యాధి కారణంగా తీవ్ర గుండె సమస్యలు తలెత్తుతాయి. మెదడుకు శస్త్రచికిత్స చేసి ఇతని పెరుగుదలను ఆపాల్సి ఉంది' అని వైద్యులు తెలిపారు.

సాక్షి
కరీంనగర్

మంగళవారం । 3 । జనవరి । 2023





ముక్కోటి మొక్కులు

మంకమ్మతోటలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఉత్తరద్వారం దర్శనం ఇస్తున్న స్వామివార్లు

- వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు
- ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చిన స్వామివార్లు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కరీంనగర్‌కల్చరల్: జిల్లావ్యాప్తంగా వైకుంఠఏకాదశి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. గోవిందనామ స్మరణతో మార్మోగాయి. వేకువజామునుంచే ప్రధాన ఆలయాల్లో రద్దీ కనిపించింది. స్వామివార్లు ఉత్తరద్వారం గుండా దర్శనం ఇవ్వగా... భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. నగరంలోని మార్కెట్ రోడ్డులో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శేష వాహనంపై ఆశీనుడై ఉన్న శ్రీవారిని భక్తులు ఉత్తర ద్వారంగుండా దర్శించుకున్నారు. వేకువజామున మూడు గంటల నుంచే రద్దీ కనిపించింది. దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, కాంగ్రెస్ నాయకుడు మేనని రోహిత్‌రావు స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో ఉడుతల వెంకన్న, ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, గంగాధర్, గంప రమేశ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. తిరుమల వెంకన్నను మంత్రి కమలాకర్ దర్శించుకున్నారు.

ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో..

ఇల్లందకుంట: ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. వేకువజామునుంచే ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. గరుడవాహనంపై సీతారాముల ఉత్సవమూర్తులను ఊరేగించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ-గణపతి దంపతులు, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, తదతరులు స్వామివార్లను దర్శించుకున్నారు.



కరీంనగర్‌లో తులసీపూజలు చేస్తున్న భక్తులు



ఇల్లందకుంటలో రాములోరి ఊరేగింపు



తిరుమల వెంకన్న సన్నిధిలో మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు

న్యూస్‌రీల్

నీట మునిగిన పొలాలు



నీట మునిగిన పంట పొలాలను చూపుతున్న రైతులు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ శివారులో పందివాగులోకి ఎస్సారెస్పీ నీరును వదులడంతో ఆకస్మికంగా నీరుచేరి పంట పొలాలు మునిగాయని స్థానిక రైతులు వాపోయారు. పెద్దపెల్లి జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్‌కు నీటిని తరలించేందుకు అక్కడి ప్రజా ప్రతినిధి ఆదేశాలతో ఎస్సారెస్పీ అధికారులు రెవెల్లి హెడ్ రెగ్యులేటర్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా నీటిని విడుదల చేయడంతో తమకు నష్టం సంభవించిందని రైతులు తెలిపారు. నాటు వేసిన పొలాలు, వడ్ల బస్తాలు వరుదలకు దెబ్బతిన్నాయని ఉన్నతాధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

పశుమిత్రల ధర్నా



ధర్నా చేస్తున్న పశుమిత్రలు

కరీంనగర్: పశు సంవర్ధకశాఖ పరిధిలో పనిచేస్తున్న పశుమిత్రల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 2500 మంది పశుమిత్రులు ఎనిమిదేళ్ల నుంచి సేవలందిస్తున్నారని, ఎక్కువ మంది మహిళలే ఉన్నారని అన్నారు. ఐకేపీ ద్వారా శిక్షణఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి పారితోషికాలు నిర్ణయించకుండా పశువైద్యశాఖలో పశుమిత్రులుగా నియమించిందని అన్నారు. ఎలాంటి పారితోషకం లేకుండా పశుమిత్రులతో వెట్టిచాకిరీ చేయించుకోవడం శోచనీయమని అన్నారు. రాబోయే రోజుల్లో పశుమిత్రలు పోరాట మార్గం ద్వారా హక్కులు సాధించుకుంటామన్నారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్ కర్ణన్‌కు వినతిపత్రం ఇచ్చారు. లలిత, ప్రభ, పద్మ, స్వర్ణలత, లిఖిత, రేణుక, స్వప్న తదితరులు ఉన్నారు.

ఎంపీ సంజయ్‌ని కలిసిన టీఎన్‌జీవోలు



శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్‌జీవోలు

కరీంనగర్: ముక్కోటి ఏకాదశి, నూతన సంవత్సరం సందర్భంగా ఎంపీ బండి సంజయ్‌ని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, దారం శ్రీనివాస్‌రెడ్డిలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎల్ఎండీలో ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరారు. అక్కడి కమ్యూనిటీహాల్‌కు రూ.5 లక్షల నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాగుల నర్సింహస్వామి, ముప్పిడి కిరణ్‌కుమార్, రాగి శ్రీనివాస్, డీపీవో వీర బుచ్చయ్య, గూడా ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అక్బర్ రాజేశ్వర్‌రావు, తదితరులు ఉన్నారు.

వృద్ధులకు యువశక్తి తోడుగా ఉండాలి



మాట్లాడుతున్న ఉచ్చిడి మోహన్‌రెడ్డి

విద్యానగర్(కరీంనగర్): వృద్ధులకు యువశక్తి తోడైతే అంతకు మించిన సంపద లేదని మాజీ ఎమ్మెల్యే, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉచ్చిడి మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్ కృషి భవన్‌లో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. దేశంలో యువతకు కొదవలేదని, యువశక్తి వృద్ధుల మేధస్సుకు తోడైతే దేశం అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ బాధ్యులు సముద్రాల జనార్దన్‌రావు, ప్రధాన కార్యదర్శి భూంపల్లి మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పేరం కొమురయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ మామిడి కృష్ణ, కోశాధికారి చింతల శ్రీనివాస్, కృషి భవన్ చైర్మన్ సిరికొండ కమలాకర్‌రావు పాల్గొన్నారు.

ప్రతిభకు పట్టం!

- త్వరలో జెడ్పీ సీఈవోకు ఐఏఎస్ హోదా
- అడిషనల్ కలెక్టర్ గరిమాకు స్థానచలనం
- పోలీస్ కమిషనర్ సత్యనారాయణకూ బదిలీ?
- త్వరలో జిల్లా పరిపాలనలో భారీగా మార్పులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జిల్లా పరిపాలన విషయంలో త్వరలో భారీగా మార్పులు జరగనున్నాయి. జిల్లాలో కీలకమైన పదవిలో ఉన్న పలువురు వ్యక్తులకు పదోన్నతులు, బదిలీలు చోటుచేసుకోనున్నాయి. ఈ ఏడాదిలోనే అసెంబ్లీ ఎన్నికలు రానుండటం, త్వరలోనే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు జరగనున్న నేపథ్యంలో మన జిల్లా కీలక అధికారులు కూడా బదిలీ కానున్నారన్న ప్రచారం జోరందుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కరీంనగర్‌లో సమర్థులుగా నిలిచిన పలువురు అధికారులకు ప్రభుత్వం పదోన్నతులు ఇవ్వనుంది. కొందరి హోదా పెరగనుండగా, మరికొందరికి మరింత పెద్ద బాధ్యతలు అప్పగించనుంది. వీరిలో జిల్లా జెడ్పీ సీఈవో ప్రియాంకా ముందు వరుసలో ఉన్నారని సమాచారం. గతేడాది బదిలీపై కరీంనగర్‌కు వచ్చిన ప్రియాంక జిల్లా జెడ్పీ విభాగంపై తనదైన ముద్ర వేశారు. పనిలో చూపిన ప్రతిభ, పారదర్శకత కారణంగా త్వరలోనే ఆమెకు ఐఏఎస్ హోదా దక్కనుందని తెలిసింది. సాధారణంగా ప్రభుత్వ కీలకశాఖల్లో ఏ అధికారికి పదోన్నతి వచ్చినా.. దాని వెంటే బదిలీలు కూడా ఉంటాయి. ఈ లెక్కన ఆమెకు పదోన్నతిపాటే బదిలీ కూడా జరిగే అవకాశాలు ఉండొచ్చని కలెక్టరేట్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.

- అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) గరిమా అగర్వాల్ త్వరలోనే బదిలీ కానున్నారని తెలిసింది. విధి నిర్వహణలో ముక్కుసూటిగా వ్యవహరిస్తారని, బాధితుల పక్షానే నిలుస్తారని, రాజకీయ ఒత్తిళ్లను అస్సలు లెక్కచేయని అధికారిగా పేరు తెచ్చుకున్నారు.
- కరీంనగర్‌లాంటి ప్రతిష్టాత్మక జిల్లాలో తక్కువ సమయంలో ఇలా మంచి పేరు సంపాదించుకోవడం అరుదైన విషయం. అందుకే, ప్రభుత్వం గరిమా అగర్వాల్ సేవలను హైదరాబాద్‌లో వినియోగించుకోవాలని చూస్తోందని కలెక్టరేట్లో ప్రచారం సాగుతోంది.
- ఇప్పటికే మరో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఉన్న శ్యాంప్రసాద్ లాల్ పదవీకాలం నాలుగేళ్లు దాటింది. ఎన్నికల నిబంధనల మేరకు ఈయనకు బదిలీ దాదాపుగా ఖరారు అయినట్లే. దీంతో రెండు అడిషనల్ కలెక్టర్ పోస్టులకు త్వరలో కొత్త అధికారులు రానున్నారు.
- త్వరలో జరిగే ఐపీఎస్‌ల బదిలీల్లో కరీంనగర్ పోలీస్ కమిషనర్ సత్యనారాయణ కూడా ఉన్నారన్న ప్రచారం సాగుతోంది. ఈయన గతేడాది జూలైలో కరీంనగర్ సీపీగా బాధ్యతలు చేపట్టారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే స్థానానికి ఈటల రాజేందర్ రాజీనామా చేయడంతో.. అప్పటికే నాలుగేళ్లుగా సీపీగా కొనసాగుతున్న కమలాసన్ రెడ్డిని ప్రభుత్వం బదిలీ చేసింది.
- వాస్తవానికి త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి సీపీకి రెండేళ్లు మాత్రమే పూర్తవుతాయి. ఇటీవల డీజీపీ మహేందర్‌రెడ్డి పదవీకాలం ముగిసి ఆ స్థానంలో అంజనీకుమార్ బాధ్యతలు చేపట్టారు. త్వరలోనే రాష్ట్రంలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ బదిలీల్లో కరీంనగర్ సీపీ సత్యనారాయణ కూడా ఉన్నారన్న ప్రచారం జోరందుకుంది.
- పోలీస్ కమిషనర్ కూడా స్థానిక రాజకీయాలతో విసుగు చెందారని సమాచారం. కర్నూలు, పాతబస్తీల్లాంటి సున్నిత ప్రాంతాల్లో సమర్థంగా విధులు నిర్వహించిన అధికారిగా సత్యనారాయణకు డిపార్ట్‌మెంటులో మంచిపేరుంది.
- రామగుండం సీపీగానూ మంచిమార్కులే పడ్డాయి. ముఖ్యంగా కరోనా సమయంలో మిడతల దండు రాకుండా మహారాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన ప్రత్యేక టీంకు నేతృత్వం వహించారు. ఆ ఆపరేషన్‌ను దిగ్విజయంగా పూర్తి చేసి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు.
- కరీంనగర్‌లో కార్పొరేటర్ల భూ కబ్జాల విషయంలో ఆధారాలున్నా అరెస్టు చేయలేక పోతున్నారన్న అపవాదు డిపార్ట్‌మెంటుపై పడటం ఆయనను ఇబ్బంది పెట్టినట్లు సమాచారం. ఈ క్రమంలో త్వరగా ఇక్కడ నుంచి బదిలీ కావాలని ఆయనే కోరుకుంటున్నట్లు తెలిసింది. కానీ, ఉన్నతాధికారులు మాత్రం ఈయనను ఇక్కడే కొనసాగించే ఆలోచనలో ఉన్నారని ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో జిల్లాలో అధికారుల బదిలీలు, పదోన్నతులపై త్వరలోనే స్పష్టత రానుంది.

ప్రజావాణికి 157 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కరీంనగర్: ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 157 దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి 11, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి 8, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి 6, కమిషనర్ ఆఫ్ పోలీస్ 5, ఆర్డీఓ 6, జిల్లా సంక్షేమ అధికారి 5, తహసీల్దార్, కరీంనగర్ రూరల్ కార్యాలయానికి 5, తహసీల్దార్ కొత్తపల్లి 12, తహసీల్దార్ కరీంనగర్‌కు 11 ఫిర్యాదులు రాగా.. మిగిలినశాఖలకు 93 మొత్తం 157 దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్ లాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, ఆర్డీవో ఆనంద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, కలెక్టరేట్ ఏవో నారాయణస్వామి పాల్గొన్నారు.

ప్రజావాణిలో 'సూసైడ్' నోట్

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌కు చెందిన కొత్త సుజాత- రాజిరెడ్డి దంపతులు కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు సూసైడ్ నోటు అందజేశారు. భగత్‌నగర్‌లో ఇల్లు కట్టుకునేందుకు కార్పొరేషన్ అనుమతి తీసుకున్నా తన ఇంటి నిర్మాణానికి అడ్డుపడుతూ, ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ విషయంపై రెండేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు, కోర్టులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని సూసైడ్‌నోట్‌లో వివరించారు. చీటి రామరావు అనే వ్యక్తికి అధికారులు వంతపాడుతూ పోలీసులు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ సిబ్బంది కుమ్మక్కై తమను మనస్తాపానికి గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవలే హైకోర్టు ఆర్డర్ తనకు అనుకూలంగా వచ్చినా లెక్క చేయకుండా తప్పుడు రిపోర్టులు సమర్పిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని తన ఇంటి నిర్మాణానికి అనుమతి ఇప్పించాలని, లేకుంటే రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం కుటుంబ సభ్యులం అక్కడే చనిపోవాలని నిర్ణయం తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇంటిపన్ను చెల్లించాలని సబ్‌స్టేషన్‌కు నోటీసు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లోని 220/132/33కేవీ సబ్‌స్టేషన్ ఇంటి పన్ను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పంచాయతీపాలకవర్గం నోటీస్ జారీ చేసింది. గత కొన్ని సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.7,28,525 చెల్లించాలంటూ పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి సబ్‌స్టేషన్ ఏడీ విజయ్‌కుమార్‌కు నోటీసు ఇచ్చారు. 15రోజుల్లోగా పన్ను చెల్లించాలని పేర్కొన్నారు.

పత్తి ధర రూ.8,050

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.8,050 పలికింది. మార్కెట్‌కు 22వాహనాలలో 174 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.8,050, మోడల్ ధర రూ.8,000, కనిష్ఠ ధర రూ.7,700 పలికింది. గన్నీసంచుల్లో నలుగురు రైతులు ఆరుక్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,500, మోడల్ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.7,000కు వ్యాపారులు కొనుగోలు చేశారు.

సహకారం ఇక పటిష్టం

- సిబ్బంది ఉద్యోగాలకు భద్రత
- ప్యాక్స్ చైర్మన్లకు గౌరవ వేతనం

కరీంనగర్ అర్బన్: సహకార వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జవాబుదారితనం, పారదర్శకత పెరిగేలా సంస్కరణలు చేపట్టింది. రైతుల సంక్షేమార్థం వివిధ స్కీంలతో అక్కున చేర్చుకుంటుండగా బ్యాంకు ఉద్యోగులు, సొసైటీ ఉద్యోగులు, చైర్మన్లకు సముచిత గౌరవం ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే జీవోలు జారీ కాగా తదనుగుణంగా కసరత్తు చేయనున్నారు. సిబ్బందికి ఉద్యోగ భద్రతతో పాటు చైర్మన్లకు గౌరవ వేతనం ఇవ్వనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 128 సంఘాలు

అన్నదాతలు పరస్పరం సహకరించుకుంటూ ప్రగతికి బాటలు వేసుకునేలా చైతన్యం తీసుకురావడం సహకార వ్యవస్థ ప్రధాన లక్ష్యం. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్-ప్యాక్స్)లు ఇదే బాటలో పయనిస్తున్నాయి. సహకార సంఘాల నిర్వహణ ప్రధాన బాధ్యత అధ్యక్షులపైనే ఉంటుంది. వీరికి గౌరవ వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి జిల్లాలో 128 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. ఆయా సొసైటీల పరిధిలో 95,726 మంది రైతులు సభ్యులుగా ఉండగా 1,700 వరకు ఉద్యోగులున్నారు. సహకార సంఘాల వ్యాపారాలు, టర్నోవర్ బట్టి సంఘాల అధ్యక్షులకు 2006 నుంచి గౌరవ వేతనాలు నిర్ణయించారు. రూ.300 నుంచి రూ.1,250 వరకు అమలు చేశారు. పెరిగిన ధరలకు ఇది ఏ మాత్రం సరిపోదని, వేతనాలు పెంచాలంటూ సొసైటీ అధ్యక్షుల నుంచి ప్రభుత్వానికి వినతులు అందడంతో సానుకూలంగా స్పందన లభించింది. తాజాగా విడుదల చేసిన జీవో ప్రకారం గౌరవ వేతనం కనిష్ఠంగా రూ.5 వేలు, గరిష్ఠంగా రూ.15 వేలకు చేరింది. ఈ నెల నుంచి అమలులోకి రానుంది. అధ్యక్షులకు గౌరవవేతనం పెంచినా వాటిని భరించాల్సింది ఆయా సొసైటీలే. సిబ్బంది వేతనాలు, ఎన్నికల ఖర్చులు సంఘాల లెక్కిందే చూపుతారు.

ఉద్యోగాలకు భద్రత

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వ నిర్ణయంతో ఆశలు చిగురించాయి. దశాబ్దాలుగా తక్కువ వేతనాలకు పనిచేస్తున్న సహకార ఉద్యోగులకు భద్రతతో పాటు హెచ్‌ఎస్‌ఏ పాలసీ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చింది. 2009కి ముందు ఉమ్మడి కరీంనగర్ డీసీసీబీ పరిధిలో 92 మంది దాకా సీఈవోలు, 150 మంది క్లర్కులు, మరో 190 మంది సహాయకులుగా పనిచేస్తున్నారు. 2009 నుంచి 2014 వరకు అదనపు సిబ్బందిని సంఘాల అధ్యక్షులు నియమించుకున్నారు. అప్పట్లో నియమితులైన అనేక మంది ప్రస్తుతం సీఈవోలుగా పనిచేస్తున్నారు.

నిరీక్షణకు తెర

ఉత్తర్వుల ప్రకారం 2009 నుంచి 2019 మార్చి 30లోపు నియమితులైన సిబ్బందికి ఉద్యోగ భద్రత లభించనుంది. ఇప్పుడు తీసుకుంటున్న వేతనం కన్నా అదనంగా రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు పెరిగే అవకాశముంది. ఈ నిబంధన ఉమ్మడి జిల్లాలో 90శాతం మంది సీఈవోలకు వర్తించే అవకాశముంది. ప్రస్తుతం సహకార సంఘాల సీఈవో హోదాను కార్యదర్శిగా మార్చనున్నారు. డీసీసీబీలో నియామకాలకు ఇక నుంచి సహకార సంఘాల్లో పని చేస్తున్న సిబ్బందికి 2శాతం రిజర్వేషన్లు కల్పిస్తారు. మెయింటెనెన్స్ గ్రాట్యుటీ రూ.లక్ష నుంచి రూ.2.50 లక్షలకు పెంచుతారు.

పాలకవర్గాల నియామకాలు చెల్లవిక

ఏ పాలకవర్గం ఉంటే స్థానిక కొరత క్రమంలో తాత్కలిక పద్ధతిన నియామకం చేసేవారు. ఇపుడు పని చేస్తున్న 70శాతం మంది ఇలాగే విధుల్లో చేరారు. ఇక మీదట అవకాశం లేదు. ఈ అనవాయితీకి చెక్ పెట్టేందుకు సర్కారు నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. పాలకవర్గంతో ప్రమేయం లేకుండా ప్రత్యేక బోర్డు ద్వారా మాత్రమే సిబ్బందిని నియమిస్తారు. చదువు, అనుభవం, అధికారిక గుర్తింపు పరిగణనలోకి తీసుకుంటారు.



కేడీసీసీబీ

ఉమ్మడి జిల్లా వివరాలు
ప్రాథమిక సహకార సంఘాలు: 128
సహకార కేంద్ర బ్యాంకు శాఖలు: 67
బ్యాంకు ఉద్యోగులు: 552
సొసైటీ ఉద్యోగులు: 1,700

సంఘాల ఆర్థిక లావాదేవీల ప్రకారం గౌరవ వేతనమిలా	
రూ.5కోట్ల లోపు:	రూ.5వేలు
రూ.5–10కోట్లు:	రూ.7500
రూ.10–15కోట్లు:	రూ.10000
రూ.15–25కోట్లు:	రూ.12,500
రూ.25కోట్లపైన:	రూ.15000

శుభ పరిణామం



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంఘాల అభివృద్ధికి మంచి పరిణామం. సంఘాలు అభివద్ధి దిశగా ఎదుగుతాయి. రైతులకు అన్ని రకాల రుణాలు ఇప్పటికే అందిస్తున్నాం. ఇక నుంచి మరింతగా సేవలు అందుతాయి. రైతులకు చేదోడుగా సంఘాలు ఉంటాయి.

– జి.హన్మంతరావు, టీసీసీబీఈఏ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

రీజినల్‌ మేనేజర్‌కు అధికారుల శుభాకాంక్షలు



ఖుస్రోషాఖాన్‌కు బొకే అందజేస్తున్న అధికారులు

కరీంనగర్‌: నూతన సంవత్సరం సందర్భంగా కరీంనగర్‌ రీజినల్‌ మేనేజర్‌ ఖుస్రో షాఖాన్‌ను రీజియన్‌లోని అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్‌ మేనేజర్‌ (ఆపరేషన్స్‌)ఎస్‌.చందర్‌రావు, డిప్యూటీ రీజనల్‌ మేనేజర్‌ (మెకానికల్‌) వి.శివ శంకర్‌, డిప్యూటీ చీఫ్‌ పర్సనల్‌ మేనేజర్‌ ఎం.చంద్రయ్య, అకౌంట్స్‌ ఆఫీసర్‌ సిహెచ్‌.వెంకటేశ్వర్లు, పర్సనల్‌ ఆఫీసర్‌ కె.రమణారెడ్డి, కరీంనగర్‌– 2 డిపో మేనేజర్‌ వి.మల్లయ్య, కరీంనగర్‌–1 డిపో మేనేజర్‌ ఎస్‌.ప్రణీత్‌, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ రీజనల్‌ అధ్యక్షుడు లచ్చిరాంనాయక్‌, రీజనల్‌ కార్యదర్శి దొంత రాజయ్య, నాయకులు కమల, గుర్రాల రవీందర్‌, శంకరయ్య, స్వామి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.1.50 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న నారాయణరెడ్డి

చిగురుమామిడి(హుస్నాబాద్‌): ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం మండలంలోని ఇందుర్తి గ్రామంలో గల హరిహర క్షేత్రంలో గునుకులపల్లెకు చెందిన గునుకుల నారాయణరెడ్డి (రిటైర్డ్‌ లెక్చరర్‌) తన కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన అభివృద్ధికి తన వంతుగా రూ.1.50లక్షల విలువగల చెక్కు ఆలయ అర్చకులు గుజ్జ రాజన్నశర్మ, కిరణ్‌శర్మలకు అందజేశారు. ఆలయ పునర్నిర్మాణంతో పాటు గణేశ్‌ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈసందర్భంగా నారాయణరెడ్డి కుటుంబ సభ్యులను అర్చకులు సన్మానించారు. కార్యక్రమంలో యూఎస్‌ఏ డాక్టర్‌ గునుకుల సమీర్‌రెడ్డి, సిద్దిపేట సుషేణ హెల్త్‌కేర్‌ ఎండీ గునుకుల నారాయణరెడ్డి, వంశీరెడ్డి, నిషన్‌రెడ్డి, భాస్కర్‌ రెడ్డి, సంతోష్‌రెడ్డి, గాదే రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా హ్యాండ్‌బాల్‌ ఎంపిక పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

రామడుగు(చొప్పదండి): ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ పాఠశాల ఆవరణలో జూనియర్స్‌ అండర్‌–19 బాల బాలికల ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లాస్థాయిలో ఎంపికైనవారు ఖమ్మం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్‌ తెలిపారు. కాగా ఈ కార్యక్రమాన్ని ప్రధ్యానోపాధ్యాయులు భారతి, కె.మల్లారెడ్డి ప్రారంభించగా సంయుక్త కార్యదర్శి ప్రభాకర్‌, విద్యాసాగర్‌, కృష్ణహరి, ప్రేమ్‌, సురేందర్‌, కోచ్‌లు వెంకటేష్‌, అశోక్‌, రాజు, రమేష్‌, యశోద, దుర్గారాజ్‌, ఆషి, సుష్మిత, లావణ్య, విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

వరిసాగు.. ఆధునిక పద్ధతులు మేలు

- తగ్గనున్న పెట్టుబడి.. ముందుగానే పంట కోత
- నేరుగా విత్తడం, డ్రమ్‌సీడర్‌ పద్ధతులపై రైతులకు అవగాహన



డ్రమ్‌ సీడర్‌తో నాటు వేస్తున్న రైతు



వెదజల్లే పద్ధతిలో సాగువుతున్న పొలం

జమ్మికుంట(హుజూరాబాద్‌): వరి సాగులో ఆధునిక పద్ధతులు అవలంభిస్తే పెట్టుబడులు తగ్గి, పంట 10 రోజుల ముందుగానే కోతకు వస్తుంది. కూలీల కొరత, పెట్టుబడులను తగ్గించుకునేందుకు రైతులు నేరుగా పొలంలో వరి విత్తే పద్ధతి, డ్రమ్‌సీడర్‌తో నాటు వేసే పద్ధతులను పాటిస్తున్నారు. రెండు పద్ధతులపై రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

విత్తే పద్ధతితో లాభాలు

- ఎకరానికి 12–15 కిలోల విత్తనాలు వేసుకోవచ్చు. పంట 10 రోజుల ముందుగానే కోతకు వస్తుంది.
- నారు పెంపకం, నారు పీకడం, నాట్లు వేసే పని ఉండదు. సాగు ఖర్చు ఎకరానికి రూ.2,500–రూ.4,000 వరకు తగ్గుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో విత్తుకోవచ్చు. కూలీల కొరతను అధిగమించి, సొంతంగా పని చేసుకోవచ్చు
- ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంట కాలం కోల్పోకుండా, అందుబాటులో ఉన్నప్పుడు వరి సాగు చేసుకునే అవకాశం ఉంది. కాండం గట్టిగా ఉండి వేరు వ్యవస్థ దృఢంగా ఉండి పడిపోని రకాలు ఎంపిక చేసుకోవాలి.
- సాధారణ పద్ధతితో పోల్చితే వెదజల్లే, డ్రమ్‌ సీడర్‌ పద్ధతిలో ఏ రకమైన పంట అయినా 7–10 రోజుల ముందుగా కోతకు వస్తుంది. మాములు పద్ధతితో పోల్చితే 10–15 శాతం అధిక దిగుబడి వస్తుందని అధికారులు, అనుభవం కలిగిన రైతులు పేర్కొంటున్నారు.

విత్తనాన్ని మండెకట్టడం

- విత్తనాలను 24 గంటలు నానబెట్టాలి. నానిన విత్తనాలను గోనె సంచిలో వేసి 24గంటలు ఉంచాలి. తర్వాత ముక్కుపగిలి తెల్లగా మోస వస్తుంది. రబీ పంటకాలంలో ఉష్ణోగ్రత తక్కువ ఉంటుంది కాబట్టి 36 గంటల పాటు మండెకట్టాలి. తెల్ల మోస వస్తే నాటుకు సిద్ధమైనట్లు భావించాలి.
- సాధారణ పద్ధతిలో వరి నాటేటప్పుడు భూమిని తయారు చేసినట్లుగానే ఈ పద్ధతిలో కూడా తయారు చేయాలి. పొలంలో నీరు ఎక్కువైతే బయటకు పోవడానికి ఏర్పాట్లు చేసుకోవాలి. బంకనేలలో చదును, దమ్ము చేసి మరుసటి రోజు విత్తుకోవచ్చు. ఇసుక శాతం ఎక్కువ ఉన్న నేలల్లో దమ్ము చేసిన రోజే విత్తుకోవచ్చు.
- సాధారణ వరి సాగుతో పోల్చితే డ్రమ్‌సీడర్‌ పద్ధతిలో పురుగులు, తెగుళ్ల తాకిడి తక్కువగా ఉంటుంది. చీడపీడల నివారణకు సాధారణ పద్ధతుల్లోనే సస్యరక్షణ చేట్టాలి.
- రాష్ట్ర ప్రభుత్వం నేరుగా విత్తుకునే పద్ధతిని ప్రోత్సహిస్తుంది. డ్రమ్‌సీడర్‌ కొనుగోలు చేయలేని రైతులకు అద్దెకు ఇచ్చేందుకు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసింది. గ్రామ పంచాయతీల్లో డ్రమ్‌సీడర్లు అందుబాటులో ఉంచుతున్నారు. రైతులు వేసుకునే రోజుకు ముందుగా పేరు నమోదు చేసుకొని విత్తనం తయారు చేసుకొని నాటు వేసుకోవచ్చు.



ఖర్చులు తగ్గాయి

నాకున్న మూడెకరాల్లో నాటు వేశా. యాసంగి సాగులో డ్రమ్‌సీడర్‌తో నాటు వేస్తే కూలీల కొరత తీరింది. ఎకరాకు రూ.5వేల వరకు ఖర్చులు తగ్గాయి. సాధారణ పద్ధతికంటే పొలం ఏపుగా పెరిగి, ఎక్కువ దిగుబడి వస్తుందని అనుకుంటున్నారు. – తిప్పరాపు సర్వేశం, రైతు, పెద్దంపల్లి

సద్వినియోగం చేసుకోవాలి



నేరుగా విత్తే పద్ధతితో పెట్టుబడి తగ్గుతుంది. వ్యవసాయ శాఖ అధికారులు, అనుభవం కలిగిన రైతుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. కొత్తగా ఆధునిక పద్ధతిలో సాగు చేసేవారు మెలకువలు పాటిస్తే లాభదాయకంగా ఉంటుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – చెల్పూరి లక్ష్మణ్‌, ఏఈవో , జమ్మికుంట

సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి గంగుల



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి గంగుల కమలాకర్‌

కరీంనగర్‌: రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును సోమవారం ప్రగతిభవన్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర ఉన్నారు.

స్కిన్‌ థెరపిస్టు ఉద్యోగానికి 'అల్ఫోర్స్‌' విద్యార్థి



స్ఫూర్తిని అభినందిస్తున్న రవీందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్‌): కరీంనగర్‌లోని సూర్యనగర్‌లో గల అల్ఫోర్స్‌ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గాజంగి స్ఫూర్తి హైదరాబాద్‌కు చెందిన లీగార్డ్స్‌ కాస్మోటిక్‌ క్లీనిక్‌లో స్కిన్‌ థెరపిస్టు ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్‌ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా సోమవారం విద్యార్థిని అభినందించి మాట్లాడారు. డిగ్రీతో పాటు ఆసక్తి గల రంగాల్లో విద్యార్థులు రాణించేలా నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. న్యూట్రిషన్‌, ఫుడ్‌ సైన్స్‌ రంగాల్లో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాలికను దత్తత తీసుకున్న తమిళనాడు దంపతులు



తల్లిదండ్రులకు ఉత్తర్వు కాపీ అందజేస్తున్న కలెక్టర్‌ కర్ణన్‌

కరీంనగర్‌: ఎనిమిదేళ్లుగా కరీంనగర్‌ బాలసదనంలో ఉంటున్న చిన్నారి తమిళనాడుకు దత్తతకు వెళ్లింది. తమిళనాడుకు చెందిన పిల్లలు లేని దంపతులు దత్తత కోసం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆన్‌లైన్‌ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దేశమంతా ఒకే పోర్టల్‌ ద్వారా దేశంలోని అన్ని బాలసదనాలలో ఉంటున్న పిల్లలను ఎక్కడి నుంచైనా, ఎక్కడికైనా దత్తత ఇచ్చే అవకాశం ఉండడంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆ దంపతుల కల నెరవేరింది. అన్ని ధ్రువీకరణ పత్రాలు పరిశీలించిన తర్వాత అధికారులు కరీంనగర్‌ బాలసదనంలో ఉంటున్న అనాథ చిన్నారిని (13 సంవత్సరాలు) దత్తత ఇచ్చారు. సోమవారం కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌ ఆధ్వర్యంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు బాలికను దత్తత తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ప్రియాంక, జిల్లా సంక్షేమ అధికారి సబిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్‌ ధనలక్ష్మి, డీసీపీవో శాంత పాల్గొన్నారు.

నిధులు జమ చేయాలని వైఎస్సార్‌టీపీ ధర్నా



కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కొత్తపల్లి(కరీంనగర్‌): గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.7,700 కోట్ల నిధులను వెంటనే గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్‌ చేస్తూ సోమవారం కలెక్టరేట్‌ ఎదుట వైఎస్సార్‌టీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.నగేశ్‌, జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్‌ మాట్లాడుతూ, కేసీఆర్‌ పాలనలో గ్రామీణ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక సర్పంచులు అప్పులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో బిల్లులు రాక అప్పుల బాధతో ఇప్పటి వరకు 11 మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సర్కారు వైఖరిని వ్యతిరేకిస్తూ ఆదిలాబాద్‌లోని వాంకిడి మండలంలో 18మంది సర్పంచులు అధికార బీఆర్‌ఎస్‌ పార్టీకి రాజీనామా చేయడం చూస్తుంటే గ్రామాలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి తెలుస్తోందని దుయ్యబట్టారు. తెలంగాణలో దోపిడీ, దుర్మార్గమైన పాలన సాగుతోందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులకు రావల్సిన రూ.35,000 కోట్లకు పైగా పెండింగ్‌ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్‌ చేశారు. ధర్నాలో నాయకులు డాక్టర్‌ శివరామ్‌, సాన రాజన్న, సలీమ్‌, జావీద్‌, రవీందర్‌రెడ్డి, నర్సయ్య, రజితారెడ్డి, దీనా దేశాయ్‌, సుజాత, కవిత, సునీల్‌, హరికిషన్‌, శ్రీనివాస్‌, సంపత్‌, ఎంఏ బేగ్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- తన చావుకు ముగ్గురు కారణమంటూ సూసైడ్‌ నోట్‌



రాజు (ఫైల్‌)

హుజూరాబాద్‌: హుజూరాబాద్‌ పట్టణం సాయిబాబా గుడి సమీపంలో అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్న జంగిలి రాజు (30) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటనకు సంబంధించి కాలనీవాసులు, పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికే చెందిన జంగిలి రాజు స్థానిక సాయిబాబా గుడి సమీపంలో అద్దె ఇంట్లో ఉంటూ స్థానిక ఓ వైన్‌షాపులో కూలీగా పనిచేస్తున్నాడు. కరోనా సమయంలో అతడి తల్లి మృతిచెందింది. అప్పటినుంచి ఒంటరిగానే ఉంటున్నాడు. రాజు ఉండే ఇంటి పరిసరాల నుంచి సోమవారం దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఇంటి తలుపులు తెరిచి చూడగా రాజు కుళ్లిపోయిన స్థితిలో శవమై కనిపించాడు. ఆయన చుట్టూ రక్తం ఉండడం.. శరీరం నుంచి ద్రవాలు వెలువడడంతో ముఖమంతా ఏర్పడకుండా మారిపోయింది. అతడి సెల్‌ఫోన్‌ సైతం స్విచ్‌ ఆఫ్‌ అయి ఉంది. బంధువులకు సమాచారం అందించగా.. వారం నుంచి అతడి సెల్‌ స్విచ్‌ ఆఫ్‌ అని వస్తోందని తెలిపారు. అయితే రాజు ఆత్మహత్యకు పాల్పడ్డాడా..? మరేదైనా కారణమా..? అనే విషయం విచారణ చేసిన తర్వాతే తెలిసే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. గది లోపలి నుంచి తలుపులకు తాళం వేసి ఉండడంతో మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకున్నాడా..? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సూసైడ్‌ నోట్‌లో ముగ్గురి పేర్లు..

రాజు మృతదేహం వద్ద సూసైడ్‌ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో తన చావుకు చిన్నమ్మ అనసూర్య, శ్రీధర్‌, శివ కారణమని రాసి ఉంది. తన అమ్మ చనిపోయిన తర్వాత అక్క, బావ చేరదీశారని, అయితే పై ముగ్గురితో మానసికంగా ఇబ్బందిపడ్డానని, అనసూర్య, ఆమె కొడుకులు తనను కొడుతున్నారని, వారివల్లనే జీవితంపై విరక్తి కలిగిందని, అందుకే ఇంజక్షన్‌ తీసుకుంటున్నానని రాసి ఉంది. తన చావుకు కారణమైన వారిపై చర్య తీసుకోవాలని కూడా ఆ ఉత్తరంలో కోరాడు.

ఉమక్క, రమేశ్‌బావ క్షమించండి..

'ఉమక్క నన్ను క్షమించు' అంటూ రాజు రాసిన లేఖ కంటతడి పెట్టించింది. 'ఉమక్క భయం వేస్తుంది. నాకు చావాలని లేదు. నన్ను జంగిలి అనసూర్య, శివ, శ్రీధర్‌ తిడుతూ కొడుతున్నారు. వాళ్ల వల్లే చనిపోతున్నా. ఇంజక్షన్‌ వేసుకున్నాక ఎలా ఉంటుందో నాకు తెల్వది. ఆ ఇంజక్షన్‌ వేసుకున్న తర్వాత చస్తే నా బాడీ కుళ్లిపోయి వాసన వచ్చేవరకు ఎవరూ రారేమో. బహుశా మీరు కూడా చూసే అవకాశం ఉండదేమో. ఎందుకంటే అంతగా నా బాడీ కుళ్లి పోయి ఉంటుంది. కనుక నన్ను క్షమించండి' అంటూ లేఖలో పేర్కొన్నాడు. లేఖలోని విషయాలపైనా పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నట్లు సమాచారం.

రాయితీ రుణం.. మైనార్టీ యువతకు వరం

- ఈనెల 5 వరకు దరఖాస్తులకు గడువు

మంజూరైన యూనిట్లు

జిల్లా	కేటగిరీ 1	కేటగిరీ 2	మొత్తం నిధులు (రూ.కోట్లలో)
కరీంనగర్‌	61	26	1.13

కరీంనగర్‌: రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్‌ ద్వారా మైనార్టీ యువతకు రాయితీ రుణాలు అందించడానికి ప్రభుత్వం సన్నద్ధమైంది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అర్హులైన ముస్లింలు, సిక్కులు, పార్శీలు, బౌద్ధులు, జైనుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 1,32,000 మందికిపైగా మైనార్టీలు ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. 2015–16 ఆర్థిక సంవత్సరంలో చివరిసారిగా కార్పొరేషన్‌ రుణాలు అందించారు. తర్వాత ఆరేళ్లుగా రాయితీ రుణాల ప్రస్తావన లేకుండా పోయింది. 2021లో డ్రైవర్‌ ఎంపవర్‌మెంటు పథకం కింద జిల్లాలో కొంత మందిని ఎంపిక చేశారు. తాజాగా రుణాలు అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో అందుకునేందుకు మైనార్టీలు ఉత్సాహం చూపిస్తున్నారు.

కేటగిరీల వివరాలు

గతంలో మైనార్టీలకు కేటగిరీ–1,2,3 కింద రుణాలు మంజూరు చేసేవారు. ప్రస్తుతం కేటగిరీ– 1,2లకు మాత్రమే అవకాశం కల్పించారు. కేటగిరీ–1లో 36 రకాల యూనిట్లు ఉన్నాయి. రూ.లక్ష వరకు రుణం మంజూరు చేస్తారు. 80 శాతం రాయితీ వర్తిస్తుంది. కేటగిరీ–2లో 16 రకాల యూనిట్లు ఉండగా, ఒక్కొక్కరికి రూ.2 లక్షల వరకు అందిస్తారు. 70 శాతం రాయితీ ఉంటుంది.

అర్హులు వీరే..

21–55 ఏళ్ల మధ్య వారు అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు దాటొద్దు. ఆధార్‌, ఆహార భద్రత కార్డులతో జనవరి 5 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అర్హులు వినియోగించుకోవాలి



జిల్లాలో అర్హులైన మైనార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అర్హత పత్రాలతో పాటు ఏర్పాటు చేసుకునే యూనిట్‌, తదితర పత్రాలు సమర్పించాలి. అర్హులు కేటగిరీల వారీగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉంటుంది. దళారులను ఆశ్రయించి మోసపోవద్దు. – మధుసూదన్‌, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి

అర్ధరాత్రి లారీ బీభత్సం

- విద్యుత్‌ స్తంభాలను ఢీకొట్టడంతో గ్రామాల్లో అంధకారం



దారితప్పి వచ్చిన లారీ

కరీంనగర్‌రూరల్‌: ప్రమాదభయంతో ఓ డ్రైవర్‌ నిర్లక్ష్యంతో లారీని అతివేగంగా నడిపి విద్యుత్‌ స్తంభాలను ఢీకొట్టడంతో పలు గ్రామాల్లో విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. రాత్రంతా అంధకారంలోనే ఉన్నాయి. స్థానికుల వివరాలు.. హైదరాబాద్‌ నుంచి సిర్పూర్‌ కాగజ్‌నగర్‌కు కట్టెల లోడ్‌తో వెళ్తున్న లారీ ఆదివారం అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో రాజీవ్‌రహదారిలో అదుపుతప్పి బొమ్మకల్‌ గ్రామంలోకి దూసుకెళ్లింది. ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన అనంతరం డ్రైవర్‌ వేగంగా లారీని ముందుకు తీసుకెళ్లి నాలుగు విద్యుత్‌ స్తంభాలను ఢీకొట్టడంతో విరిగిపడ్డాయి. అదే వేగంతో బొమ్మకల్‌ నుంచి గుంటూరుపల్లి మీదుగా దుర్శేడ్‌, చేగుర్తి గ్రామ శివారులోని రోడ్డులో వెళ్లే అవకాశం లేకపోవడంతో డ్రైవర్‌ అక్కడే నిలిపివేశాడు. బొమ్మకల్‌ నుంచి దుర్శేడ్‌, చేగుర్తి వెళ్లే క్రమంలో విద్యుత్‌వైర్లు, సర్వీస్‌వైర్లు, డిష్‌ వైర్లు తెగిపోయాయి. చేగుర్తిలో నాలుగు విద్యుత్‌స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో బొమ్మకల్‌, దుర్శేడ్‌, నల్లగుంటపల్లి, చేగుర్తి గ్రామాల్లో సరఫరా నిలిచిపోగా, ఆయా గ్రామస్తులు రాత్రంతా చీకట్లోనే ఉన్నారు. అయితే కరీంనగర్‌కు రాకముందు ప్రమాదం చేసిన డ్రైవర్‌ భయంతో లారీని బొమ్మకల్‌ నుంచి తీసుకెళ్లాడని యజమాని తెలిపాడు. లారీ బీభత్సంపై పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

సైనిక్‌ స్కూల్‌ విద్యార్థిని అభినందించిన కలెక్టర్‌



చెక్కు అందజేస్తున్న కలెక్టర్‌ కర్ణన్‌

కరీంనగర్‌: ప్రతిష్టాత్మక మద్రాస్‌ ఐఐటీలో ప్రవేశం పొందిన తెలంగాణ సాంఘిక సంక్షేమ రుక్మాపూర్‌ రెసిడెన్షియల్‌ సైనిక్‌ స్కూల్‌కు చెందిన కెడెట్‌ బనావత్‌ నరేశ్‌ను కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌ అభినందించారు. నరేశ్‌ మద్రాస్‌ ఐఐటీలో ప్రవేశం పొందినందుకు సెక్రెటరీ తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ హైదరాబాద్‌ రూ.50 వేలు నగదు ప్రోత్సాహకం మంజూరు చేయగా, సదరు చెక్కును సోమవారం కలెక్టర్‌ క్యాంప్‌ ఆఫీసులో అందజేశారు. కార్యక్రమంలో సైనిక్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ సీహెచ్‌.లచ్చయ్య, ఏవో జి.శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్‌ ట్రాక్టర్‌ ఢీకొని పశువుల కాపరి మృతి



నర్సయ్య మృతదేహం

తిమ్మాపూర్‌ (మానకొండూర్‌): మండలంలోని మొగిలిపాలెంలో కేజ్‌వీల్స్‌ ట్రాక్టర్‌ ఢీకొని పశువుల కాపరి మర్రి నర్సయ్య(71) మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. సోమవారం పాడె కిష్టయ్య కేజ్‌వీల్స్‌ ట్రాక్టర్‌తో వేగంగా వెళ్తూ రోడ్డు పక్కన గొర్రెలను మేపుతూ నిలబడిన నర్సయ్యను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నర్సయ్యకు తీవ్రగా యాలు కాగా స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు కేశవులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

మానకొండూర్‌: మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన కెక్కెర్ల రమేష్‌ (30) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. కుటుంబ కలహాలతో రమేష్‌ ఆదివారం సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు. ఈఘటనపై కేసు నమోదు కాలేదు.

పాడి పశువుల పునరుత్పత్తిపై ప్రత్యేక శిక్షణ



మాట్లాడుతున్న లింగారెడ్డి

కరీంనగర్‌: పాడి పశువుల పునరుత్పత్తి వ్యవస్థలో నైపుణ్యాల పెంపొందింపు (అప్‌గ్రేడేషన్‌ ఆఫ్‌ గైనకలాజికల్‌ స్కిల్స్‌ ఇన్‌ బొవైన్స్‌) అంశంపై రాష్ట్ర పశువైద్యాధికారులకు పది రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణ కేంద్రంలో సోమవారం అసిస్టెంట్‌ డైరెక్టర్‌ డా.ఎస్‌.లింగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడి రైతుల లాభనష్టాలను ప్రభావితం చేసే అంశాల్లో పాడి పశువుల పునరుత్పత్తి సమస్యలు అత్యంత కీలకమన్నారు. పాడి పశువుల పునరుత్పత్తి సమస్యలపై విస్తారమైన అవగాహన, వాటి పరిష్కారాలకు తగిన సాంకేతిక నైపుణ్యత పశువైద్యాధికారులకు చాలా అవసరమని వివరించారు. రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక శిక్షణ అందించటానికి కరీంనగర్‌ ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణ కేంద్రం, కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందన్నారు. రాష్ట్రంలోని యువ పశు వైద్యాధికారులను జిల్లాలవారీగా గుర్తించి, ఒక్కో బృందంలో 20 మందికి శిక్షణ ఇచ్చేలా ప్రణాళికను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. పదిరోజులపాటు జరిగే ఈ శిక్షణలో సంబంధిత అంశాలపై అవగాహన కల్పించడం, గోశాల, డెయిరీ ఫారాల సందర్శన, క్షేత్ర స్థాయిలో పాడి పశువులు ఎక్కువగా ఉండే గ్రామాల్లో ఉచిత గర్భకోశ నివారణ శిబిరాలు నిర్వహించడం, ఆయా గ్రామాల రైతుల పశువులకు అప్పటికప్పుడే పరీక్షలు నిర్వహించి తగిన మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు హాజరయ్యే వైద్యాధికారులకు పది రోజుల పాటు వసతి, అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు అన్ని సౌకర్యాలు శిక్షణా కేంద్రం ద్వారా కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక బోధన నిపుణులు డా.జీవీకే శర్మ, డా.ఎస్‌పీ రెడ్డి, డా.రాజారెడ్డి, శిక్షణా కేంద్రం అధ్యాపకులు డా.ఎం.కోటేశ్వరరావు, డా.సాయిచైతన్య, డా.దివ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వారాల ఆనంద్‌కు సన్మానం



కరీంనగర్‌కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద రచన ఆకుపచ్చని కవితలుగా అనువదించిన ప్రముఖ కవి, సినీ విమర్శకుడు వారాల ఆనంద్‌కు కేంద్ర సాహిత్య పురస్కారం రావడం ఆనందదాయకమని సాహితీవేత్త, సాహితీగౌతమి అధ్యక్షుడు డాక్టర్ గండ్ర లక్ష్మణరావు అన్నారు. మంగళవారం వారాల ఆనంద్‌ను కలిసి సన్మానించారు. వారి నిరంతర సాహిత్య కృషికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. సాహితీగౌతమి ప్రధాన కార్యదర్శి నంది శ్రీనివాస్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్ పాల్గొన్నారు.

కరీంనగర్ ఎంపీడీవోగా జగన్మోహన్‌రెడ్డి



జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎంపీవో సీహెచ్. జగన్మోహన్‌రెడ్డిని నియమిస్తూ సోమవారం కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఎంపీడీవోగా పనిచేసిన పవన్‌కుమార్ పదోన్నతిపై జెడ్పీ డిప్యూటీ సీఈవోగా బదిలీ కాగా కార్యాలయ సూపరింటెండెంట్ సంపత్‌కుమార్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతలు అప్పగించారు. దాదాపు 13 నెలలపాటు ఇన్‌చార్జి ఎంపీడీవోగా సంపత్‌కుమార్ పనిచేయగా సోమవారం ఎంపీవో జగన్మోహన్‌రెడ్డికి ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. వెంటనే సంపత్‌కుమార్ నుంచి ఎంపీడీవోగా జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాలని పేర్కొన్నారు.

కరీంనగర్-1 డిపో మేనేజర్‌గా ప్రణీత్



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రణీత్

కరీంనగర్: కరీంనగర్-1వ డిపో మేనేజర్‌గా ఎస్.ప్రణీత్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కరీంనగర్-1 డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎస్.భూపతిరెడ్డి బదిలీపై కరీంనగర్ జోనల్ వర్క్‌షాప్ స్టోర్స్ ఆఫీసర్ (రిసిప్ట్)గా వెళ్లారు. పదవీ బాధ్యతల స్వీకరణ అనంతరం కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఖుస్రో షా ఖాన్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్.చందర్‌రావు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) వి. శివశంకర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఏకాగ్రతతో చదివితే విజయం తథ్యం

విద్యానగర్(కరీంనగర్): విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే పరీక్షల్లో ఉత్తమ మార్కులతో విజయం సాధిస్తారని ప్రముఖ మనస్తత్వ నిపుణులు ఎం. శ్రీనివాస్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు జీవితం, వృత్తి, విద్య అంశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జీవితంలో సాధించాలనే పట్టుదల ఉంటే విజయం వరిస్తుందన్నారు. విద్యలో రాణించాలంటే ఏకగ్రతతో చదవాలని, అలా చదివినప్పుడే పరీక్షల్లో మంచి మార్కులతలో ఉత్తీర్ణత సాధిస్తారని తెలిపారు. విద్యార్థికి ముఖ్యంగా అడగడం, వినడం, అనుసరించడం అనేది ముఖ్యంగా ఉండాల్సిన లక్షణమన్నారు. కాలం విలువైనదని దానిని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ లీనా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో రక్తపింజర సంచారం



సంచరించిన ప్రాంతంలో పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు, అటవీ అధికారి నర్సింగరావు

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలోని బొంబాయి వీరయ్య వీధిలో జనావాసాల మధ్య రక్తపింజర సంచారం కలకలం రేపుతోంది. మూడు రోజులుగా వీధిలో తిరుగుతుండగా గమనించిన స్థానికులు సోమవారం మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు దృష్టికి తీసుకెళ్లారు. తొలుత కొండ చిలువగా భావించినప్పటికీ అటవీ శాఖ అధికారి నర్సింగరావు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా రక్త పింజరగా నిర్ధారించారు. ఈ రక్త పింజర రాత్రి వేళల్లో సంచరిస్తోందని, ఇంటి మూలల వద్ద నిప్పు పెట్టుకొని ఉండాలని స్థానికులకు సూచించారు. మళ్లీ వీధిలో కనిపిస్తే పాముల పట్టే వారికి సమాచారం ఇవ్వాలని సలహా ఇచ్చారు. స్థానికులు భయాందోళనలకు గురికాకుండా తనకు సమాచారం ఇవ్వాలని చైర్మన్ రాజు అభయమిచ్చారు.



మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో పూజలు



భజనలో పాల్గొన్న భక్తులు



మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరాలయంలో దర్శనం చేసుకున్న పొన్నం ప్రభాకర్

ఆలయాల్లో 'ముక్కోటి' పూజలు

కరీంనగర్‌కల్చరల్/కొత్తపల్లి/కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌తోపాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లోని పలు ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. భక్తులు ఉదయత్ పూర్వ నుంచే ఆలయాలకు చేరుకొని ఉత్తర ద్వార దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా అర్చకులు విభిన్న రూపాల్లో ప్రత్యేక అకరణ చేశారు. మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో రాముని రూపంలో, భగత్‌నగర్‌లోని వేంకటేశ్వరాలయంలో స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సప్తగిరికాలనీ కోదండ రామాలయంలో రామునికి గోవర్ధనగిరిని ఎత్తిన కృష్ణుని అలంకరణ చేశారు. వావిలాలపల్లి రామాలయం, కమాన్‌రోడ్ రామేశ్వరాలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి, రాంనగర్ రమాసత్యనారాయణస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారం గుండా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, కార్పొరేటర్లు బుచ్చిరెడ్డి, దిండిగాల మహేశ్ తదితరులు దర్శించుకొని పూజలు చేశారు.



కొత్తపల్లి శివాలయంలో పూజలు చేస్తున్న చైర్మన్ రుద్ర రాజు, భక్తులు

కొత్తపల్లిలో..

కొత్తపల్లిలోని శివాలయంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కౌన్సిలర్లు వాసాల రమేశ్‌లతో పాటు వేముల చంద్రశేఖర్, గున్నాల రమేశ్, కనకారెడ్డి, సత్యనారాయణగౌడ్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. బద్దిపల్లిలోని స్వయంభూ శ్రీఅలువేలు మంగా, లక్ష్మీ సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు తిరుపతి, భక్తులు పూజలు చేశారు. మండలంలోని రామాలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు ఆంజనేయస్వామి, శివాలయాలు, సాయిబాబా ఆలయాల్లో ఏకాదశి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చెర్లభూత్కూర్‌లో ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు

కరీంనగర్ మండలంలో..

కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో అర్చకులు సుధాకరాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ఫలపంచామృతాభిషేకం చేశారు. సర్పంచ్ రమణరెడ్డి, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు. జూబ్లీనగర్ కోదండరామాలయం, ఎలాబోతారంలో మురళీకృష్ణ ఆలయాల్లో ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

అభిషేకాలు.. అర్చనలు



కలశాలతో వస్తున్న అయ్యప్ప దీక్షాపరులు

కరీంనగర్‌కల్చరల్: భగతనగర్ జెడ్పీ క్వార్టర్ ఆవరణలోని అయ్యప్ప ఆలయంలో సోమవారం 108 మంది కన్నె స్వాములు 108 కలశాలతో అయ్యప్ప స్వామికి ఫలరసపంచామృతాభిషేకం, అర్చనలు చేశారు. పేట తుళ్లి ఆటలు, భజనలతో భక్తి పారవశ్యంలో మునిగితేలారు. కలశాలను కన్నె స్వాములకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి సత్యనారాయణ. ఎస్.సుధాకర్ జువ్వాడి రంగారావు, పల్లె మురళీ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు కొనసాగుతున్నందున మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ శివనగర్ ఫీడర్ పరిధిలోని శివనగర్, ప్రగతినగర్, మార్కెండేయనగర్, రాజీవ్ పార్కు, హస్నాపూర్‌కాలనీ, సప్తగిరి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.









మూణ్నాళ్ల ముచ్చట

స్మార్ట్‌సిటీలో భాగంగా నగరంలో అట్టహాసంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. నగరంలోని ఎస్సారార్ కళాశాల ప్రాంగణం, బ్యాంక్ కాలనీలోని పార్క్, పలు డివిజన్‌లలోని ఓపెన్ జిమ్‌లలో పరికరాలు విరిగిపోయాయి. పాలకవర్గం, అధికారులు వాటి మరమ్మతులు పట్టించుకోవడంలేదు. వ్యాయామం చేద్దామని జిమ్‌ల వద్దకు వచ్చినవారు సౌకర్యాలు లేక తిరిగి నిరాశతో వెళ్లిపోతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ప్రజల వద్దకే పాలకవర్గం

- మేయర్ సునీల్‌రావు



డివిజన్‌లో పర్యటిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ సిటీ: ప్రజల వద్దకే పాలకవర్గం కార్యక్రమం ద్వారా నగరంలోని ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని మేయర్ సునీల్‌రావు అన్నారు. నూతన సంవత్సరంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మేయర్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం 33వ డివిజన్ భగత్‌నగర్‌లో ప్రజల వద్దకే మా పాలకవర్గ పరిపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పారిశుధ్య, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో డివిజన్‌లోని పెద్ద దేవాలయం, పేద ప్రజలు నివసించే వీధుల్లో పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ వృద్ధులు, మహిళలు, యువతీ, యువకులను కలిసి సమస్యలు, అందుతున్న ప్రజా సంక్షేమాలను తెలుసుకోవడంతో పాటు వీధుల్లో మొక్కలు నాటి డివిజన్ ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా 33వ డివిజన్ ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో ముఖాముఖి కార్యక్రమంతో మీ ముందుకు వచ్చామని తెలిపారు. రోడ్లు, డ్రెయినేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు, మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రజల నుంచి వచ్చిన సమాధానాలపై తనకు ఆనందం వేసిందని తెలిపారు. ప్రతీనెలలో ఒకరోజు మా డివిజన్ ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ త్రియంభకేశ్వర్, ఈఈ మహేందర్, డీఈ మసూద్ అలీ, ఆర్వో ఆంజనేయులు, పారిశుధ్య సూపర్‌వైజర్ రాజమనోహర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



సంబరాల్లో విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: కరీంనగర్‌లోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్‌లో ముందస్తు మకర సంక్రాంతి సంబరాలను సోమవారం నిర్వహించారు. ×అల్ఫోర్స్ మకర సంక్రాంతి సంబరాలు₹ పేరిట నిర్వహించిన ఈ ఉత్సవాలను తొలుత గౌరీమాత విగ్రహానికి పూలమాల వేసిన ఆ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థిని, విద్యార్థులు రంగు రంగుల దుస్తుల్లో విచ్చేసి పల్లెటూరి వాతావరణాన్ని తలపించేలా చేసిన విన్యాసాలు అలరించాయి. పొలం, పిండి వంటల తయారీ, బోగి మంటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. రైతుల శ్రేయస్సును సూచించే సంక్రాంతి పండగ సకల సాంప్రదాయాలకు నిలయంగా నిలుస్తుందని నరేందర్‌రెడ్డి అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నూతన' వేడుకలు



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సంపత్‌కుమార్ నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి ఉద్యోగులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఏపీవో శోభరాణి, మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ తోపాటు పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిల అరెస్టుకు నిరసనగా సోమవారం నగరంలోని తెలంగాణచౌక్‌లో కాంగ్రెస్ పార్టీ నగర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ఇచ్చిన రూ.35వేల కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దొంగ చాటుగా వేరే అకౌంట్లకు బదిలీ చేసి గ్రామపంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా మార్చిందన్నారు. ఏడు నెలలుగా గ్రామపంచాయతీల మౌలిక సదుపాయాల కోసం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా చెల్లించాల్సిన రూ.250 కోట్లను చెల్లించలేదని అన్నారు. ఇందుకు నిరసనగా సోమవారం ఇందిరాపార్క్ వద్ద పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిల తోపాటు పార్టీ ముఖ్య నాయకులు చేపట్టిన ధర్నాను భగ్నం చేయడానికి రేవంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డిలను హౌస్ అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమద్ నవాబ్, శ్రవణ్‌నాయక్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, లింగంపల్లి బాబు, కుర్ర పోచయ్య, జీడీ రమేశ్, దండి రవీందర్, దన్న సింగ్, ఎండీ చాంద్, ఖమ్రొద్దీన్, పొరండ్ల రమేశ్, షబానా, ముక్క భాస్కర్, కీర్తి కుమార్, కాంతయ్య, ఆమెర్, షేక్ షేహెన్షా, జాఫర్, అష్రాఫ్, సోహెల్, అనీఫ్, నాగరాజు, కమల్, అజ్మత్, సీరాజ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నాందేడ్ గురుద్వార్‌ను సందర్శించిన రవీందర్‌సింగ్



రవీందర్‌సింగ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్‌కల్చరల్: మహారాష్ట్ర నాందేడ్ గురుద్వార్‌ను సోమవారం రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ సందర్శించి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్‌ను నాందేడ్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సన్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, దండబోయిన రాము, కొత్తకొండ శ్రావణ్, మహారాష్ట్ర బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మానిక్‌రావు కదం, బాబురావు పాటిల్, రాజు పాటిల్, మహమ్మద్ అజారుద్దిన్ పాల్గొన్నారు.

'కృష్ణారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'



మాట్లాడుతున్న జాడి బాల్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: 30 ఏళ్లుగా నమ్మిన బీజేపీ పార్టీ సిద్ధాంతం కోసం అంకిత భావంతో ఎలాంటి రాజకీయ కాంక్షలు లేకుండా పనిచేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు మతిలేకుండా అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం రేకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కృష్ణారెడ్డి గురించి బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కృష్ణారెడ్డికి ఏ హోదా, అర్హత ఉందని గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ విధంగా కలిశారో సర్దార్ రవీందర్‌సింగ్‌నే అడిగి తెలుసుకుంటే మంచిదని తెలిపారు. పార్టీని వ్యతిరేకించి బయటికి వచ్చి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి స్వార్థ రాజకీయాల కోసం, స్వలాభాల కోసం మళ్లీ బీఆర్‌ఎస్‌లో చేరిన రవీందర్‌సింగ్‌కు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) బీఎల్ సంతోష్ గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. ఈ సమావేశంలో ఎడమ సత్యనారాయణరెడ్డి, కాల్వ పూర్ణచందర్‌రెడ్డి, ఎర్రోళ్ల ప్రశాంత్, నాగుల వెంకటేష్‌గౌడ్, గోదారి నరేశ్, రావుల భాస్కరాచారి, గొల్లె బాలకృష్ణ, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రం అందజేస్తున్న ఎంపీ సంజయ్

కరీంనగర్‌టౌన్: బీజేపీ నగర పశ్చిమ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా వంగల రవిగోపాల్‌ను నియమిస్తూ బీజేపీ పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేతుల మీదుగా రవిగోపాల్ నియామక ఉత్తర్వులు అందుకున్నారు. నాయకులు ఎన్నం ప్రకాశ్, మంథని కిరణ్, ధర్మారం వెంకటస్వామి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు లూయిస్ బ్రెయిలీ జయంతి

కరీంనగర్: లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా బుధవారం ఉదయం 9 గంటలకు శాతవాహన యూనివర్సిటీ చౌరస్తా వద్ద ఉన్న లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి సబితాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ ఫెడరేషన్ ఫర్ బ్లైండ్, వృద్ధులు, వికలాంగుల శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖలు, విభాగాల సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు(అంధులు మాత్రమే) హాజరు కావాలని కోరారు. కార్యక్రమానికి హాజరయ్యే అంధ ఉద్యోగులకు ఓడీ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు.

న్యూఇయర్ విషెష్



కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండాటి వెంటయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కలిసి బొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. - కరీంనగర్



కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్‌కు సోమవారం గ్రంథాలయ సిబ్బంది బొకే ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రెటరీ సరిత, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌కల్చరల్

అటెన్షన్ ప్లీజ్



ఇలా అయితే.. మురుగు పారేదెలా..?

కరీంనగర్‌లోని రూరల్ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో రోడ్డు పక్కన ఉన్న డ్రెయినేజీలో చెత్తా చెదారం, బిల్డింగ్ మెటీరియల్ నిండింది. డ్రెయినేజీ నీరు వెళ్లకపోవడంతో దుర్వాసన వస్తోంది. డ్రెయినేజీని శుభ్రపర్చి మురుగునీరు పారేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : ఇస్లావత్ సేవా, మున్సిపల్ కమిషనర్, కరీంనగర్
సెల్ నంబర్ : 98499 05876

నిలువెత్తు నయవంచన

- భారీ కానుక ఇస్తామంటూ టోకెన్లు పంచి మరీ జనాన్ని రప్పించిన బాబు
- 4 గంటలకు పైగా వేచి చూసేలా చేసి.. తరవాత ఇస్తామంటూ మోసం

- దాంతో ఆందోళన చెంది... తోసుకుంటూ ప్రాణాలు కోల్పోయిన నిరుపేదలు
- సభకు అనుమతి కోరింది టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్

సాక్షి ప్రతినిధి, గుంటూరు:

కానుకలంటూ ఆశ పెట్టి రప్పించిన
అక్క చెల్లెమ్మల్లకు వెన్నుపోటు పొడిచారు!
రూ.300 నాసిరకం వస్తువులను
రూ.వేల విలువైనవంటూ ఊరించారు!!
చివరకు అవి కూడా ఇవ్వకుండా
ఐదు గంటల పాటు నిర్బంధించారు!!
ఆ మోసాన్ని భరించలేక కుప్పకూలిన
మహిళల చావుకు చంద్రబాబు కారకుడయ్యారు!

ప్రచార వ్యామోహం.. పేదల ప్రాణాలంటే లెక్కలేనితనం.. నిలువెత్తు నిర్లక్ష్యానికి మూడు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. గుంటూరులో ఆదివారం టీడీపీ నిర్వహించిన చంద్రన్న కానుకల పంపిణీ కార్యక్రమం ఆద్యంతం ఆ పార్టీ కనుసన్నల్లోనే జరిగింది. సభ నిర్వహణకు పోలీస్‌శాఖకు దరఖాస్తు చేసుకోవటం నుంచి సంబంధిత చలాన్ల చెల్లింపు వరకు ఏర్పాట్లన్నీ టీడీపీ నేతలే స్వయంగా పర్యవేక్షించారు. ఉయ్యూరు ఫౌండేషన్ పేరుతో తెరచాటున వ్యవహారాలు నడిపించారు. చంద్రన్న కానుక పంపిణీలో పాల్గొనాలంటూ పది రోజులు ముందు నుంచే పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. నిత్యం సభా ప్రాంగణాన్ని సందర్శిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ పిలుపునిచ్చారు. రెండు రోజుల ముందు ఇంటింటికి తిరిగి మహిళలకు కూపన్లు ఇవ్వడంతో పాటు ఆధార్ జిరాక్స్‌లు తీసుకున్నారు. రూ.మూడు వేల విలువైన కానుకలు అందచేస్తున్నామంటూ ఊరించారు. చివరకు తొక్కిసలాటలో ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయిన మరుక్షణమే అది ఓ ప్రైవేట్ కార్యక్రమమని, స్వచ్ఛంద సంస్థను ప్రోత్సహించేందుకు వెళ్లానని, తమ పార్టీకి దాంతో సంబంధం లేదంటూ స్వరం మార్చి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తన నిజ స్వరూపాన్ని మరోసారి చాటుకున్నారు. తాను స్వయంగా పాల్గొన్న కార్యక్రమంలో ముగ్గురు పేద మహిళలు మృత్యువాత పడితే కనీసం పరామర్శించేందుకు కూడా ఆయనకు మనసు రాలేదు. కందుకూరులో బాధితుల వద్దకు వెంటనే వెళ్లిన ఆయన గుంటూరులో మాత్రం చనిపోయింది పేద మహిళలు కావడంతోనే మొహం చాటేసి హైదరాబాద్ వెళ్లిపోయినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఘటన అనంతరం రాత్రి నుంచి పరారీలో ఉన్న ఉయ్యూరు ఫౌండేషన్ ఎండీ శ్రీనివాస్‌ను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


అనుమతి కోరుతూ ఇచ్చిన దరఖాస్తు

దరఖాస్తులో కానరాని "కానుకలు"

గుంటూరు ఓల్డ్ వికాస్ క్యాంపస్‌లో మాజీ సీఎం చంద్రబాబు పాల్గొన్న సభకు అనుమతుల కోసం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ స్వయంగా గుంటూరు సౌత్ డీఎస్పీకి దరఖాస్తు చేసుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ పది వేల మందితో సభ నిర్వహించుకుంటామని అందులో పేర్కొన్నారు. అయితే అందులో ఎక్కడా చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొనలేదు. అది కేవలం చారిటబుల్ ట్రస్ట్ కార్యక్రమం అయితే అన్నగారి జనతా వస్త్రాలు – చంద్రన్న సంక్రాంతి కానుక అని ఎందుకు పేరు పెట్టారు? సభ నిర్వహణ అనుమతుల కోసం టీడీపీ తరపున పోలీస్ శాఖకు ఎలా దరఖాస్తు చేశారు? పార్టీ కార్యక్రమంగా ఎందుకు మార్చారు? స్వచ్ఛంద సంస్థ కార్యక్రమానికి టీడీపీ నాయకులు జన సమీకరణ ఎందుకు చేశారని బాధితులు నిలదీస్తున్నారు. రాజకీయ పార్టీకి కొమ్ము కాసే ట్రస్టుల గుర్తింపును రద్దు చేయడంతోపాటు నిధుల సేకరణపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

పోలీసుల సూచనలు బేఖాతర్..

ఇది పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమం కావడంతో అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు. క్యాంపస్‌కు ఎంట్రన్స్, ఎగ్జిట్ ఒకే గేటు ఉండటంతో మూడు చోట్ల ప్రహరీ పగలగొట్టించి ద్వారాలు ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు బారికేడ్లు ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తారు. వ్యక్తిగత కార్యక్రమానికి నిర్వాహకులే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలి. పోలీసులు వాటిని పరిశీలించి పలు సూచనలు చేసినా నిర్వాహకులు పట్టించుకోలేదు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నగరంలోని వివిధ ప్రాంతాల మహిళలను కానుకలు పంపిణీ చేస్తామంటూ వాహనాల్లో మీటింగ్ ప్రదేశానికి తరలించారు. రాగానే వాటిని అందచేస్తే తొక్కిసలాటకు అవకాశం ఉండేది కాదు. కానుకలు ఇస్తే మహిళలు వెళ్లిపోతారనే భయంతో చంద్రబాబు సభ ముగిసేవరకు సాయంత్రం ఆరు గంటల దాకా బలవంతంగా కూర్చోబెట్టారు. చంద్రబాబు సభ జరుగుతున్న సమయంలో పరిస్థితిని గమనించిన పోలీసులు వెంటనే కిట్‌ల పంపిణీ ప్రారంభించాలని వేదికపై ఉన్న నాయకులను ఫోన్‌లో కోరారు. ఓ ట్రాఫిక్ సీఐ వేదికమీదకు వెళ్లి మరీ పరిస్థితిని వివరించినా ఆలకించలేదు. బారికేడ్లు సరిగా లేకపోవడంతో తొక్కిసలాటలో ఒరిగిపోయాయి. పోలీసులు సకాలంలో స్పందించి కానుకల పంపిణీని నిలిపివేసి తొక్కిసలాటలో చిక్కుకున్నవారిని కాపాడటంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. లేదంటే పదుల సంఖ్యలో మరణాలు ఉండేవని బాధితులు చెబుతున్నారు.

237 మందితో బందోబస్తు..

నూతన సంవత్సర వేడుకలతోపాటు మంగళగిరి, తెనాలిలో వైకుంఠద్వార దర్శనం బందోబస్తుకి పెద్ద సంఖ్యలో పోలీసులను సమకూర్చాల్సి వచ్చినా చంద్రబాబు సభకు ముగ్గురు డీఎస్పీల నేతృత్వంలో 207 మంది సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో పరిస్థితి గమనించి మరో 30 మంది సిబ్బందిని అదనంగా రప్పించారు. వీరంతా ఉండబట్టే పరిస్థితి వెంటనే అదుపులోకి వచ్చింది. ముందు జాగ్రత్తగా పోలీసులు రెండు అంబులెన్స్‌లను కూడా సిద్ధం చేశారు. ప్రైవేట్ కార్యక్రమం అయినప్పటికీ బాధ్యతగా వ్యవహరించారు. ప్రైవేట్ కార్యక్రమాల్లో బందోబస్తు కోసం పోలీస్‌శాఖకు యూజర్ చార్జీలను చెల్లించాలి. టీడీపీ నాయకులు ఆ పని చేయకపోగా పోలీసులపైనే ఆరోపణలు చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కనీస పశ్చాత్తాపం కరువు

చంద్రబాబు అరగంటకు పైగా మాట్లాడి నలుగురికి చంద్రన్న కానుక కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన వెళ్లిపోయిన నిమిషాల వ్యవధిలోనే తొక్కిసలాట చోటుచేసుకుంది. ఆ సమయానికి చంద్రబాబు కాన్వాయ్ మంగళగిరి కూడా చేరుకోలేదు. కొందరు నేతలు ఈ విషాదం గురించి ఆయనకు సమాచారం ఇవ్వడంతో మీరే చూసుకోవాలని స్పష్టం చేసి విమానాశ్రయానికి వెళ్లిపోయినట్లు తెలిసింది. రాత్రి 7.02కి గన్నవరం విమానాశ్రయం చేరుకున్న ఆయన 7.59 నిముషాలకు ఇండిగో విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. తాను పాల్గొన్న కార్యక్రమంలో ముగ్గురు మహిళలు చనిపోవడంతోపాటు పలువురు తీవ్రంగా గాయపడ్డారనే విషయం తెలిసి కూడా కనీస మానవత్వం, పశ్చాత్తాపం లేకుండా చంద్రబాబు వెళ్లిపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. బాధిత కుటుంబాలను జీజీహెచ్‌లో స్థానిక నేతలు మినహా అధినాయకత్వం పరామర్శించిన పాపాన పోలేదు.

పోలీసుల అదుపులో నిందితుడు

గుంటూరు ఘటనలో తల్లిని కోల్పోయిన ఏటీ అగ్రహారం 4వ లైనుకు చెందిన గోపిదేశి నాగరాజు ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు ఉయ్యూరు ఫౌండేషన్ ఎండీ శ్రీనివాసరావుపై 304 క్లాజ్ 2, 34 ఐపీసీ, సీఆర్‌పీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఆదివారం రాత్రి నుంచి పరారీలో ఉన్న నిందితుడిని ఫోన్ సిగ్నల్స్, నెట్ సిగ్నల్స్ ఆధారంగా గుర్తించారు. మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టిన సీసీఎస్ పోలీసులు సోమవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

బాబు కీలుబొమ్మ 'ఉయ్యూరు'

తమకు అత్యంత సన్నిహితుడైన ఎన్నారై ఉయ్యూరు శ్రీనివాస్ ద్వారా సంక్రాంతి కానుకల పంపిణీ కార్యక్రమాన్ని చంద్రబాబు, లోకేశ్ నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వాహకుడిగా తెరపైకి తెచ్చిన ఉయ్యూరు శ్రీనివాస్ టీడీపీలో క్రియాశీల నేత. పార్టీ జెండా మోసిన నేతలను పక్కనబెట్టి విదేశాల నుంచి డబ్బు సూట్‌కేసులతో దిగే ఎన్నారైలను ఎన్నికల బరిలోకి దించాలని భావిస్తున్న చంద్రబాబు కొంతకాలంగా ఉయ్యూరు శ్రీనివాస్‌ను ప్రోత్సహిస్తున్నారు. గుంటూరు వెస్ట్, పొన్నూరు నియోజకవర్గాల్లో టికెట్ ఆశ చూపిస్తూ ఆయన ద్వారా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే కొత్త సంవత్సరం సందర్భంగా చంద్రబాబుకు మీడియాలో ప్రచారం కల్పించేందుకు గుంటూరులో తాజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సీఎం జగన్‌పై విద్వేషపూరిత పోస్టులు

టీడీపీ తరపున సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే ఉయ్యూరు శ్రీనివాస్.. సీఎం జగన్, మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలపై విద్వేషపూరిత పోస్టులు పెడుతుంటాడు. లోకేశ్ ఆధ్వర్యంలో నడిచే టీడీపీ సోషల్ మీడియా విభాగం సూచనల మేరకు వర్గ విభేదాలు రెచ్చగొట్టేలా, ఘర్షణలను ప్రేరేపించేలా వ్యవహరిస్తుంటాడు.



స్వర్ణరథంపై సర్వాంతర్యామి

తిరుమలలో వైభవంగా వైకుంఠ ఏకాదశి మహోత్సవం

తిరుమల/మంగళగిరి/సింహాచలం/శ్రీశైలం టెంపుల్/నెల్లిమర్ల: ఇల వైకుంఠం తిరుమలలో సోమవారం వైకుంఠ ఏకాదశి మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వర్ణరథంపై సర్వాంతర్యామి అయిన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. గోవింద నామ స్మరణతో సప్తగిరులు పులకించాయి. శ్రీవారికి ప్రాతఃకాల ఆరాధన అనంతరం వైకుంఠ ఏకాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సామాన్య భక్తులకు సైతం గంట ముందుగానే ఆరు గంటలకే సర్వదర్శనం ప్రారంభించారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుమలకు చేరుకున్న అశేష భక్తవాహిని స్వర్ణరథ వాహనసేవను తిలకించి స్వామి, అమ్మవార్లకు కర్పూర నీరాజనాలు సమర్పించారు. మహిళా భక్తులు ఉత్సాహంతో స్వర్ణరథాన్ని లాగారు.

రోడ్లపై సభలు, ర్యాలీలు నిషేధం

ప్రజల భద్రత కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో రహదారులపై బహిరంగ సభలు, ర్యాలీలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. ఇకపై జాతీయ, రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీరాజ్ రహదారులపైన, మార్జిన్లలో సభలు, ర్యాలీలకు అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అత్యంత అరుదైన సందర్భాల్లో జిల్లా ఎస్పీలు లేదా పోలీస్ కమిషనర్లు కచ్చితమైన షరతులతో అనుమతి ఇవ్వొచ్చని మినహాయింపునిచ్చింది. ఈమేరకు హోం శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1861 పోలీస్ చట్టం ప్రకారం హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. రోడ్లపై బహిరంగ సభలు, ర్యాలీలతో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తుండటంతోపాటు, వాటి నిర్వహణలో లోటుపాట్లు, నిర్వాహకుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలను బలిగొంటున్న నేపథ్యంలో 30 పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తూ ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

నిరాహార దీక్ష విరమించిన జోగయ్య

ఏలూరు టౌన్: కాపులకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి హరిరామ జోగయ్య చేపట్టిన నిరాహార దీక్షను సోమవారం విరమించారు. పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి మేరకు దీక్ష విరమిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. కాపులకు రిజర్వేషన్‌పై హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. కాగా పాలకొల్లులో ఆయన స్వగృహంలో ఆదివారం రాత్రి జోగయ్యతో చర్చించిన పోలీసులు దీక్షను విరమింపజేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఏలూరు కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించిన సంగతి తెలిసిందే. కాగా ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఆహారం తీసుకునేందుకు, మందులు వేసుకునేందుకు హరిరామ జోగయ్య నిరాకరించారు.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



ఝురి దేవతకు మొక్కుతున్న భక్తులు


పాదయాత్రగా నర్సాపూర్‌కు బయల్దేరిన మెస్రం వంశీయులు

'మెస్రం' పాదయాత్ర

ఇంద్రవెల్లి: ఈ నెల 21న ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నిర్వహించే నాగోబా మహాపూజకు అవసరమయ్యే గంగాజలం కోసం 143 మంది మెస్రం వంశీయులు చేపట్టిన పాదయాత్ర సోమవారం రెండో రోజుకు చేరింది. వీరంతా ఆదివారం రాత్రి పిట్టబొంగరం వద్ద బస చేయగా, సోమవారం ఉదయం ఆ గ్రామస్తుల ఆధ్వర్యంలో ఝురి(కలశం) దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాదయాత్ర ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చేరుకుంది. రాత్రి పొలిమేరలో బస చేశారు. పాదయాత్ర నేడు గాదిగూడ మండలంలోని లోకరికి చేరుకోనుంది. రోజుకో గ్రామం చొప్పున బస చేసిన అనంతరం ఈ నెల 10న జన్నారం మండలం గోదావరి నది హస్తినమడుగు వద్దకు చేరుకుంటారు. గంగాజలం సేకరణ అనంతరం తిరుగు ప్రయణంలో ఉట్నూర్ మీదుగా ఈ నెల 11న ఇంద్రవెల్లి మండలం దోడంద గ్రామానికి చేరుకుంటారు. 12 నుంచి 16 వరకు అక్కడే విశ్రాంతి తీసుకుంటారు. 17న ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని పూజలు చేస్తారు. అదేరోజు సాయంత్రం కేస్లాపూర్ సమీపంలోని మర్రిచెట్టు(వడమర) వద్దకు చేరి అక్కడే బస చేస్తారు. 18, 19, 20 తేదీలలో సంప్రదాయ, తూమ్(కర్మకాండ) పూజలు చేయనున్నారు. పుష్యమాస అమావాస్య పురస్కరించుకుని ఈ నెల 21న రాత్రి 10:30 గంటలకు వెంట తీసుకువచ్చిన గంగాజలంతో నాగోబాకు అభిషేకించి మహాపూజ అనంతరం జాతర ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశ పెద్దలు కోసేరావ్ కటోడ, కోసేరావ్, ప్రధాన్ పెద్దలు దాదారావ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ అగ్ని ప్రమాదం


పూజ స్టోర్ నుంచి చెలరేగుతున్న మంటలు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హమాలీవాడ రైల్వేగేట్ సమీపంలో ఉత్తూరి రాజయ్య పూజ స్టోర్‌లో సోమవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. జిల్లా ఫైర్ అధికారి అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ మాదిరిగానే యజమాని శ్రీనివాస్ ఆదివారం దుకాణం బంద్ చేసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం తెల్లవారు జామున షార్ట్‌సర్క్యూట్ జరిగి ప్రమాదం సంభవించింది. దుకాణం నుంచి పొగతో కూడిన మంటలు చెలరేగడంతో స్థానికులు ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. జిల్లా కేంద్రంలోని రెండు ఫైరింజన్లు సరిపోకపోవడంతో బెల్లంపల్లి నుంచి మరో ఫైరింజన్‌ను రప్పించారు. మూడింటి సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో రూ.15లక్షల వరకు విలువైన పూజ సామగ్రి కాలిపోయిందని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి మంటలు చుట్టుపక్కల వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. ఫైర్ సిబ్బంది, ఎస్సైలు రాజేందర్, సుగుణాకర్ పాల్గొన్నారు.

కుంటిసాకులతో పోడుపట్టాల పంపిణీలో జాప్యం

- ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వెంకట్రామయ్య


మాట్లాడుతున్న వెంకట్రామయ్య

ఖానాపూర్: పోడు సాగుదారులకు పట్టాలు ఇచ్చేందుకు హడావుడిగా సర్వేలు చేసిన ప్రభుత్వం హక్కు పత్రాల జారీకి కుంటిసాకులు చెబుతూ కాలయాపన చేస్తోందని ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేముపల్లి వెంకట్రామయ్య అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. 2006 నుంచి పోడు సాగుదారులకు హక్కు పత్రాలు రావడం లేదని, తమ సంఘం పోరాటాల ఫలితంగా 2021 డిసెంబర్‌లో హక్కు పత్రాల దరఖాస్తులు ప్రభుత్వం స్వీకరించిందని తెలిపారు. గ్రామ కమిటీలు వేసి 2022 వరకు సర్వేలు చేయకుండా కాలయాపన చేసిందన్నారు. సర్వేలో అనేక లోపాలున్నాయని తెలిపారు. పోడు కమిటీలు ఉన్నచోట సైతం పలువురి భూములను సర్వే చేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. గతంలో సర్వే చేసిన భూములకు పట్టాలు ఇవ్వకుండా ఆపేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం అటవీశాఖ అధికారులతో కుమ్మక్కై శాటిలైట్ సర్వే పేరుతో 2014 తర్వాత పోడు భూములుగా చిత్రీకరించి భూములను స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. శాటిలైట్ సర్వే విధానం అశాస్త్రీయమైందని, సర్వే చేసిన భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సాగునీరు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం..

గోదావరి నది తలాపునే ఉన్నా నిర్మల్ జిల్లాకు సాగునీటి విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఎస్సారెస్పీ నీటి వాటా కేటాయింపుల్లో సరస్వతీ కెనాల్, సదర్మాట్ ఆయకట్టుకు జరిగే నష్టాన్ని వెంటనే ఆపాలన్నారు. ఆయకట్టు రైతులకు కొత్తగా నిర్మించే సదర్మాట్ ప్రాజెక్టు ద్వారా ప్రత్యేక కెనాల్ ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా సభకు హాజరైన జాతీయ, రాష్ట్ర నాయకులకు ఆదివాసీలు గుస్సాడీ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రతినిధి బృందం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ఫారుక్‌కు స్థానిక సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సర్దార్‌సింగ్, ఉపాధ్యక్షులు నర్సయ్య, కేశవ్, సహాయ కార్యదర్శులు లక్ష్మణ్, భోజన్న, నాయకులు గంగన్న, స్వామి, ప్రసాద్, వెంకటనారాయణ, హరిత, రాజేశ్, వెంకటేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సలహాలిస్తూ.. సాగు చేస్తూ..

- భిన్న రకాలు.. విభిన్న ఆలోచనలు
- అన్నదాత ఆదర్శ వ్యవసాయం


క్యాబేజీ వ్యవసాయ క్షేత్రంలో రైతు వెంకటేశ్


ఖర్బూజ సాగు

సారంగాపూర్(జగిత్యాల): ఒకటికాదు.. రెండు కాదు.. భిన్నరకాల పంటలు పండిస్తూ ప్రతినెలా కనీసం రూ.50వేలకు తగ్గకుండా ఆదాయం సాధిస్తున్నాడు పెంబట్ల గ్రామానికి చెందిన ఆదర్శ రైతు బండారి వెంకటేశ్. తానే కాదు.. తోటి రైతులకూ సలహాలు, సూచనలు ఇస్తూ ఆదర్శ సాగువైపు ప్రోత్సహిస్తున్నాడు. ఈసారి 'నా వ్యవసాయం.. నా డైరీ' పేరిట ఓ డైరీ ముద్రించి సాగులో తాను సాధించిన విజయాలు, ఆదర్శ విషయాలు అన్నదాతలతో పంచుకునే ప్రయత్నం చేశాడు.

వ్యవసాయంలో ఆదర్శం..

పెంబట్ల గ్రామానికి చెందిన బండారి వెంకటేశ్ సాగు విధానంలో ఆధునిక పద్ధతులు పాటిస్తూ లాభాలు ఆర్జిస్తున్నాడు. వరి, మొక్కజొన్నే కాకుండా.. భిన్నరకాల కూరగాయలు పండిస్తున్నాడు. సీజన్‌కు అనుగుణంగా హైబ్రిడ్ వంగడాలు సైతం పండిస్తున్నాడు. తనకున్న ఆరు ఎకరాల్లో.. మూడు ఎకరాల్లో వరి, 1.5ఎకరాల్లో పలు రకాల కూరగాయలు సాగు చేస్తున్నాడు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు నిర్వహించే అవగాహన సదస్సులకు హాజరవుతూ వారి సలహాలు, సూచనలు స్వీకరిస్తూనే.. యూట్యూబ్‌లోని సమాచారం క్రోడీకరిస్తూ ముందుకు సాగుతున్నాడు.

పురుగుల మందు లేకుండా..

పురుగు మందులు వినియోగించకుండానే సన్న రకం వరి పండిస్తున్నాడు. స్వీట్‌కార్న్ సాగు చేస్తూ మార్కెట్ ధరకన్న తక్కువ ధరకే విక్రయిస్తున్నాడు.

విభిన్న కూరగాయలు..

తనకున్న సపోట తోటలో అంతర్‌పంటలుగా సీజన్ల వారీగా టమాట, బెండ, బీర, కాకర, క్యారెట్, క్యాలీఫ్లవర్, గోరుచిక్కుడు, అలసంద, పాలకూర, మెంతికూర, పచ్చిమిర్చి, బఠాని, పచ్చకాకరకాయ, తెల్లకాకర పండిస్తున్నాడు. వేసవిలో పుచ్చకాయ సాగుచేస్తున్నాడు. సాగులో మల్చింగ్ విధానం పాటిస్తున్నాడు. ఉద్యానవన శాఖ ద్వారా రాయితీలు పొంది, డ్రిప్ ఏర్పాటు చేసి పంటలు పండిస్తున్నాడు.

ఉదయం నాలుగు గంటలకే..

ఉదయం నాలుగు గంటలకే కూరగాయలతో జగిత్యాల మార్కెట్‌కు చేరుకుంటున్న వెంకటేశ్.. వాటిని అక్కడ విక్రయిస్తున్నాడు. ఒకపంట చేతికి వచ్చేసరికి మరోపంట సిద్ధం చేస్తుంటాడు. రోజూ చేతికి డబ్బు వచ్చేలా పంటలు ఎంచుకుని సీజన్ల వారీగా పండిస్తున్నాడు. పుచ్చకాయలను సారంగాపూర్–జగిత్యాల ప్రధాన రహదారిపై నేరుగా వినియోగదారుడికి విక్రయిస్తున్నాడు. బంతి, చామంతి పూలు పండించడం ఇతడి ప్రత్యేకత.

నా వ్యవసాయం.. నా డైరీ..

2023లో 'నా వ్యవసాయం నా డైరీ' రూపొందించాడు. ఇందుకోసం రూ.200 వరకు ఖర్చు అయింది. లాభాపేక్ష లేకుండా ఇదే ధరకు రైతులకు డైరీ విక్రయించనున్నట్లు వెంకటేశ్ తెలిపాడు. తాను సాగు చేసే పంటలు, పద్ధతులు, విత్తనాల రకం, అధిక దిగుబడి సాధించే విధానాలు ఉంటాయని, మార్కెటింగ్ పద్ధతులు, నాణ్యమైన విత్తనాలు లభించే ప్రాంతాలు, వాటి ఫోన్ నంబర్లు, వ్యవసాయ ఇప్పటికే ఇచ్చిన సలహాలు, సూచనల పాటించిన వారు పొందిన లాభాలు, వారి ద్వారానే డైరీలో వివరించే ప్రయత్నం చేశాడు. ఇందులో ఇంకా అనేక విషయాలు ప్రస్తావించాడు. కాగా, తాను రూపొందించిన డైరీని వచ్చే సంక్రాంతి పండుగ నాడు ఆవిష్కరిస్తానని వెంకటేశ్ తెలిపాడు.

రాజన్న ఆలయ ప్రధాన ద్వారం మూసివేత

వేములవాడ: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీరాజరాజేశ్వర ఆలయంలో సోమవారం వేకువజా మున ఆలయ ప్రధాన గేట్‌ను అధికారులు మూసివేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గేటు బయట నుంచే మొక్కి వెళ్లిపోయారు. ఏటా ముక్కోటి ఏకాదశి సందర్భంగా తూర్పు ద్వారం ముందు వేదికను ఏర్పాటు చేస్తారు. ఆ వేదికపై ముక్కోటి ప్రాశస్త్యం వివరించే కార్యక్రమాన్ని చేపడుతారు. ఈ క్రమంలో భక్తుల రద్దీని అదుపు చేసేందుకు ప్రధాన ద్వారం వద్దనున్న గేటును మూసివేసి ఉంచినట్లు ఆలయ అధికారులు తెలిపారు.


రాజన్న ఆలయం ప్రధాన ద్వారం మూసివేయడంతో బయట నుంచే మొక్కుతున్న భక్తులు

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
మంగళవారం ॥ 3-1-2023

**మోసం చేశాడని చేతుల్లో ముఖం దాచుకుంటే
మోసపోయానని తనను తాను హింసించుకుంటే
పోయిన కాలం తిరిగి రాదు... జీవితం కూడా.
సాంకేతికత మన పురోగతికి సాధనం మాత్రమే.
సాంకేతికత మన జీవితాన్ని నిర్దేశించే ఆయుధం కాదు.
అది ప్రశ్నించి... పరిహసించే పరిస్థితికి లోనుకావద్దు.**



సోషల్‌గా మోసం జాగ్రత్త పడాల్సిందే!

'అబ్బాయిల చేతిలో అమ్మాయిలు మోసపోతున్నారు'... ఈ మాట పందొమ్మిది వందల అరవైలలో ఉండేది, ఎనభైలలోనూ ఉండేది. ఇరవై ఒకటో శతాబ్దంలోనూ వింటున్నాం. 'మోసపోతున్నది అమ్మాయిలేనా అబ్బాయిలు మోసపోవడం లేదా, మోసం చేస్తున్నది అబ్బాయిలేనా మోసం చేస్తున్న అమ్మాయిలు లేరా' అనే కౌంటర్ వాదన కూడా అప్పుడూ ఉంది, ఇప్పుడూ ఉంది... తేడా అంతా మోసపోతున్న తీరులోనే. టెక్నాలజీ విస్తృతంగా అందుబాటులోకి వచ్చింది. సద్వినియోగంతోపాటు దుర్వినియోగమూ ఎక్కువైంది. ఒకరినొకరు అర్థం చేసుకోవడంలో వేగం వచ్చింది, మోసం చేయడం సులువైంది. సోషల్ మీడియా ఇద్దరి జీవితాలను నిర్దేశించే స్థాయికి వెళ్లిందంటే... ఆ తప్పు టెక్నాలజీది కాదు, టెక్నాలజీని ఎలా ఉపయోగించుకోవాలో తెలియని మనిషిదే. అమ్మాయిలు తమకు చట్టపరమైన రక్షణ ఉందా లేదా అనే ఆలోచన లేకుండా తమకు తాముగా జీవితాన్ని అభద్రతవలయంలోకి నెట్టివేసుకుంటున్నారని చెప్పారు సీనియర్ న్యాయవాది పార్వతి.

''మా దగ్గరకు వచ్చే మహిళలనే గమనిస్తే... ఒకప్పుడు ఎక్కువ శాతం భర్త, అత్తింటి వారి నుంచి వేధింపులు, గృహహింస కారణాలతో వచ్చేవారు. ప్రేమ పేరుతో మోసం చేశాడని కూడా వచ్చేవారు. ఇప్పుడు 'కొంతకాలం లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండి, ఇప్పుడు మొహం చాటేశాడనే కేసులు ఎక్కువయ్యాయి. ఇలాంటి కేసుల వివరాల్లోకి వెళ్తే ఆ ఇద్దరి మధ్య పరిచయానికి వేదిక సోషల్ మీడియానే అయి ఉంటోంది. ముఖాముఖి కలవడానికి ముందే ఒకరి గురించి ఒకరు అన్ని విషయాలనూ షేర్ చేసుకుని ఉంటున్నారు. సరిగ్గా ఇక్కడే అమ్మాయిలు గమనించాల్సింది, జాగ్రత్త పడాల్సిందీ. ఎందుకంటే... అబ్బాయిలు మాటల్లో పెట్టి అమ్మాయిల వివరాలన్నీ తెలుసుకుంటున్నారు, తన గురించిన వివరాలను చాలా జాగ్రత్తగా ఇస్తారు. అతడు మొహం చాటేశాక, అతడి గురించి ఈ అమ్మాయిలను ఏ వివరం అడిగినా తెల్లమొహం వేస్తారు. 'అన్ని వివరాలనూ షేర్ చేస్తున్నామని చెప్పారు కదా, అతడి గురించి నువ్వు తెలుసుకున్నదేంటి?' అని అడిగినప్పుడు అమ్మాయిలు చెప్పే వివరాల్లో అతడి అభిరుచులు, ఇష్టమైన క్రీడాకారులు, అతడు చూసిన సినిమాలు, జీవితం పట్ల అతడి ఆకాంక్షలు, చదివిన పుస్తకాలు... ఇలా ఉంటుంది జాబితా. అతడి ఉద్యోగం, చదువు, ఊరు, అమ్మానాన్నలు ఎక్కడ ఉంటారు, అక్కచెల్లెళ్లు, అన్నదమ్ముల వివరాలు... ఏమీ చెప్పలేరు. ఒకవేళ అప్పటికే పెళ్లయిన వాడా అని కూడా తెలుసుకోరు. అతడు ఫోన్ నంబర్ మార్చేస్తే ఇక ఏ రకంగానూ అతడిని ట్రేస్ చేయలేని స్థితిలో ఉంటుంది పరిస్థితి.

అమ్మాయిలు అన్నీ చెప్పేస్తారు!

అమ్మాయిలు మాత్రం తనతోపాటు ఇంట్లో అందరి ఫొటోలు షేర్ చేయడం, ఇంటి అడ్రస్, అమ్మానాన్నల పేర్లు, ఉద్యోగం, బ్యాంకు బాలెన్స్, నగలు... అన్నీ చెప్పేసి ఉంటారు. 'పరిచయమైన వ్యక్తి ఫోన్ చేసి పలకరించేటప్పుడు చాలా సాధారణమైన మాట 'భోజనం చేశావా' అని అడిగితే దానిని తన మీదున్న కన్‌సర్న్ అని మురిసిపోతారు. తనకు సమయానికి అన్నం వండి పెట్టిన అమ్మ, తనకు అన్నీ అమర్చి పెడుతున్న నాన్న ఆ పనులన్నీ తన మీద ప్రేమతోనే చేస్తున్నారనే ఆలోచన రావడం లేదు. అతడి నుంచి 'గుడ్‌నైట్' మెసేజ్ వస్తుంది, దానికి అమ్మాయి నుంచి వెంటనే రిప్లయ్ వస్తే 'ఇంకా నిద్రపోలేదా' అని అడుగుతాడు. ఇవన్నీ చెప్పి... 'నా మీద అంత ప్రేమగా ఉండేవాడు. మా అమ్మానాన్నల కంటే ఎక్కువ ప్రేమ చూపించాడు. అందుకే ఇంటి నుంచి వెళ్లి పోయి ఇద్దరం సహజీవనంలో ఉన్నాం' అని చెబుతారు. అవతలి వ్యక్తి పెళ్లి ప్రస్తావన రానివ్వకుండా జాగ్రత్తపడిన విషయం మోసపోయిన తర్వాత కానీ అమ్మాయిలకు తెలియడం లేదు. ఈలోపు అమ్మాయి బ్యాంకు బాలెన్స్, నగలు ఖర్చయిపోయి ఉంటాయి. శ్రద్ధావాకర్ కేసులో దారుణం జరిగింది కాబట్టి సమాజం దృష్టిలోకి వస్తుంది. కానీ అలాంటి పరిస్థితి రాలేదనే మాటే కానీ మోసపోయి... న్యాయ పోరాటం చేయలేక, ఆవేదనతో మానసికంగా కృంగిపోతున్న వాళ్లు ఎందరో'' అని చెప్పారు లాయర్ పార్వతి.

వంచనకు సాధనం

అబ్బాయిలు కానీ అమ్మాయిలు కానీ ప్రేమ పేరుతో వంచించడానికి సోషల్ మీడియాను సాధనంగా ఉపయోగించుకుంటున్నారు. ఒక వ్యక్తితో ముఖాముఖి మాట్లాడితే ఒకసారికి కాకపోయినా ఐదారు దఫాలు మాట్లాడిన తర్వాతకైనా ముసుగు జారిపోతుంది. ఇక ఫేస్‌బుక్, వాట్సాప్ చాటింగ్‌లో అవతలి వ్యక్తి మనోభావాలను పసిగట్టడం సాధ్యం కానే కాదు. మోసపోతున్నది అమ్మాయిలు మాత్రమే అని కాదు, మోసపోతున్న వాళ్లలో ఎక్కువ శాతం అమ్మాయిలే ఉంటున్నారు. ఒకప్పుడు కలం స్నేహాలు ఎక్కడో ఉన్న ఇద్దరు వ్యక్తులను అనుసంధానం చేసేవి. అవి పరస్పరం అభిప్రాయాలు, అభిరుచులను షేర్ చేసుకోవడానికే పరిమితమయ్యేవి. సోషల్ మీడియా స్నేహాలు జీవితాలను నిర్దేశిస్తున్నాయి, తప్పు దారిలో నడిపిస్తున్నాయంటే... ఆ తప్పు సాంకేతికతది కాదు. మెదడు ఉన్న, విచక్షణ ఉండాల్సిన మనిషిదే.

– వాకా మంజులారెడ్డి

చట్టాలున్నాయి...కానీ!



పెళ్లి చేసుకున్న మహిళకు చట్టపరంగా ఎలాంటి రక్షణ ఉందో, సహజీవనం విషయంలో కూడా అలాంటి రక్షణను కల్పించింది చట్టం. అయితే సహజీవనాన్ని నిరూపించుకోవాలి. చాలా సందర్భాల్లో నిరూపణ కష్టమవుతోంది. ఆ ఇద్దరూ ఒకే కప్పు కింద జీవించారని చుట్టుపక్కల వాళ్లు సాక్ష్యం చెప్పాలి. అలాగే ఆ ఇద్దరూ ఒకే ఇంట్లో ఉన్నట్లు సెల్‌ఫోన్ సిగ్నల్స్ వంటి సాంకేతిక ఆధారాలను చూపించవచ్చు. కానీ న్యాయస్థానం ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్‌ని ప్రధాన సాక్ష్యంగా పరిగణించడం లేదు. సెకండరీ ఎవిడెన్స్‌గా మాత్రమే తీసుకుంటుంది. సహజీవనాన్ని నిరూపించలేని పరిస్థితుల్లో 'క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్, చీటింగ్' కేసులు పెట్టవచ్చు. కానీ అమ్మాయిలు, వారి తల్లిదండ్రులకు, సమాజానికి భయపడి ఈ పని చేయలేకపోతున్నారు. అమ్మాయి తల్లిదండ్రులు కూడా కేసులు పెట్టి జీవితంలో మరింత అల్లకల్లోలంలోకి వెళ్లడానికి ఇష్టపడరు. అమ్మాయిలు జాగ్రత్తగా ఉండడమే చెప్పదగిన సూచన. పుట్టిన రోజుకి ఫ్లవర్ బొకేలు పంపించినంత మాత్రాన అతడిది సంపూర్ణమైన ప్రేమ అనే భ్రమలోకి వెళ్లవద్దు.

- ఈమని పార్వతి, హైకోర్టు న్యాయవాది

స్త్రీ శక్తి



● బీవోపీ-గంగ దళ సభ్యులు

ఉక్కు దళం

**ఇండియా-బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతం...
పచ్చని అడవి... చల్లని నది
ప్రశాంతంగా కనిపిస్తాయి.
అయితే చాప కింద నీరులా సంఘవిద్రోహశక్తులు
వికటాట్టహాసం చేస్తుంటాయి.
తమకు ఎదురు లేదని
కొమ్ములు విసురుతుంటాయి.
సంఘవిద్రోహశక్తుల అక్రమ కార్యకలాపాలపై ఉక్కు
పాదం మోపడానికి 'ఓన్లీ ఉమెన్' దళం
రంగంలోకి దిగింది.**

స్త్రీ సాధికారతకు పట్టం కట్టేలా బీఎస్ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్)లో మరో అడుగు పడింది. తాజాగా ఇండియా-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ మహిళా జవాన్లు విధులు నిర్వహించనున్నారు.

ప్రసిద్ధ సుందర్‌బన్ అడవుల్లో కొంత భాగం మన దేశంలో, కొంత భాగం బంగ్లాదేశ్‌లో విస్తరించి ఉంది. సరిహద్దును ఆనుకొని ఉన్న అడవులు, చిన్న దీవులు, నదులు అనేవి సంఘ విద్రోహశక్తులకు అడ్డాగా మారాయి.

ఈ నేపథ్యంలో నిరంతర పర్యవేక్షణ అవసరం అయింది. దీనికోసం బీఎస్ఎఫ్ సట్లెజ్, నర్మద, కావేరి, సబర్మతి, క్రిష్ణ, గంగ పేర్లతో బీవోపి (బార్డర్ ఔట్ పోస్ట్) లను ఏర్పాటు చేసింది.

'బీవోపి'కి చెందిన 'గంగ' మహిళా జవానులు తొలిసారిగా సరిహద్దు ప్రాంతానికి సంబంధించిన నిఘా విధులలో భాగం అవుతున్నారు.

మనుషుల అక్రమ చొరబాటు, స్మగ్లింగ్ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు దొంగల నుంచి, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుంచి జాలర్లను రక్షించే బాధ్యతలు కూడా 'బీవోపి-గంగ'పై ఉన్నాయి.

స్థానిక పోలీసులు, అటవీశాఖ అధికారులు, స్థానిక ప్రజలను సమన్వయం చేసుకుంటూ అటవీ ప్రాంతాలకు నష్టం జరగకుండా చూడాల్సి ఉంటుంది.



● ధైర్యంగా దూసుకెళ్తూ...

'బీవోపి-గంగ'కు ఉపయోగించే మోటర్ బోట్‌ను కొచ్చిలో తయారు చేశారు. దీనిలో 35 మంది జవాన్‌లకు చోటు ఉంటుంది. అత్యాధునిక రాడార్, కమ్యూనికేషన్ సదుపాయాలు ఉన్నాయి.

'బీవోపీ-గంగ తన సత్తా చాటబోతోంది. పోరాట పటిమ ప్రదర్శించబోతోంది. స్మగ్లింగ్ కార్యకలాపాల్లో కొందరు స్త్రీలు కూడా భాగం అవుతున్నారు. ఇకముందు వారిని అదుపులోకి తీసుకోవడం సులభం అవుతుంది' అంటున్నారు సౌత్ బెంగాల్ ఫ్రంటియర్ బీఎస్ఎఫ్ డిఐజీ అమ్రిష్ ఆర్యా.

ముగ్గులకు ఆహ్వానం

చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com
(మీ ఊరుతోపాటు కాలనీ- వీధి పేరు కూడా రాయండి)





16 చుక్కలు, 8 వరుసలు,
8 వచ్చే వరకు,
సరి చుక్క

సి. తన్మయి
హైదరాబాద్





9 చుక్కలు
9 వరుసలు

కాసర లక్ష్మీ సరోజారెడ్డి
జంగారెడ్డి గూడెం, ప.గో.జిల్లా

సాగుబడి

ఉత్తరాషాఢ కార్తె :
జనవరి 10 వరకు

నీటి వనరులు పరిమితంగా ఉన్న మెట్ట ప్రాంతంలోనూ మంచినీటి చెరువుల్లో ముత్యాల పెంపకంతో మంచి ఆదాయం గడించవచ్చని మహారాష్ట్రలోని మరఠ్వాడా రైతులు నిరూపిస్తున్నారు. ఔరంగాబాద్ పరిసర ప్రాంతాల్లో గత 10-15 ఏళ్లుగా మంచినీటిలో ముత్యాల సాగు పుంజుకుంటున్నది. కరువు ప్రాంతం అయినప్పటికీ భువనేశ్వర్‌లోని కేంద్రీయ మంచినీటి ఆక్వాకల్చర్ పరిశోధనా సంస్థ (సిఫా) శాస్త్రవేత్తల పర్యవేక్షణలో శిక్షణ పొంది ఆధునిక మెలకువలు పాటిస్తూ ముత్యాల సాగు చేస్తుండటం విశేషం. కనీసం 4,500 మంది రైతులు ముత్యాల సాగు చేస్తున్నారని ఔరంగాబాద్‌కు చెందిన ముత్యాల వ్యాపారి అరుణ్ అంబోర్ చెబుతున్నారు. మంచి ఆదాయం వస్తుండటంతో మరఠ్వాడా ప్రాంతంలో ముత్యాల సాగు ఏటేటా విస్తరిస్తోంది.

మరఠ్వాడాలో ముత్యాల మెరుపులు

● మంచినీటి ముత్యాల పెంపకంలో దుమ్ము రేపుతున్న మరఠ్వాడా రైతులు

● తొలి ఏడాదే రూ.14 లక్షల నికరాదాయం పొందిన ఎఫ్.పి.ఓ.





● ఇనుప మెష్‌లో అమర్చిన ఆల్చిప్పలు



● ఆల్చిప్పలో ముత్యం పెరిగేది ఇలా..



● మెష్‌లను ఇలా చెరువు నీటిలోకి పెడతారు

ఎఫ్.పి.ఓ. ద్వారా సమష్టి సేద్యం

రైతు ఉత్పత్తిదారుల సంఘా(ఎఫ్.పి.ఓ.)ల ద్వారా కూడా రైతులు సమష్టిగా ముత్యాల సాగు చేపడుతున్నారు. ఒస్మానాబాద్ జిల్లా షహపూర్ గ్రామానికి చెందిన రైతు సంజయ్ పవార్ మరో 9 మంది రైతులతో కలిసి త్రివేణి పెరల్స్ అండ్ ఫిష్ ఫామ్ పేరిట ఎఫ్.పి.ఓ.ను నెలకొల్పారు. రెండేళ్ల క్రితం కరోనా కష్టాలను సైతం లెక్క చేయకుండా భువనేశ్వర్‌లో సిఫాకు వెళ్లి ముత్యాల పెంపకంలో శిక్షణ పొంది సాగు చేశారు. తొలి ఏడాదే రూ.14 లక్షల నికరాదాయం పొందారు.

సొంత పొలంలో 300 అడుగుల పొడవు, 100 అడుగుల వెడల్పు, 20 అడుగుల లోతున రూ. 8.5 లక్షల పెట్టుబడితో 2020-21లో చెరువు తవ్వారు. నీరు ఇంకిపోకుండా అడుగున పాలిథిన్ షీట్ వేశారు. ఔరంగాబాద్‌లోని ముత్యాల వ్యాపారి అరుణ్ అంబోర్ దగ్గర నుంచి 25 వేల మంచినీటి ఆల్చిప్పలను ఒక్కొక్కటి రూ. 90 చొప్పున కొనుగోలు చేశారు. 2021 జూలైలో ఆల్చిప్పలను ఇనుప మెష్‌లో అమర్చి, చెరువు నీటిలో మునిగేలా తాళ్లతో లాగి గట్టుపై పోల్స్‌కు కట్టారు. చెరువులో నీరు ఆవిరైపోకుండా చెరువుపైన కూడా పాలిథిన్ షీట్ కప్పారు. చెరువు చుట్టూతా మెష్ వేశారు.

ముత్యం ధర రూ. 400

చెరువు నీటిలో నాచును ఆహారంగా తీసుకుంటూ ఆల్చిప్ప పెరుగుతుంది. నాచు పెరగడం కోసం (నెలకో వెయ్యి చొప్పున రోజుకు కొన్ని) స్పైరులినా టాబ్లెట్లను వేశారు. ఆల్చిప్పను రెండుగా చీల్చి మధ్యలోకి చిన్నపాటి నమూనాను చొప్పిస్తే.. దాని చుట్టూ కొద్దినెలల్లో తెల్లటి పదార్థం పోగుపడి.. ముత్యంగా తయారవుతుంది. లోపలికి చొప్పించేది ఏ ఆకారంలో ఉంటే ముత్యం ఆ (ఉదా.. దేవతామూర్తి/ బియ్యపు గింజ/ గుండ్రటి చిరుధాన్యం) ఆకారంలో తయారవుతుంది. 2022 సెప్టెంబర్‌లో పది వేల ముత్యాలు వచ్చాయి. ముత్యం రూ. 400కి అమ్మారు. రూ. 40 లక్షల ఆదాయం వచ్చింది. ఖర్చులు పోను తొలి ఏడాదే రూ.14 లక్షల నికరాదాయం వచ్చిందని సంజయ్ తెలిపారు. 'ముత్యాల పెంపకం మరీ కష్టమేమీ కాదు, మెలకువలను పాటిస్తే చాల'ని రైతు గోవింద్ షిండే అన్నారు.

విశాఖలో 6 నుంచి ఆర్గానిక్ మేళా

గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల - వినియోగదారుల సంఘం, రైతునేస్తం ఫౌండేషన్ తదితర సంస్థలతో కలిసి, విశాఖపట్నం నగరంలో ఆర్గానిక్ ఆహారోత్పత్తుల ప్రదర్శన, అమ్మకం మేళాను ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు బీచ్ రోడ్డు - ఎం.వి.పి. కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహించనున్నట్లు మేళా నిర్వాహకులు, భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ నాయకులు కుమారస్వామి తెలిపారు. తొలి రోజు 6(శుక్ర)న ఉ. 10 గం.కు ప్రకృతి సేద్యంపై సదస్సు జరుగుతుంది. 7(శని)న ఉ. 10 గం.కు సేంద్రియ ఇంటిపంటలు, మిద్దె తోటల సాగుపై నిపుణులు శిక్షణ ఇస్తారు. 8(ఆది)న ఉ. 10. గం.కు ఆవు పేడ, మూత్రంతో అనేక ఉత్పత్తులు తయారు చేసి ఉపాధి పొందే మార్గాలపై నిపుణులు శిక్షణ ఇస్తారు. 9(సోమ)న ఉ. 10 గం.కు 'ఆరోగ్యమే మహాభాగ్యం'పై నిపుణులు ప్రసంగిస్తారు. రైతులు, వ్యాపారులు సేంద్రియ ఉత్పత్తులను విక్రయిస్తారు. అందరూ ఆహ్వానితులే.

నల్ల తామరను జయించిన దుర్గాడ

మిరప పంటపై నల్ల తామరకు ప్రకృతి వ్యవసాయమే దీటుగా సమాధానం చెబుతోంది. రెండేళ్లుగా నల్ల తామర, మిరప తదితర ఉద్యాన పంటలను నాశనం చేస్తుండడంతో దీన్ని పెను విపత్తుగా ప్రభుత్వం గుర్తించింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో కాకినాడ జిల్లాలోని మిరప రైతులు నల్ల తామర తదితర చీడపీడలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పంటను నిలబెట్టుకుంటున్నారు.

● మిరప పంటను కాపాడిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులు

● ప్రకృతి సేద్యంలో ఎకరానికి రూ. 2.6 లక్షల నికరాదాయం

● కాకినాడ జిల్లా దుర్గాడ మిరప రైతుల విజయం

గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సస్యరక్షణ మందులను వినియోగించి నల్ల తామర ఉధృతిని కట్టడి చేస్తూ పంటలను కాపాడుకుంటున్నారు. దుర్గాడ గ్రామంలో 650 ఎకరాల్లో గుండ్రటి రకం మిరప సాగవుతుంటే, ఇందులో 180 ఎకరాలలో రైతులు ప్రకృతి సేద్య పద్ధతులు పాటిస్తున్నారు. ఈ మిరప పంట నల్ల తామర పురుగును తట్టుకుని నిలబడటం విశేషంగా చెబుతున్నారు. దుర్గాడ రకం మిర్చి విరగ పండటంతో రైతులు సంతోషంగా ఉన్నారు. అయితే, అదే గ్రామంలో ఈ పొలాలకు పక్కనే ఉన్న, రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడుతున్న రైతుల పొలాల్లో మిరప తోటలు నల్లతామర తదితర చీడపీడలతో దెబ్బతిన్నాయి. భారీ పెట్టుబడులు పెట్టి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

– లక్కింశెట్టి శ్రీనివాసరావు,
సాక్షి ప్రతినిధి, కాకినాడ
ఫొటోలు:
వివివి వరప్రసాద్,
పిఠాపురం



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన మిరప పంటలో రైతు వెలుగుల బాబ్జి



రసాయనిక వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన మిరప పంటలో రైతు ఇంటి ప్రసాద్

పకృతి వ్యవసాయంలో మిర్చి సాగు

పకృతి వ్యవసాయదారుడు	- వెలుగుల బాబ్జి
మండలం	- గొల్లప్రోలు
గ్రామం	- దుర్గాడ
సాగు చేసిన భూమి	- ఎకరం
సాగు చేసిన పంట	- మిర్చి
ఖర్చు :	
విత్తనాలు	- రూ.2,000
దుక్కి	- రూ.6,400
కలుపుతీత	- రూ.15,000
నాట్ల కూలి	- రూ.5,000
నీరు తడికి	- రూ.1,200
400 కేజీల ఘన జీవామృతం	- రూ.4,000
కషాయాల ఖర్చు	- రూ.6,000
మొత్తం ఖర్చు	- రూ.39,600
ఆదాయం	- రూ.3,00,000
నికరాదాయం	- రూ.2,60,400

రసాయనాలతో మిరప సాగు

మిరప రైతు	- ఇంటి ప్రసాద్
మండలం	- గొల్లప్రోలు
గ్రామం	- దుర్గాడ
సాగు చేసిన భూమి	- ఎకరం
సాగు చేసిన పంట	- మిర్చి
విత్తనాలకు	- రూ.2,000
దుక్కి	- రూ.6,400
కలుపుతీత	- రూ.15,000
నాట్ల కూలి	- రూ.5,000
నీరు తడికి	- రూ.1,200
రసాయనిక ఎరువు	- రూ.17,000 (10 బస్తాలు)
పురుగు మందులు	- రూ.10,000
పశువుల ఎరువు	- రూ.7,500 (5 ట్రాక్టర్లు)
మొత్తం ఖర్చు	- రూ.64,100
ఆదాయం	- 0

(పంటకు తామర పురుగు సోకి పూర్తిగా పాడవ్వడంతో తీసేయాల్సి వచ్చింది)



ఎకరానికి రూ. 65 వేల పెట్టుబడి.. రూపాయి కూడా తిరిగి రాలేదు..

నేను గత కొన్నేళ్లుగా రసాయనిక ఎరువులు, పురుగుమందులతో మిరప సాగు చేస్తున్నా. ఐతే గత రెండేళ్ళుగా నల్ల తామర పురుగు సోకడంతో మిర్చి పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఎకరానికి రూ 65 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ఒక్క రూపాయి కూడా తిరిగి రాలేదు. పంట పూర్తిగా తీసేయాల్సి వచ్చింది. రసాయనిక పురుగుమందులు పంటకు రక్షణ కల్పించ లేకపోయాయి.

- ఇంటి ప్రసాద్, మిర్చి రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం, కాకినాడ జిల్లా



దెబ్బతిన్న తోటలు కూడా కోలుకుంటున్నాయి



కొత్త పురుగు నల్ల తామరను నియంత్రించడంలో రసాయనక ఎరువులు, పురుగుమందుల కంటే కషాయాలే బాగా పనిచేస్తున్నాయి. ఉల్లి కషాయం, జీవామృతం, మీనామృతం వంటివి వినియోగించిన పొలాల్లో మిరప పంట తామర పురుగును తట్టుకుని నిలబడింది. రసాయనిక సేద్యంలో దెబ్బతిన్న మిరప పొలాల్లో కషాయాలు, ద్రావణాలు ఉపయోగించిన చోట్ల పంట తిరిగి పుంజుకుంటుండటం విశేషం. సేంద్రియ ఎరువులు వాడిన పంట మంచి ఆదాయాన్నిస్తుండగా రసాయనిక ఎరువులు, పురుగుమందులు వినియోగించిన పంటలు దెబ్బతిన్నాయి. ఈ రైతులకు అవగాహన కల్పించి వచ్చే సీజన్లో ప్రకృతి వ్యవసాయం చేసేలా అవగాహన కల్పిస్తున్నాం. నల్ల తామర ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్నాం. సేంద్రీయ మందులతో కొత్త పురుగు ఉధృతి తగ్గింది.

- ఇలియాజర్ (94416 56083), డీపీఎం, పకృతి వ్యవసాయ శాఖ, కాకినాడ

'ప్రకృతి' మిరపలో ఎకరానికి రూ.3 లక్షలు



కుళ్లిన ఉల్లితో కషాయం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, చేప వ్యర్థాలతో మీనామృతం, అల్లం-వెల్లుల్లితో అగ్ని అస్త్రం వంటివి తయారు చేసుకొని మిరప పంటకు వాడుతూ ప్రకృతి సేద్యంలో మంచి ఫలితాలు సాధిస్తున్నాం. కుళ్లిన ఉల్లిపాయలు, వేపాకులతో తయారు చేసే ఉల్లి కషాయం మిరప తోటల్లో నల్ల తామరను కట్టడి చేయటంలో కీలక స్థానం పోషిస్తోంది. ఎకరా మిర్చి తోట నుంచి ఇప్పటి వరకు రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఇంకా కొన్ని కాయలు కోయాల్సి ఉంది.

- వెలుగుల బాబ్జి (97014 41771), ప్రకృతి సేద్య పద్ధతుల్లో మిర్చి సాగు చేస్తున్న రైతు, దుర్గాడ

నిర్వహణ: **పంతంగి రాంబాబు,** సాగుబడి డెస్క్



మళ్లీ క్యాన్సర్ బారిన నవ్రతిలోవా

టెన్నిస్ ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకరైన మార్టినా నవ్రతిలోవా మరోసారి క్యాన్సర్ బారిన పడింది. తనకు స్టేజ్ 1 గొంతు క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ (హ్యూమన్ పపిలోమావైరస్) కూడా సోకినట్లు మార్టినా సోమవారం ప్రకటించింది. అయితే దీనికి చికిత్స ఉందని, త్వరలోనే తాను కోలుకోగలనని కూడా 66 ఏళ్ల మార్టినా విశ్వాసం వ్యక్తం చేసింది. అనారోగ్యం కారణంగా పరీక్షలు చేయించుకోవడంతో క్యాన్సర్ విషయం బయటపడింది. 18 సింగిల్స్ సహా మొత్తం 59 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచిన నవ్రతిలోవా 2010లోనే తొలిసారి క్యాన్సర్‌కు గురైంది.

ఫైనల్లో శివ థాపా

జాతీయ పురుషుల సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్టార్ బాక్సర్ శివ థాపా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ఆరు సార్లు ఆసియా పతకాలు సాధించిన అస్సాం బాక్సర్ థాపా... 63.5 కేజీల విభాగం ప్రిక్వార్టర్స్‌లో జస్వీందర్ సింగ్ (ఢిల్లీ)ని తన నాకౌట్ పంచ్‌తో చిత్తు చేశాడు. 2022 కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యం సాధించిన రోహిత్ టోకస్ (రైల్వేస్) కూడా 5–0తో జై సింగ్ (ఛత్తీస్‌గఢ్)పై ఘన విజయం సాధించాడు.



చివరి చూపు కోసం...

పీలే భౌతికకాయం సందర్శనకు జనం

సావోపాలో: బ్రెజిల్ ఆరాధ్య ఫుట్‌బాలర్ పీలేను కడసారి చూసేందుకు అభిమానులు సోమవారం ఉదయం నుంచే ఆయన పార్థివదేహం ఉంచిన విలా బెల్మిరా స్టేడియం ముందు క్యూ కట్టారు. 82 ఏళ్ల సాకర్ సూపర్‌స్టార్ గురువారం క్యాన్సర్‌తో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే! సావోపాలో శివారులో ఉన్న స్టేడియం సామర్థ్యం 16000 మాత్రమే! కానీ పెద్ద సంఖ్యలో అభిమానులు, సాంటోస్ క్లబ్ ఆటగాళ్లు, బ్రెజిల్ జాతీయ ఆటగాళ్లు తమ దిగ్గజానికి తుది నివాళులు అర్పించారు. 'ఫిఫా' అధ్యక్షుడు ఇన్‌ఫాంటినో, అధికారులు శ్రద్ధాంజలి ఘటించారు. మంగళవారం సాంటోస్ వీధుల గుండా అంతిమయాత్ర ముగించాక మెమోరియల్ నెక్రొపొలె ఎక్యుమెనికలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. దీనికి బ్రెజిల్ అధ్యక్షుడు లూయిస్ ఇనాసియో హాజరవుతారు.


నివాళి అర్పిస్తున్న పీలే భార్య మార్సియా ఒకీ (నలుపు డ్రెస్‌లో)

కుర్రాళ్లతో కొత్త సమరం

- శ్రీలంకతో భారత్ తొలి టి20 నేడు
- స్టార్లు లేని జట్టుకు పాండ్యా సారథ్యం
- రాత్రి గం. 7 నుంచి 'స్టార్‌స్పోర్ట్స్–1'లో ప్రత్యక్ష ప్రసారం


షనక


పాండ్యా

ముంబై: ఈ కొత్త సంవత్సరం భారత యువ క్రికెటర్లకు లక్కీ చాన్స్ ఇస్తోంది. స్టార్లు లేని టీమిండియాలో ఓ పూర్తి స్థాయి సిరీస్ ఆడేందుకు చక్కని అవకాశం కల్పించింది. ముఖ్యంగా టాపార్డర్‌లో సత్తా చాటుకునేందుకు కుర్రాళ్లకు ఇంతకు మించిన సదవకాశం ఉండదేమో! భారత పర్యటనకు వచ్చిన శ్రీలంకతో మూడు టి20ల సిరీస్‌లో మొదటి మ్యాచ్ నేడు ఇక్కడ జరుగుతుంది. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా సారథ్యంలో నూతన ఉత్సాహంతో టీమిండియా బరిలోకి దిగుతోంది. ఇన్నాళ్లు అడపాదడపా ఓపెనింగ్‌లో అవకాశాలు పొందిన ఇషాన్ కిషన్, రుతురాజ్ గైక్వాడ్‌లు ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌తో సత్తా చాటుకోవాలి. ముఖ్యంగా పవర్‌ప్లేలో తమ బ్యాటింగ్ పవర్ చూపించాల్సిందే!

'సూర్య' ప్రతాపం కొనసాగేనా

గతేడాది ఆసాంతం సూర్యకుమార్ యాదవ్ మెరుపులు మెరిపించాడు. ఒక్క ఏడాదిలోనే ఐసీసీ టి20 బ్యాటింగ్ ర్యాంకుల్లో అగ్ర స్థానానికి ఎగబాకాడు. ముఖ్యంగా ప్రతీ సిరీస్‌లోనూ తన మార్కు ఆటతీరుతో రాణించాడు. భారత 360 డిగ్రీ బ్యాటర్‌గా రూపాంతరం చెందాడు. ప్రత్యర్థి పేస్ బౌలర్ల పాలిట సూర్య ప్రతాపం ఎంత చెప్పకున్నా తక్కువే. ఇదే జోరును ఈ ఏడాదీ కొనసాగించాలనే లక్ష్యంతో సూర్య ఉన్నాడు. రోహిత్, కోహ్లి, రాహుల్ లేని టాప్ ఆర్డర్‌కు సూర్యకుమారే ఇప్పుడు పెద్ద దిక్కు. పెరిగిన బాధ్యతలతో జట్టుకు ఉపయుక్తమైన ఇన్నింగ్స్‌లు ఆడాల్సి వుంటుంది. పగ్గాలు అప్పగించిన ప్రతీసారీ నిరూపించుకున్న హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ మెరుపులు కూడా తోడయితే లంకేయులకు కష్టాలు తప్పవు. మిడిలార్డర్‌లో దీపక్ హుడా, సంజూ సామ్సన్‌లు కూడా బ్యాటింగ్‌లో బాధ్యతను పంచుకుంటే తక్కువ దూరంలో బౌండరీ ఉన్న వాంఖెడేలో భారీ స్కోర్లు ఏమంత కష్టం కానేకాదు.

అర్ష్‌దీప్‌పై భారం

ప్రస్తుత భారత జట్టులో అనుభవజ్ఞులైన పేసర్లు ఎవరు లేరు. ఇంకా చెప్పాలంటే జట్టులో ఇప్పుడున్న ఏకైక సీనియర్ బౌలర్ చహల్ ఒక్కడే! అతను స్పిన్‌తో కట్టడి చేయగలడు. అయితే సీమ్ బౌలింగ్‌ను నడిపించేది మాత్రం అర్ష్‌దీప్ సింగే. గడచిన ఐదారు నెలల్లో అర్ష్‌దీప్ తన పేస్ వాడి ఏంటో చూపెట్టాడు. టీమ్ మేనేజ్‌మెంట్ కూడా అతని ప్రతిభను గుర్తించి పదేపదే అవకాశాలిస్తుంది. స్పీడ్‌తో ఉమ్రాన్ మాలిక్, పేస్ వైవిధ్యంతో హర్షల్ పటేల్, స్పిన్‌తో వాషింగ్టన్ సుందర్ ప్రత్యర్థి బ్యాటింగ్‌కు ఏ మేరకు కళ్లెం వేయగలరో చూడాలి.

ఆసియా చాంప్‌తో ఆషామాషీ కాదు!

శ్రీలంక మిగతా ఫార్మాట్లలో ఎలా వున్నప్పటికీ పొట్టి ఫార్మాట్‌లో గట్టి ప్రత్యర్థే! ఆసియా కప్ టి20 చాంపియన్ శ్రీలంక జట్టులో మెరుపులు మెరిపించే బ్యాటర్స్‌కు కొదవే లేదు. కెప్టెన్ షనక, నిసాంక, కుశాల్ మెండిస్, భానుక రాజపక్స, సమరవిక్రమ అందరు మంచి ఫామ్‌లో ఉన్నారు. పైగా అనుభవజ్ఞులు లేని భారత బౌలింగ్‌పై వీళ్లు విరుచుకుపడితే భారీ స్కోర్లకు కొరత ఉండదు. బౌలింగ్ విషయానికి వస్తే హసరంగ స్పిన్ మ్యాజిక్‌తో పాటు తీక్షణ, మదుశంక, లహిరు కుమారల రూపంలో శ్రీలంక బౌలింగ్ మెరుగ్గానే ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), ఇషాన్ కిషన్, రుతురాజ్, సూర్యకుమార్, సామ్సన్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, చహల్, హర్షల్, అర్ష్‌దీప్, ఉమ్రాన్ మాలిక్.

శ్రీలంక: దసున్ షనక (కెప్టెన్), నిసాంక, కుశాల్ మెండిస్, ధనంజయ, అసలంక, చమిక కరుణరత్నే, భానుక రాజపక్స, హసరంగ, తీక్షణ, మదుశంక, లహిరు కుమార.

పిచ్–వాతావరణం

వాంఖెడే పిచ్ ప్రత్యేకించి పొట్టి ఫార్మాట్‌లో మెరుపులకు చక్కని అవకాశం కల్పిస్తుంది. దీంతో భారీ స్కోర్లు ఖాయం. మంచు ప్రభావం వల్ల టాస్ నెగ్గిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంటుంది. వర్షం ముప్పు లేదు.

'కిట్' మారింది!



భారత క్రికెట్ జట్టు 'కిట్'లో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. ఇప్పటి వరకు ఎంపీఎల్ స్పోర్ట్స్ 'కిట్' స్పాన్సర్‌గా ఉండగా... ఇప్పుడు దాని స్థానంలో కేవల్ కిరణ్ క్లాతింగ్ లిమిటెడ్ (కేకేసీఎల్) వచ్చింది. ఎంపీఎల్‌తో ఈ ఏడాది మార్చి వరకు బీసీసీఐ ఒప్పందం ఉండగా... తమ హక్కులను మరో సంస్థకు బదలాయించుకునేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా బోర్డును ఎంపీఎల్ ఇటీవలే కోరింది. అందుకే మూడు నెలల స్వల్ప కాలానికి కేకేసీఎల్ సీన్‌లోకి వచ్చింది. దాంతో శ్రీలంకతో సిరీస్‌నుంచి కేకేసీఎల్ తమ పాపులర్ బ్రాండ్ 'కిల్లర్ జీన్స్' లోగోను టీమిండియా జెర్సీలపై ప్రదర్శించనుంది.

డెవాన్ కాన్వే సెంచరీ



కరాచీ: పాకిస్తాన్‌తో ప్రారంభమైన రెండో టెస్టులో తొలి రోజు న్యూజిలాండ్ బ్యాటింగ్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చింది. ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 6 వికెట్ల నష్టానికి 309 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (191 బంతుల్లో 122; 16 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించగా, టామ్ లాథమ్ (100 బంతుల్లో 71; 9 ఫోర్లు) రాణించాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 134 పరుగులు జోడించారు. తొలి రెండు సెషన్లలో ఒకే వికెట్ కోల్పోయిన న్యూజిలాండ్...పాక్ బౌలర్ల జోరుతో చివరి సెషన్‌లోనే 5 వికెట్లు చేజార్చుకుంది. ఒక దశలో 234/1తో పటిష్ట స్థితిలో కనిపించిన టీమ్, 45 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు కోల్పోయింది.

సిరీస్ భారత మహిళల సొంతం


నజీలా

ప్రిటోరియా: దక్షిణాఫ్రికా మహిళల (అండర్–19)తో జరిగిన టి20 సిరీస్‌లో భారత మహిళలు (అండర్–19) పైచేయి సాధించారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సొంతం చేసుకున్నారు. సోమవారం జరిగిన నాలుగో టి20 మ్యాచ్‌లో భారత్ 4 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సఫారీ టీమ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 86 పరుగులే చేయగలిగింది. కేలే రెనెకే (18) టాప్ స్కోరర్‌గా నిలవగా...భారత బౌలర్లలో నజీలా సీఎంసీ (3/4), ఫలక్ నాజ్ (2/11) ప్రత్యర్థిని దెబ్బకొట్టారు. అనంతరం భారత్ 15 ఓవర్లలో 6 వికెట్లకు 87 పరుగులు సాధించింది. కెప్టెన్ షఫాలీ వర్మ (27 బంతుల్లో 29; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించింది. సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో భారత్ గెలవగా, తర్వాతి రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. సిరీస్‌లో చివరి మ్యాచ్ రేపు జరుగుతుంది.

ఐసీయూ నుంచి ప్రైవేట్ వార్డుకు...

పంత్ ఆరోగ్యస్థితి మెరుగు



డెహ్రాడూన్: కారు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భారత క్రికెటర్ రిషభ్ పంత్ పరిస్థితి కాస్త మెరుగైంది. అతడిని అత్యవసరం విభాగం (ఐసీయూ)నుంచి ప్రైవేట్ వార్డుకు తరలించినట్లు మ్యాక్స్ హాస్పిటల్ వర్గాలు వెల్లడించాయి. అయితే కాళ్లకు తగిలిన గాయాల తీవ్రతపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. నొప్పి ఎక్కువగానే ఉండటంతో ఎంఆర్‌ఐ గురించి ప్రస్తుతానికి ఆలోచించడం లేదని సమాచారం. మోకాలు, బొటనవేలు, మడమ భాగాలకు చాలా దెబ్బలు తగలడంతో ఇప్పటి వరకు వైద్యులు వాటికి ఎంఆర్‌ఐ చేయలేకపోయారు.

హైదరాబాద్ X ఆంధ్ర

సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీలో చిరకాల ప్రత్యర్థులైన రెండు జట్ల మధ్య నేటినుంచి కీలక సమరం జరగనుంది. ఎలైట్ గ్రూప్ 'బి' పోరులో భాగంగా హైదరాబాద్, ఆంధ్ర తలపడనున్నాయి. హైదరాబాద్ జట్టు ఇప్పటి వరకు ఆడిన 3 మ్యాచ్‌లలో ఒక్క విజయాన్నీ అందుకోలేకపోయింది. తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో అదృష్టవశాత్తూ 'డ్రా'తో గట్టెక్కిన టీమ్ ఆ తర్వాత ముంబై, అస్సాం చేతుల్లో ఓడి ఈ గ్రూప్ పాయింట్ల పట్టికలో అందరికంటే చివరగా (1 పాయింట్) ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది. హైదరాబాద్‌తో పోలిస్తే ఆంధ్ర పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. ముంబై చేతిలో తొలి మ్యాచ్‌లో ఓడినా... ఆ తర్వాత స్ఫూర్తిదాయక ప్రదర్శనతో రెండు పటిష్ట జట్లు తమిళనాడు, మహారాష్ట్రలను ఆంధ్ర ఓడించింది. మొత్తం 6 పాయింట్లతో ఆ జట్టు ఐదో స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో ఇరు జట్లకూ ఈ మ్యాచ్‌లో గెలుపు ఎంతో కీలకంగా మారింది.

సుమీత్ నగాల్ అవుట్

టాటా ఓపెన్ మహారాష్ట్ర

పుణే: దేశంలోని ఏకైక ఏటీపీ టోర్నీ టాటా ఓపెన్ మహారాష్ట్రలో భారత ఆటగాడు సుమీత్ నగాల్ పోరు ముగిసింది. హోరాహోరీగా సాగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ఫిలిప్ క్రజినోవిచ్ (సెర్బియా) 6–4, 4–6, 6–4 స్కోరుతో నగాల్‌పై విజయం సాధించాడు. 2 గంటల 24 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో 'వైల్డ్ కార్డ్' సుమీత్ తీవ్రంగా పోరాడినా లాభం లేకపోయింది. క్రజినోవిచ్ 8 ఏస్‌లు కొట్టగా, నగాల్ 3 ఏస్‌లు నమోదు చేశాడు. మరో మ్యాచ్‌లో అమెరికాకు చెందిన మైకేల్ మో 6–2, 6–4 స్కోరుతో 15 ఏళ్ల భారత సంచలనం మానస్ ధమ్నేపై విజయం సాధించాడు.

సినిమా

సీక్వెల్స్ ఉన్నాయి!


మహేశ్ బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి ప్రముఖ రచయిత, రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథ అందిస్తున్నారు. ఇప్పటికే ఇది 'యాక్షన్ అడ్వంచరస్' మూవీ అని ఆయన పలు ఇంటర్వ్యూల్లో పేర్కొన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ చిత్రానికి సీక్వెల్స్ ఉంటాయన్నారు. ప్రధాన పాత్రలు అలాగే ఉంటాయని, సీక్వెల్స్ కథ మారుతుంటుందని స్పష్టం చేశారాయన. ప్రస్తుతం తొలి భాగానికి సంబంధించిన కథను పూర్తి చేసే పని మీద ఉన్నారు విజయేంద్రప్రసాద్. ఇక మహేశ్ అద్భుత నటుడని, యాక్షన్ సీన్స్ బాగా చేస్తారని, ఏ రచయితకైనా ఆయనకు రాయడం బాగుంటుందని, ఈ చిత్రానికి హీరోగా తనే బెస్ట్ చాయిస్ అని చెప్పుకొచ్చారు విజయేంద్రప్రసాద్. ఈ ఏడాది ఈ చిత్రం షూటింగ్ ఆరంభమయ్యే అవకాశం ఉంది.

ఫిబ్రవరిలో ప్రేమకథ


సమంత, దేవ్ మోహన్

సమంత టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'శాకుంతలం'. గుణశేఖర్ దర్శకత్వం వహించారు. 'దిల్' రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, గుణ టీమ్ వర్క్స్‌పై నీలిమ గుణ నిర్మించారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 17న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. ''ప్రముఖ కవి కాళిదాసు రచించిన సంస్కృత నాటకం 'అభిజ్ఞాన శాకుంతలం' ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు గుణశేఖర్. శకుంతల, దుష్యంత మహారాజుల అజరామరమైన ప్రేమకథ ఇది. ఇందులో శకుంతలగా సమంత, దుష్యంతుడిగా దేవ్ మోహన్ నటించారు. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వటానికి ఈ చిత్రాన్ని 3డీలో రూపొందించాం. మణిశర్మ సంగీతం అందించారు. మ్యూజికల్‌గానూ ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతివ్వడానికి రీ రికార్డింగ్‌ను బుడాపెస్ట్, హంగేరిలోని సింఫనీ టెక్నీషియన్స్‌తో చేయించాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి'' అని చిత్రబృందం పేర్కొంది. మోహన్‌బాబు, ప్రకాశ్‌రాజ్, మధుబాల, గౌతమి, బేబీ అల్లు అర్హ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: శేఖర్ వి. జోసెఫ్.

వేసవిలో మాస్‌గా...



'ఉప్పెన' ఫేమ్ పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా ఓ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రం ద్వారా శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకునిగా పరిచయమవుతున్నారు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 29న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించి, వైష్ణవ్ తేజ్ వీడియోను రిలీజ్ చేసింది. ఈ సందర్భంగా చిత్ర దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''పూర్తి స్థాయి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇందులో వైష్ణవ్ సరికొత్త మాస్ అవతారంలో కనిపిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. టైటిల్‌తో పాటు, చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: దుద్దే.

పదేళ్ల ప్రేమ ప్రయాణం


నాగశౌర్య, మాళవికా నాయర్

'ఊహలు గుసగుసలాడే, జ్యో అచ్యుతానంద' వంటి చిత్రాల తర్వాత హీరో నాగశౌర్య, దర్శకుడు శ్రీనివాస్ అవసరాల కాంబినేషన్‌లో రూపొందుతోన్న మూడో చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా టీజీ విశ్వప్రసాద్, పద్మజ దాసరి నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఇటీవలే పూర్తయింది. ఈ సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. శ్రీనివాస్ అవసరాల మాట్లాడుతూ– ''పదేళ్ల పాటు ఓ జంట మధ్య సాగే ప్రేమ ప్రయాణమే 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. 18 ఏళ్ల నుండి 28 సంవత్సరాల వయస్సు వరకు హెచ్చు తగ్గులతో సాగే వారి ప్రయాణం ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు. ''ఈ సినిమా విడుదల తేదీతో పాటు మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అన్నారు టీజీ విశ్వప్రసాద్, పద్మజ దాసరి. ఈ చిత్రానికి కెమెరా: సునీల్ కుమార్ నామ, సంగీతం: కళ్యాణీ మాలిక్, వివేక్ సాగర్ (కాఫీ పై సాంగ్), ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి, అసోసియేట్ ప్రొడ్యూసర్స్: సునీల్ షా, రాజా సుబ్రమణియన్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

మనసు చెప్పిన మాట వింటాను


ఆలియా భట్

కెరీర్‌లో దూసుకెళుతున్నప్పుడు పెళ్లి చేసుకోవడం, తల్లి కావడం అనేది సరైన నిర్ణయం కాదని కథానాయికలకు కొందరు చెబుతుంటారు. ఇదే విషయం గురించి ఆలియా భట్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ – ''నేనెప్పుడూ నా మనసు చెప్పింది వింటాను. జీవితాన్ని మనం ప్లాన్ చేయలేం. జీవితమే ప్లాన్ చేస్తుంది. నా కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడు పెళ్లి చేసుకున్నాను.. తల్లిని కూడా అయ్యాను. పెళ్లి చేసుకున్నంత మాత్రాన, తల్లయినంత మాత్రాన చేసే వృత్తిలో మార్పులు వస్తాయా.. ఎవరన్నారు? ఓ నటిగా నా మీద నాకు నమ్మకం ఉంది. మనం మంచి యాక్టర్ అయినప్పుడు, కష్టపడి పని చేయాలనే ఆలోచన ఉన్నప్పుడు పని దానంతట అది మన దగ్గరకు వస్తుంది. ఒకవేళ రాలేదనుకుంటే.. ఇది మన టైమ్ కాదనుకోవాలి. అయినా నేను పని గురించి పెద్దగా ఆలోచించి, ఒత్తిడికి గురి కాను. తల్లి కావాలని నేను తీసుకున్న నిర్ణయానికి జీవితంలో ఎప్పుడూ పశ్చాత్తాపపడను. ఇంకా చెప్పాలంటే పెళ్లి, తల్లి కావడం అనేవి నా జీవితంలో నేను తీసుకున్న గొప్ప నిర్ణయాలు'' అన్నారు. ఇక గత ఏడాది రణ్‌బీర్ కపూర్–ఆలియాల వివాహం జరిగిన విషయం తెలిసిందే. నవంబర్‌లో ఆలియా పాపకు జన్మనిచ్చారు. కుమార్తెకు 'రాహా' అని పేరు పెట్టారు. ఈ పేరుకి అర్థం చెబుతూ – ''రాహా అంటే 'ఆధ్యాత్మిక బాట' అని ఓ అర్థం. ఇంకా ఉపశమనం, విశ్రాంతి, సౌకర్యం, ఆనందం, స్వేచ్ఛ.. ఇలా ఒక్కో భాషల్లో ఒక్కో అర్థం ఉంది. మా జీవితాల్లోకి రాహా రావడం మా కుటుంబం మొత్తానికీ ఆనందం ఇచ్చింది. మా జీవితాలు ఇప్పుడే మొదలైనట్లుగా అనిపిస్తోంది. నాకైతే జీవితం పరిపూర్ణంగా ఉన్నట్లనిపిస్తోంది'' అన్నారు ఆలియా.

వ్యూహం ఏంటి?


అజయ్

క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'చక్రవ్యూహం'. 'ది ట్రాప్' అన్నది ఉపశీర్షిక. చెట్కూరి మధుసూదన్ దర్శకత్వం వహిస్తున్నారు. సహస్ర క్రియేషన్స్ బ్యానర్‌పై సావిత్రి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సందర్భంగా చెట్కూరి మధుసూదన్, సావిత్రి మాట్లాడుతూ– ''మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. హత్య కేసును ఛేదించేందుకు హీరో ఎలాంటి వ్యూహం పన్నాడన్నది ఆసక్తిగా ఉంటుంది. పోలీస్ పాత్రలో అజయ్ నటన ఆకట్టుకుంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాతలు: వెంకటేష్, అనూష, సంగీతం: భరత్ మంచిరాజు, కెమెరా: జీవీ అజయ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: అజయ్, మహేష్.

సస్పెన్స్.. థ్రిల్


బుచ్చిబాబు, శంకర్

రవి వర్మ, రోహిత్ బెహల్, అక్షత సోనవానె ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'ప్రత్యర్థి'. శంకర్ ముడావత్ దర్శకత్వంలో సంజయ్ సాహ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా 'ఉప్పెన' ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు ట్రైలర్‌ని విడుదల చేసి, చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ''సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించాం. రొటీన్‌కి భిన్నంగా ఉండే చిత్రాన్ని ప్రేక్షకులకు ఇవ్వాలనే ఆలోచనతో ఓ డిఫరెంట్ పాయింట్‌తో తీశాం. ఊహించని మలుపులతో సినిమా ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు దర్శక–నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: పాల్ ప్రవీణ్, కెమెరా: రాకేష్ గౌడ్.

లవ్ లైటూ...


నందినీ రాయ్

శ్రీ సింహా, నేహా సోలంకి హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'భాగ్ సాలే'. ప్రణీత్ సాయి దర్శకత్వంలో అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కల్యాణ్ సింగనమల నిర్మించారు. కాల భైరవ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ప్రేమ కోసం..' అనే మాస్ పాటను విడుదల చేశారు. 'సన్ లైటు.. మూన్ లైటు.. మించిందేరా లవ్ లైటూ, వద్దు చాటు.. వద్దు లేటు.. ఉంటే చాలు కొంత చోటు...' అంటూ సాగే ఈ పాటకి కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, మంగ్లీ పాడారు. ఈ పాటలో నటి నందినీ రాయ్ నర్తించారు. ''ప్రేక్షకులను ఆద్యంతం థ్రిల్ చేసే కథతో రూపొందిన చిత్రం 'భాగ్ సాలే'. యువతని ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని ప్రణీత్ సాయి తెరకెక్కించారు'' అని నిర్మాతలు అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రమేష్ కుషేందర్.

సాక్షి బిజినెస్

మంగళవారం
3-1-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▲	327	61,168
నిఫ్టీ ▲	92	18,197

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్‌	10,466	▽	12
డోజోన్స్‌	33,147	▽	74
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,452	▽	61
డాక్స్‌	14,069	▲	146
షాంఘై	3,089	▲	16
నికాయ్‌	26,094	▲	1

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	54,867
బంగారం (99.5 స్వచ్ఛత)	54,647
వెండి (కేజీ)	68,092

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఒక్కటి	81.90	83.57
£	బ్రిటన్‌ పౌండ్‌	ఒక్కటి	86.97	90.07
€	యూరో	ఒక్కటి	98.27	101.56
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఒక్కటి	62.17	64.20
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఒక్కటి	55.19	57.59
S$	సింగపూర్‌ డాలర్‌	ఒక్కటి	60.79	62.78
SAR	సౌదీ రియాల్‌	పాయింట్లు	21.07	22.74
UAE D	యూఏఈ దిర్హామ్‌	పాయింట్లు	21.63	23.42
¥	చైనా యువాన్‌	పాయింట్లు	10.87	12.90

ఇండియన్‌ బ్యాంక్‌ రుణ రేట్లు పావుశాతం పెంపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇండియన్‌ బ్యాంక్‌ రుణ రేట్లు పావుశాతం వరకూ పెరిగాయి. తాజా రేట్లు జనవరి 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని బ్యాంక్‌ ప్రకటన తెలిపింది. నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్‌ఆర్‌), బాండ్‌ ఆధారిత రుణ రేటు (టీబీఎల్‌ఆర్‌), బేస్‌ రేట్‌ అండ్‌ బెంచ్‌ మార్క్‌ ప్రైమ్‌ లెండింగ్‌ రేట్‌ (బీపీఎల్‌ఆర్‌)ను అసెట్‌ లయబిలిటీ మేనేజ్‌మెంట్‌ కమిటీ (ఏఎల్‌సీఓ)సమీక్షించి అన్ని కాలపరిమితులపై రేటు 25 బేసిస్‌ పాయింట్ల వరకూ (100 బేసిస్‌ పాయింట్లు ఒకశాతం) పెంచాలని నిర్ణయించినట్లు బ్యాంక్‌ ప్రకటన పేర్కొంది. తాజా నిర్ణయంతో ప్రధానంగా ఏడాది రుణ రేటు 8.20 శాతం నుంచి 8.30 శాతానికి ఎగసింది. నెల, ఆరు నెలల రేట్లు 20 బేసిస్‌ పాయింట్లు ఎగశాయి. బేస్‌ రేటు పావుశాతం పెంపుతో 9.10 శాతానికి ఎగసింది.

టై హైదరాబాద్‌ ప్రెసిడెంట్‌గా రషీదా



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: ద ఇండస్‌ ఎంట్రప్రెన్యూర్స్‌ (టై) హైదరాబాద్‌ విభాగం నూతన ప్రెసిడెంట్‌గా 2023 సంవత్సరానికిగాను ఆర్‌అండ్‌ఎమ్‌ అసోసియేట్స్‌ ఫౌండర్‌ పార్ట్‌నర్‌ రషీదా అడెన్‌వాలా నియమితులయ్యారు. హైదరాబాద్‌ చాప్టర్‌ ప్రెసిడెంట్‌గా ఒక మహిళ బాధ్యతలు చేపట్టడం ఇదే తొలిసారి. వైస్‌ ప్రెసిడెంట్‌గా మంజీరా డిజిటల్‌ సిస్టమ్స్‌ కో–ఫౌండర్‌ శ్రీని చందుపట్ల ఎన్నికయ్యారు. బోర్డు సభ్యులుగా వెంకటేశ్వర రావు అన్నప్రగడ, బాలాజీ భైరవభట్ల, రవి చెన్నుపాటి, షరిన్‌ తాయిల్, రాజ్‌ సామల, రవీంద్ర నల్లూరి, నందిత సేథి, భాను ప్రకాశ్‌ వర్ల, జయేశ్‌ సంఘ్వి, అభిజీత్‌ బెనర్జీ ఎంపికయ్యారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

3-1-2023	
విశాఖ	555–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్‌ ధర (డజను)	78.00
2-1-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	541–00
వరంగల్‌	543–00
రిటైల్‌ ధర	6.00

రిఫ్రిజిరేటర్లు మరింత ప్రియం



న్యూఢిల్లీ: రిఫ్రిజిరేటర్లు మరింత ప్రియం కానున్నాయి. ధరలు 5 శాతం వరకు అధికం అయ్యే అవకాశం ఉంది. బ్యూరో ఆఫ్‌ ఎనర్జీ (బీఈఈ) నూతన ప్రమాణాలు జనవరి 1 నుంచి అమలులోకి రావడమే ఇందుకు కారణం. కొత్త ప్రమాణాల కారణంగా మోడల్‌నుబట్టి 2–5 శాతం ధర పెరగవచ్చని గోద్రెజ్‌ అప్లయెన్సెస్, హాయర్, ప్యానాసోనిక్‌ వెల్లడించాయి. ఫ్రాస్ట్‌–ఫ్రీ మోడళ్లలో ఫ్రీజర్స్, రిఫ్రిజిరేటర్‌ ప్రొవిజనింగ్‌ యూనిట్‌ల (నిల్వ విభాగం) కోసం వేర్వేరుగా స్టార్‌ లేబులింగ్‌ను బీఈఈ తప్పనిసరి చేసింది. రిఫ్రిజిరేటర్‌ స్థూల సామర్థ్యానికి బదులు నికర సామర్థ్యం (వినియోగం అయ్యే స్థలం) ఆధారంగానే కంపెనీలు స్టార్‌ లేబులింగ్‌ చేయాల్సి ఉంటుంది. రీసెర్చ్‌ అండ్‌ మార్కెట్స్‌ నివేదిక ప్రకారం భారత్‌లో రిఫ్రిజిరేటర్ల విపణి 2022లో రూ.25,352 కోట్లు ఉంది.

డిసెంబర్‌లో తయారీ జోరు

13 నెలల గరిష్టానికి సూచీ



న్యూఢిల్లీ: భారత్‌ తయారీ రంగం డిసెంబర్‌లో మంచి పనితీరును కనబరిచింది. స్టాండెర్డ్‌ అండ్‌ పూర్స్‌ గ్లోబల్‌ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్‌ పర్చేజింగ్‌ మేనేజర్స్‌ ఇండెక్స్‌ (పీఎంఐ) డిసెంబర్‌లో 13 నెలల గరిష్టం 57.8ని తాకింది. నవంబర్‌లో ఈ సూచీ 55.7 వద్ద ఉంది. కొత్త ఆర్డర్లు, పటిష్ట డిమాండ్‌ తాజా సానుకూల ఫలితానికి కారణమని ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ మార్కెట్‌ ఇంటెలిజెన్స్‌ ఎకనమిక్స్‌ అసోసియేట్‌ డైరెక్టర్‌ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. సూచీ 50 పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన పీఎంఐ వరుసగా 18 నెలల నుంచి వృద్ధి బాటలోనే కొనసాగుతోంది. కాగా, ద్రవ్యోల్బణానికి సంబంధించి డిసెంబర్‌లో కొంత ఒత్తిడి ఉన్నట్లు తమ సర్వేలో వెల్లడయినట్లు డీ లిమా పేర్కొన్నారు.

కష్ట కాలంలోనూ భారత్‌ ఎకానమీ దూకుడు

- అసోచామ్‌ నివేదిక
- కార్పొరేట్‌ పనితీరు బాగుంది
- ద్రవ్యోల్బణం నెమ్మది
- డిమాండ్‌ పరిస్థితులు బెటర్‌



న్యూఢిల్లీ: క్లిష్టతరమైన ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లోనూ భారత్‌ 2023 సంవత్సరాలన్ని నెట్టుకురాగలుగుతుందన్న విశ్వాసాన్ని పారిశ్రామిక వేదిక–అసోచామ్‌ వ్యక్తం చేసింది. పటిష్ట వినియోగ డిమాండ్, మెరుగైన కార్పొరేట్‌ పనితీరు, తగ్గుముఖం పడుతున్న ద్రవ్యోల్బణం వంటి అంశాలు తమ అంచనాలకు కారణంగా పేర్కొంది. అసోచామ్‌ సెక్రటరీ జనరల్‌ దీపక్‌ సూద్‌ ఈ మేరకు చేసిన ప్రకటనలో కొన్ని ముఖ్యాంశాలను పరిశీలిస్తే..

▪ గ్లోబల్‌ ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా కనిపిస్తున్నాయి. అయినప్పటికీ, బలమైన దేశీయ డిమాండ్, పటిష్ట ఆర్థిక రంగం, మెరుగైన కార్పొరేట్‌ బ్యాలెన్స్‌ షీట్‌ల సహాయంతో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరమైన బాటలో నిలుస్తుందని విశ్వసిస్తున్నాం.

▪ రబీ పంటలు బాగుంటాయని తొలి సంకేతాలు వెల్లడిస్తున్నాయి. వ్యవసాయ రంగం సానుకూల పనితీరును ఇది సూచిస్తోంది. ఫాస్ట్‌ మూవింగ్‌ కన్జ్యూమర్‌ గూడ్స్‌ (ఎఫ్‌ఎంసీజీ). ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, ప్రత్యేక రసాయనాలు– ఎరువులు వంటి అనేక పరిశ్రమల పనితీరు బాగుంది.

▪ పర్యాటకం, హోటళ్లు రవాణా, గృహ కొనుగోళ్లు, విద్యుత్, ఎలక్ట్రానిక్స్, విచక్షణతో కూడిన వినియోగదారు వస్తువుల కొనుగోళ్లు, ఆటోమొబైల్స్‌ విభాగాల్లోనూ చక్కటి వినియోగ డిమాండ్‌ కనిపిస్తోంది.

▪ అయితే, అంతర్జాతీయ కరెన్సీ హెచ్చుతగ్గుల గురించి, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల పనితీరు, పర్యవసానాలపై భారత్‌ జాగరూకతలో ఉండాల్సిన అవసరం ఉంది.

▪ అభివృద్ధి చెందిన కొన్ని కీలకమైన ఆర్థిక వ్యవస్థలు మాంద్యం పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు అనుసరిస్తున్న కఠిన ద్రవ్య విధానాలతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోందని, ఈ నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కేవలం 2.7 శాతం మాత్రమే వృద్ధి చెందుతుందని రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవలే అంచనా వేసింది. అధిక వడ్డీ ప్రభావం భారత్‌ కార్పొరేట్ల బ్యాలెన్స్‌ షీట్లపై కూడా ప్రతిబింబిస్తోంది. అయితే ఆయా ప్రతికూలతలను భారత్‌ కార్పొరేట్‌ రంగం అధిగమిస్తోంది.

▪ ఇన్ని క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్‌ ఎకానమీ 2022–23లో 6.8 శాతం నుంచి 7 శాతం పురోగమిస్తుందని భావిస్తున్నాం. 2023–24లో కూడా ఇదే సానుకూలత కొనసాగే అవకాశాలూ ఉన్నాయి.

కొత్త ఏడాది లాభాల బోణీ

- తొలి ట్రేడింగ్‌ సెషన్‌లో శుభారంభం
- మళ్లీ 61వేల పాయింట్ల పైకి సెన్సెక్స్‌
- 18,200 స్థాయికి చేరువలో నిఫ్టీ



ముంబై: దేశీయ స్టాక్‌ సూచీలు కొత్త ఏడాది తొలి ట్రేడింగ్‌ సెషన్‌ను లాభాలతో ముగించాయి. సెన్సెక్స్‌ సోమవారం 327 పాయింట్లు బలపడి 61,168 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 92 పాయింట్లు పెరిగి 18,200 పాయింట్లు చేరువలో 18,197 వద్ద నిలిచింది. నూతన సంవత్సరం నేపథ్యంలో పలు దేశాల స్టాక్‌ మార్కెట్లకు సెలవు కారణంగా సూచీలు ఉదయం ఫ్లాట్‌గా ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. తొలుత కాస్త తడిబడినా..., మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్‌ ఆర్థిక షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో క్రమంగా లాభాల బాటపట్టాయి. ఈ క్రమంలో సెన్సెక్స్‌ 381 పాయింట్లు పెరిగి 61,222 వద్ద, నిఫ్టీ 110 పాయింట్లు బలపడి 18,215 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. గతేడాది చివరి నెల డిసెంబర్‌లో జీఎస్టీ వసూళ్లు గణనీయంగా పెరిగాయి. ఆటో కంపెనీల అమ్మకాలు అంచనాలకు తగ్గట్టు నమోదయ్యాయి. కొత్త వ్యాపారాల ఆర్డర్లలతో తయారీ రంగ పీఎంఐ సూచీ 13 నెలల గరిష్టానికి చేరుకుంది. ఈ సానుకూల పరిణామాలు సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. కన్జ్యూమర్‌ డ్యూరబుల్స్, విద్యుత్‌ రంగాల షేర్ల అమ్మకాలు ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్‌ ఇండెక్స్‌ ఒకశాతం, మిడ్‌ క్యాప్‌ సూచీ అరశాతం లాభపడ్డాయి. సూచీలు అరశాతం ర్యాలీ చేయడంతో స్టాక్‌ మార్కెట్లో రూ.1.47 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.213 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.743 కోట్ల షేర్లు కొన్నారు. కొత్త ఏడాది సందర్భంగా జపాన్, సింగపూర్, హాంగ్‌కాంగ్, థాయిలాండ్, చైనా, బ్రిటన్‌తో పాటు అమెరికా మార్కెట్లు పని చేయలేదు. అంతర్జాతీయంగా క్రూడాయిల్‌ ధరలు పెరుగుదల, దేశీయ మార్కెట్లో ఎఫ్‌ఐఐల పెట్టుబడుల ఉపసంహరణతో డాలర్‌ మారకంలో రూపాయి విలువ 17 పైసలు క్షీణించి 82.78 స్థాయి వద్ద స్థిరపడింది. 'దేశీయ కార్పొరేట్‌ కంపెనీల ఆదాయాల్లో మెరుగైన వృద్ధి నమోదవ్వొచ్చనే అంచనాలతో పాటు బడ్జెట్‌పై ఆశలతో రానున్న రోజుల్లో దేశీయ స్టాక్‌ మార్కెట్‌ స్థిరంగా రాణించవచ్చు. నిఫ్టీ ఎగువ స్థాయిలో 18,250 పాయింట్లను ఛేదించాల్సి ఉంటుంది. దిగువ స్థాయిలో 18,100 పాయింట్ల వద్ద కీలక మద్దతు ఉంది' అని మోతీలాల్‌ ఓస్వాల్‌ ఫైనాన్సియల్‌ సర్వీసెస్‌ హెడ్‌ సిద్ధార్థ ఖేమా తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

▪ డిమాండ్‌ పెంచేందుకు చైనా ఎగుమతుల సుంకాన్ని పెంచడంతో పాటు కోవిడ్‌ ఆంక్షల ఎత్తివేతతో మెటల్‌ షేర్లు మెరిశాయి. సెయిల్, హిందుస్థాన్‌ కాపర్, మొయిల్, జేఎస్‌ఎల్, టాటా స్టీల్‌ షేర్లు 8% నుంచి 7% ర్యాలీ చేశాయి. నాల్కో, హిందాల్కో, వేదాంత, రత్నమణి మెటల్స్, జిందాల్‌ స్టీల్, ఏపియల్‌ అపోలో షేర్లు, హిందుస్థాన్‌ జింక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌ షేర్లు 4–1% చొప్పు న రాణించాయి. నిఫ్టీ మెటల్‌ ఇండెక్స్‌ ఇంట్రాడేలో 3% ఎగసి 6907 స్థాయి వద్ద జీవిత కాల గరిష్టాన్ని నమోదు చేసింది.

▪ రెండోరోజు నాటికి షా పాలీమర్స్‌ ఐపీఓ 2.37 రెట్లు సబ్‌స్క్రైబ్‌ అయ్యింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 56.10 లక్షల ఈక్విటీ షేర్లను జారీ చేయగా 1.33 లక్షల షేర్లకు బిడ్లు ధాఖలయ్యాయి.

▪ ఫార్మా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. నాట్కో ఫార్మా, దివీస్‌ ల్యాబ్స్, అరబిందో ఫార్మా, ఇప్కా ల్యాబ్స్, ఫైజర్, లారస్‌ ల్యాబ్స్‌ సన్‌ ఫార్మా షేర్లు 1.50% నుంచి ఒకశాతం నష్టపోయాయి.

ఆన్‌లైన్‌ గేమింగ్‌కు స్వీయ నియంత్రణ సంస్థ

- గేమ్స్‌ ఫలితాలపై బెట్టింగ్‌ చేయకూడదు
- నిబంధనల ముసాయిదా విడుదల



న్యూఢిల్లీ: ఆన్‌లైన్‌ గేమింగ్‌ కంపెనీలకు సంబంధించిన నిబంధనల ముసాయిదాను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ (ఎంఈఐటీవై) విడుదల చేసింది. వీటి ప్రకారం ఆన్‌లైన్‌ గేమింగ్‌ పరిశ్రమ.. స్వీయ నియంత్రణ సంస్థను (ఎస్‌ఆర్‌వో) ఏర్పాటు చేసుకోవాల్సి రానుంది. అలాగే తప్పనిసరిగా ప్లేయర్ల ధ్రువీకరణ, భారత్‌లో భౌతిక చిరునామా నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. గేమ్స్‌ ఫలితాలపై బెట్టింగ్‌ చేయడానికి ఉండదు. వీటిపై పరిశ్రమ వర్గాలు జనవరి 17లోగా తమ అభిప్రాయాలను తెలియజేయాల్సి ఉంటుందని ఎంఈఐటీవై సహాయ మంత్రి రాజీవ్‌ చంద్రశేఖర్‌ తెలిపారు. తుది నిబంధనలు ఫిబ్రవరి తొలి నాళ్లలో ఖరారయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశీయంగా ఆన్‌లైన్‌ గేమింగ్‌ రంగం వృద్ధికి, నవకల్పనలకు ప్రోత్సాహమివ్వాలనేది నిబంధనల ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు. 200 బిలియన్‌ డాలర్ల పైచిలుకు విలువ గల పరిశ్రమలో స్టార్టప్‌లు, పెట్టుబడులపరంగా ఎదిగేందుకు భారత్‌కు గణనీయంగా అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. 2021లో సోషల్‌ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ కోసం రూపొందించిన కొత్త ఐటీ నిబంధనల పరిధిలో ఆన్‌లైన్‌ గేమింగ్‌ కంపెనీలు పని చేయాల్సి ఉంటుందని మంత్రి చెప్పారు.

యూపీఐ చెల్లింపులు @ రూ. 13 లక్షల కోట్లు

డిసెంబర్‌లో రికార్డు స్థాయిలో పేమెంట్స్‌; 782 కోట్ల లావాదేవీలు



న్యూఢిల్లీ: ఏకీకృత చెల్లింపుల విధానం (యూపీఐ) ద్వారా గత డిసెంబర్‌లో రికార్డు స్థాయిలో చెల్లింపులు జరిగాయి. 782 కోట్ల లావాదేవీల ద్వారా ఏకంగా రూ. 12.82 లక్షల కోట్ల పేమెంట్స్‌ నమోదయ్యాయి. 2016లో ప్రారంభమైన యూపీఐ ప్లాట్‌ఫామ్‌ దేశీయంగా డిజిటల్‌ పేమెంట్స్‌ విభాగంలో విప్లవాత్మక మార్పులు తేవడంలో కీలక పాత్ర పోషిస్తోందని ఆర్థిక సేవల విభాగం సోమవారం మైక్రోబ్లాగింగ్‌ సైట్‌ ట్విట్టర్‌లో ట్వీట్‌ చేసింది. యూపీఐ చెల్లింపులు గతేడాది అక్టోబర్‌లో తొలిసారిగా రూ. 12 లక్షల కోట్ల మార్కును దాటాయి. నవంబర్‌లో రూ. 11.90 లక్షల కోట్లకు తగ్గినా, డిసెంబర్‌లో మళ్లీ పెరిగాయి. ప్రస్తుతం దాదాపు 381 బ్యాంకులు యూపీఐ ప్లాట్‌ఫామ్‌లో ఉన్నాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎస్‌పీఎస్సీలో 783 గ్రూప్‌-2 పోస్టులు

తెలంగాణ స్టేట్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌(టీఎస్‌పీఎస్సీ).. 18 ప్రభుత్వ విభాగాల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 783

» **వయసు:** 01.07.2022 నాటికి ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ పోస్టులకు 21 నుంచి 30 ఏళ్లు, ఇతర పోస్టులకు 18 నుంచి 44 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. రిజర్వేషన్‌ వర్గాలకు వయో సడలింపు లభిస్తుంది.

» **అర్హత:** పోస్టును అనుసరించి బ్యాచిలర్స్‌ డిగ్రీ, బ్యాచిలర్స్‌ డిగ్రీ(మ్యాథ్స్‌ /ఎకనామిక్స్‌/కామర్స్‌/లా), ఎంఏ(సోషల్‌ వర్క్‌/సైకాలజీ/క్రిమినాలజీ/కరెక్షనల్‌ అడ్మినిస్ట్రేషన్‌). డిప్లొమా(టెక్స్‌టైల్‌ టెక్నాలజీ/హ్యాండ్‌లూమ్‌ టెక్నాలజీ). ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ పోస్టులకు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్‌ టైప్‌),ధ్రువపత్రాల పరిశీలన,రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు. **పరీక్ష విధానం:** పేపర్‌–1(జనరల్‌ స్టడీస్, జనరల్‌ ఎబిలిటీస్‌), పేపర్‌–2(హిస్టరీ, పాలిటీ, సొసైటీ), పేపర్‌–3(ఎకానమీ,డెవలప్‌మెంట్‌),పేపర్‌–4(తెలంగాణ మూ మెంట్, స్టేట్‌ ఫార్మేషన్‌)పరీక్షలు ఉంటాయి. ప్రతి పేపర్‌కు 150 ప్రశ్నల చొప్పున మొత్తం 600 మార్కులు కేటాయించారు. ప్రతి పేపర్‌కు రెండున్నర గంటల వ్యవధి ఉంటుంది.

» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 18.01.2023.

» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 16.02.2023.

» **వెబ్‌సైట్‌:** tspsc.gov.in

యూజీసీ-నెట్‌-2022 డిసెంబర్‌

యూనివర్సిటీ గ్రాంట్స్‌ కమిషన్‌(యూజీసీ).. నేషనల్‌ ఎలిజిబిలిటీ టెస్ట్‌ డిసెంబర్‌ 2022 (యూజీసీ–నెట్‌) పరీక్ష షెడ్యూల్‌ విడుదల చేసింది. జూనియర్‌ రీసెర్చ్‌ ఫెలోషిప్‌(జేఆర్‌ఎఫ్‌), విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ పోస్టుల కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు.

» **సబ్జెక్టులు:** అడల్ట్‌ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, అరబ్‌ కల్చర్‌ అండ్‌ ఇస్లామిక్‌ స్టడీస్, అరబిక్, ఆర్కియాలజీ, అస్సామీ, బెంగాలీ, బోడో, బౌద్ధ, జైన, చైనీస్, కామర్స్, కంప్యూటర్‌ సైన్స్, క్రిమినాలజీ తదితరాలు.

» **అర్హత:** 55శాతం మార్కులతో మాస్టర్స్‌ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.

» **వయసు:** జేఆర్‌ఎఫ్‌కు 01.02.2023 నాటికి 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌కు గరిష్ఠ వయోపరిమితి లేదు.

» **పరీక్ష విధానం:** కంప్యూటర్‌ ఆధారిత పరీక్ష(సీబీటీ)విధానంలో ఉంటుంది. పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లలోనూ ఆబ్జెక్టివ్‌ టైప్, మల్టిపుల్‌ ఛాయిస్‌ ప్రశ్నలు ఉంటాయి. పేపర్‌–1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్‌–2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి 3 గంటలు.

» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 17.01.2023.

» **పరీక్ష తేదీలు:** 21.02.2023 నుంచి 10.03.2023 వరకు. » **వెబ్‌సైట్‌:** ugcnet.nta.nic.in

టీఎస్‌ఎన్‌పీడీసీఎల్, హన్మకొండలో 157 పోస్టులు

హన్మకొండలో తెలంగాణ నార్తర్న్‌ పవర్‌ డిస్ట్రిబ్యూషన్‌ కంపెనీ ఆఫ్‌ తెలంగాణ లిమిటెడ్‌(టీఎస్‌ఎన్‌పీడీసీఎల్‌).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 157

» **యూనిట్‌ల వారీగా ఖాళీలు:** హన్మకొండ–11, వరంగల్‌–10,జనగాం–08, మహబూబాబాద్‌–08, ప్రొఫెసర్‌ జయశంకర్‌ భూపాలపల్లి–07, కరీంనగర్‌–13, పెద్దపల్లి–10, జగిత్యాల–09, ఖమ్మం–15, భద్రాద్రి కొత్తగూడెం–10, నిజామాబాద్‌–16, కామారెడ్డి–11, ఆదిలాబాద్‌–07, నిర్మల్‌–07, మంచిర్యాల–08, కుమురంభీం–ఆసిఫాబాద్‌–06, కార్పొరేట్‌ ఆఫీస్‌–01.

» **అర్హత:** సీఏ, సీఐఎస్‌ఏ/డీఐఎస్‌ఏ ఉత్తీర్ణులవ్వాలి. ఈఆర్‌పీ/ఎస్‌ఏపీలో పరిజ్ఞానం ఉండాలి. కనీసం 3 ఏళ్ల పని అనుభవం ఉండాలి. **కాంట్రాక్ట్‌ వ్యవధి:** 02 ఏళ్లు.

» **వేతనం:** నెలకు రూ.35,000 చెల్లిస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌(ఆడిట్‌)టీఎస్‌ఎన్‌పీడీసీఎల్, కార్పొరేట్‌ ఆఫీస్, థర్డ్‌ ఫ్లోర్, విద్యుత్‌ భవన్, నక్కలగుట్ట, హన్మకొండ, 506001(తెలంగాణ) సెల్‌ నెం–+91–9440811214చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 23.01.2023.

» **వెబ్‌సైట్‌:** www.tsnpdcl.in

ఐఏసీఎస్, కోల్‌కతాలో 10 ఎంటీఎస్‌ పోస్టులు

కోల్‌కతాలోని ఇండియన్‌ అసోసియేషన్‌ ఫర్‌ ది కల్టివేషన్‌ ఆఫ్‌ సైన్సెస్‌(ఐఏసీఎస్‌) మల్టీ టాస్కింగ్‌ స్టాఫ్‌(ఎంటీఎస్‌) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 10

» **అర్హత:** మెట్రిక్యులేషన్‌/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులవ్వాలి.**వయసు:**18నుంచి 27ఏళ్లు ఉండాలి.

» **వేతనం:** నెలకు రూ.18,000 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్, రాతపరీక్ష, స్కిల్‌/ట్రేడ్‌ టెస్ట్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఇండియన్‌ అసోసియేషన్‌ ఫర్‌ ది కల్టివేషన్‌ ఆఫ్‌ సైన్సెస్‌(ఐఏసీఎస్‌) జదవ్‌పూర్, కోల్‌కతా–700032 చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 31.01.2023.

» **వెబ్‌సైట్‌:** www.iacs.res.in

అవుతారా.. సామాజిక శాస్త్రవేత్త!

» టిస్‌నెట్‌-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» ఆర్ట్స్, హ్యుమానిటీస్‌లలో పీజీ, పీజీ డిప్లొమా కోర్సులు
» ఈ కోర్సులతో ఉపాధి, ఉజ్వల భవిష్యత్తుకు భరోసా

టాటా ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సోషల్‌ సైన్సెస్‌.. సంక్షిప్తంగా టిస్‌! సామాజిక ప్రగతికి దోహదపడే సోషల్‌ వర్క్‌ మొదలు.. గవర్నెన్స్, పాలసీ తదితర వినూత్న విభాగాల్లో.. ప్రత్యేక పీజీ ప్రోగ్రామ్‌లను అందిస్తున్న సంస్థ ఇది! టిస్‌ తనకు దేశవ్యాప్తంగా ఉన్న నాలుగు క్యాంపస్‌ల్లో పీజీ ప్రోగ్రామ్‌ల్లో ఆన్‌లైన్‌ పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశం కల్పిస్తోంది. ఇందుకోసం టిస్‌ నెట్‌-2023 నోటిఫికేషన్‌ విడుదల చేసింది!! దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో.. టిస్‌ ప్రత్యేకతలు, ప్రవేశ ప్రక్రియ వివరాలు, అర్హతలు, పరీక్ష విధానంపై ప్రత్యేక కథనం...



సోషల్‌ సైన్స్‌ కోర్సులు అనగానే టక్కున గుర్తొచ్చే విద్యాసంస్థ.. టాటా ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సోషల్‌ సైన్సెస్‌(టిస్‌). ఈ ఇన్‌స్టిట్యూట్‌ అందించే సోషల్‌ వర్క్, హ్యుమన్‌ రిసోర్సెస్‌ మేనేజ్‌మెంట్‌ పీజీ ప్రోగ్రామ్‌లు ఎంతో ప్రత్యేకమైనవి. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులను సామాజిక ప్రగతిలో పాలుపంచుకునేలా తీర్చిదిద్దుతారు.

4 క్యాంపస్‌లు.. 60 ప్రోగ్రామ్‌లు

- టిస్‌కు ముంబై ప్రధాన క్యాంపస్‌తోపాటు తుల్జాపూర్, హైదరాబాద్, గువహటిల్లోనూ క్యాంపస్‌లు ఉన్నాయి. ఇవి 57 పీజీ ప్రోగ్రామ్‌లు, మూడు పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లు ఇలా మొత్తం 60 ప్రోగ్రామ్‌లు అందిస్తున్నాయి.
- ముంబై క్యాంపస్‌లో పీజీ స్థాయిలో ఎంఏ సోషల్‌ వర్క్‌(క్రిమినాలజీ అండ్‌ జస్టిస్‌), ఎంఏ-అప్లైడ్‌ సైకాలజీ(క్లినికల్‌ అండ్‌ కౌన్సెలింగ్‌ ప్రాక్టీస్‌), ఎంఏ–సోషల్‌ వర్క్‌(పబ్లిక్‌ హెల్త్‌), మాస్టర్‌ ఆఫ్‌ పబ్లిక్‌ హెల్త్, ఎంఏ–సోషల్‌ వర్క్‌(చిల్డ్రన్‌ అండ్‌ ఫ్యామిలీస్‌), మాస్టర్‌ ఆఫ్‌ లైబ్రరీ సైన్స్, మాస్టర్‌ ఆఫ్‌ పబ్లిక్‌ హెల్త్‌(హెల్త్‌ అడ్మినిస్ట్రేషన్‌), మాస్టర్‌ ఆఫ్‌ 'లా'స్‌(యాక్సెస్‌ టు జస్టిస్‌), ఎంఏ–డెవలప్‌మెంట్‌ స్టడీస్, ఎంఏ–మీడియా అండ్‌ కల్చరల్‌ స్టడీస్, ఎంఏ/ఎమ్మెస్సీ (డిజాస్టర్‌ మేనేజ్‌మెంట్‌), ఎంఏ/ఎమ్మెస్సీ(అర్బన్‌ పాలసీ అండ్‌ గవర్నెన్స్‌), ఎంఏ–ఎడ్యుకేషన్, ఎంఏ–సోషల్‌ వర్క్‌(దళిత్‌ అండ్‌ ట్రైబల్‌ స్టడీస్‌ యాక్షన్‌), ఎంఏ–సోషల్‌ వర్క్‌(డిజేబిలిటీ స్టడీస్‌ అండ్‌ యాక్షన్‌), ఎంఏ–ఆర్గనైజేషన్‌ డెవలప్‌మెంట్, ఛేంజ్‌ అండ్‌ లీడర్‌షిప్, ఎంఏ/ఎమ్మెస్సీ(రెగ్యులేటరీ పాలసీ అండ్‌ గవర్నెన్స్‌), ఎంఏ–గ్లోబల్‌ మెంటల్‌ హెల్త్, మాస్టర్‌ ఆఫ్‌ పబ్లిక్‌ హెల్త్‌(సోషల్‌ ఎపిడమాలజీ), ఎంఏ–ఎడ్యుకేషన్‌(ఎడ్యుకేషన్‌ టెక్నాలజీ), ఎంఏ–సోషల్‌ వర్క్‌ (లైవ్‌లీహుడ్‌ అండ్‌ సోషల్‌ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌),ఎంఏ/ఎమ్మెస్సీ(ఎన్విరాన్‌మెంట్‌). తదితర మొత్తం 38 ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.
- **తుల్జాపూర్‌ క్యాంపస్‌లో..** సోషల్‌ వర్క్‌ అండ్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌లో ఎంఏ, డెవలప్‌మెంట్‌ పాలసీ, ప్లానింగ్‌ అండ్‌ ప్రాక్టీస్; సస్టెయినబుల్‌ లైవ్‌లీహుడ్స్‌ అండ్‌ నేచురల్‌ రిసోర్సెస్, సోషల్‌ ఇన్నోవేషన్‌ అండ్‌ ఎంట్రప్రెన్యూర్‌షిప్, గవర్నెన్స్‌లో ఎంఏ /ఎమ్మెస్సీ కోర్సులున్నాయి.
- **గువహటి క్యాంపస్‌లో..** పబ్లిక్‌ హెల్త్, లేబర్‌ స్టడీస్‌ అండ్‌ సోషల్‌ ప్రొటెక్షన్; కమ్యూనిటీ ఆర్గనైజేషన్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ ప్రాక్టీస్; ఎకాలజీ, ఎన్విరాన్‌మెంట్‌ అండ్‌ సస్టెయినబుల్‌ డెవలప్‌మెంట్; లైవ్‌లీహుడ్స్‌ అండ్‌ సోషల్‌ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్; కౌన్సెలింగ్, పీస్‌ అండ్‌ కన్‌ఫ్లిక్ట్‌ స్టడీస్; సోషియాలజీ అండ్‌ సోషల్‌ ఆంత్రోపాలజీ స్పెషలైజేషన్లతో ఎంఏ సోషల్‌వర్క్‌ ప్రోగ్రామ్స్‌ అందుబాటులో ఉన్నాయి.
- **హైదరాబాద్‌ క్యాంపస్‌లో..** పీజీ డిప్లొమా ఇన్‌ సిటీస్‌ అండ్‌ గవర్నెన్స్, పీజీ డిప్లొమా ఇన్‌ పబ్లిక్‌ పాలసీ అండ్‌ గవర్నెన్స్, ఎంఏ(సిటీస్‌ అండ్‌ గవర్నెన్స్‌),ఎంఏ(ఉమెన్‌ స్టడీస్‌), ఎంఏ–ఎడ్యుకేషన్, ఎంఏ–రూరల్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ గవర్నెన్స్, ఎంఏ–పబ్లిక్‌ పాలసీ అండ్‌ గవర్నెన్స్, పీజీ డిప్లొమా ఇన్‌ నేచురల్‌ రిసోర్సెస్‌ అండ్‌ గవర్నెన్స్, ఎంఏ–నేచురల్‌ రిసోర్సెస్‌ అండ్‌ గవర్నెన్స్.

అర్హత

బ్యాచిలర్‌ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కొన్ని ప్రోగ్రామ్‌లకు ప్రత్యేక అర్హతలు నిర్దేశించారు.

ప్రవేశాలు ఇలా

- జాతీయ స్థాయిలో నిర్వహించే టిస్‌–నెట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్‌ చేసి.. తదుపరి దశలో టిస్‌ప్యాట్, పర్సనల్‌ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.
- టిస్‌–నెట్‌ పరీక్షను మొత్తం మూడు విభాగాల్లో వంద మార్కులకు నిర్వహిస్తారు. ఇంగ్లిష్‌ ప్రొఫిషియన్సీ 30 ప్రశ్నలు–30 మార్కులు, మ్యాథమెటిక్స్‌ అండ్‌ లాజికల్‌ రీజనింగ్‌ 30 ప్రశ్నలు–30 మార్కులు, జనరల్‌ అవేర్‌నెస్‌ 40 ప్రశ్నలు–40 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం ఒక గంట 40 నిమిషాలు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్‌ విధానంలోనే జరుగుతుంది.

తదుపరి దశలో టిస్‌-ప్యాట్‌

టిస్‌–నెట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిట్‌ జాబితా రూపొందించి.. తదుపరి దశలో ప్రోగ్రామింగ్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌(పీఏటీ)ను నిర్వహిస్తారు. ఇది ఆన్‌లైన్‌ విధానంలో 50 మార్కులకు రెండు విభాగాలుగా ఉంటుంది. అభ్యర్థులు ఎంచుకున్న స్పెషలైజేషన్‌కు అనుగుణంగా పరీక్షలో ప్రశ్నలు ఉంటాయి. టిస్‌ ప్యాట్‌ సెక్షన్‌–ఎలో ప్యాసేజ్‌ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి. ఒక ప్యాసేజ్‌ ఇచ్చి దానికి సంబంధించి అడిగే మూడు ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మొత్తం 30 మార్కులకు సెక్షన్‌–ఎలో పరీక్ష ఉంటుంది. సెక్షన్‌–బిలో ఒక ఎస్సే రాయాల్సి ఉంటుంది. దీనికి కేటాయించిన మార్కులు 20. ఇలా మొత్తం 50 మార్కులకు టిస్‌ ప్యాట్‌ను నిర్వహిస్తారు. కొన్ని స్పెషలైజేషన్లకు సెక్షన్‌–ఎలోనే ఎస్సే రైటింగ్, సెక్షన్‌–బిలో స్టేట్‌మెంట్‌ ఆఫ్‌ పర్పస్‌ రాయాల్సి ఉంటుంది.

పర్సనల్‌ ఇంటర్వ్యూ

- ఎంపిక ప్రక్రియలో చివరి, మూడో దశలో పర్సనల్‌ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ ప్రక్రియ 20 నుంచి 30 నిమిషాల వ్యవధిలో ఉంటుంది. ఆయా కోర్సులను అభ్యసించేందుకు అభ్యర్థుల కున్న ఆసక్తి, సరితూగే తత్వాన్ని పరీక్షిస్తారు. ముగ్గురు సభ్యుల కమిటీ ఈ ప్రక్రియ నిర్వహిస్తుంది. ఇందులో అభ్యర్థుల నైపుణ్యాలు, ఆసక్తి, సన్నద్ధత తదితర అంశాలను పరిశీలిస్తారు. ఈ మూడు దశల్లోనూ విజయం సాధిస్తే సీటు ఖరారు చేస్తారు.

వెయిటేజీ విధానం

- మొత్తం మూడు దశలుగా ఉండే ఎంపిక ప్రక్రియలో భాగంగా.. తుది విజేతలను ఖరారు చేసేందుకు ఆయా దశల్లో చూపిన ప్రతిభకు వెయిటేజీ ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నారు.
- టిస్‌–నెట్‌కు 50 శాతం వెయిటేజీ, ఆన్‌లైన్‌ అసెస్‌మెంట్‌ టెస్ట్‌కు 20 శాతం వెయిటేజీ, పర్సనల్‌ ఇంటర్వ్యూకు 30శాతం వెయిటేజీ కల్పిస్తున్నారు.
- హ్యూమన్‌ రిసోర్స్‌ మేనేజ్‌మెంట్‌ అండ్‌ లేబర్‌ రిలేషన్స్‌; ఆర్గనైజేషనల్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ ఛేంజ్‌ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రెండో దశలో ప్రోగ్రామింగ్‌ ఆప్టిట్యూడ్‌కు బదులు ప్రత్యేకంగా నిర్వహించే మేనేజ్‌మెంట్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌(టిస్‌ మ్యాట్‌)కు హాజరవ్వాల్సి ఉంటుంది.
- 45 నిమిషాల వ్యవధిలో ఉండే టిస్‌ మ్యాట్‌లో.. మూడు విభాగాల్లో (కాంప్రహెన్షన్‌ - 10 ప్రశ్నలు, బిజినెస్‌ అవేర్‌నెస్‌–10 ప్రశ్నలు, మేనేజ్‌మెంట్‌ డేటా ఇంటర్‌ప్రిటేషన్‌ –15 ప్రశ్నలు) పరీక్ష ఉంటుంది. ఈ మూడు విభాగాల నుంచి ఆబ్జెక్టివ్‌ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. దీంతోపాటు డిస్క్రిప్టివ్‌ రైటింగ్‌ పేరుతో ఒక ఎస్సే రాయాల్సి ఉంటుంది. దీనికి 16 మార్కులు కేటాయించారు. ఇలా మొత్తం 50 మార్కులకు టిస్‌–మ్యాట్‌ ఉంటుంది.

ఉజ్వల కెరీర్స్‌

టిస్‌లో పీజీ ప్రోగ్రామ్‌లు పూర్తి చేసుకున్న విద్యార్థులకు క్యాంపస్‌ రిక్రూట్‌మెంట్‌ డ్రైవ్స్‌తోనే కెరీర్‌ అవకాశాలు లభిస్తున్నాయి. కార్పొరేట్‌ కొలువులు సొంతమవుతున్నాయి. యూనిసెఫ్, యూఎన్‌డీపీ వంటి ఐక్యరాజ్యసమితి అనుబంధ విభాగాలతోపాటు సేవ్‌ చిల్డ్రన్, ప్రదాన్‌ వంటి సామాజిక సేవా సంస్థల్లో కొలువులు లభిస్తున్నాయి. వీటితో పాటు రిలయన్స్‌ ఫౌండేషన్, కేపీఎంజీ, టాటా క్లాస్‌ ఎడ్జ్, పీడబ్ల్యూసీ, ఉబెర్‌ వంటి కార్పొరేట్‌ సంస్థలు సైతం క్యాంపస్‌ రిక్రూట్‌మెంట్‌ డ్రైవ్స్‌లో పాల్గొని ఆఫర్లు ఖరారు చేస్తున్నాయి. సగటున రూ.5 లక్షల వార్షిక వేతనం లభిస్తోంది.

సిలబస్‌ అంశాలు ఇవే

- **ఇంగ్లిష్‌ ప్రొఫిషియన్సీ:** అభ్యర్థుల్లోని ఇంగ్లిష్‌ నైపుణ్యాలను పరిశీలించే ఈ విభాగంలో రాణించడానికి సెంటెన్స్‌ కరెక్షన్, అనాలజీస్, సినానిమ్స్, యాంటానిమ్స్, గ్రామర్, వెర్బల్‌ రీజనింగ్, రీడింగ్‌ కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి.
- **మ్యాథమెటికల్‌ అండ్‌ లాజికల్‌ రీజనింగ్‌:** ఈ విభాగంలో మెరుగైన మార్కులు సాధించడానికి అర్థమెటిక్, జామెట్రీ, ట్రిగ్నోమెట్రీ, స్టాటిస్టిక్స్, నంబర్‌ సిరీస్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్‌ రీజనింగ్‌లను ప్రాక్టీస్‌ చేయాలి.
- **జనరల్‌ అవేర్‌నెస్‌:** ఈ విభాగానికి సంబంధించి రాజకీయాలు, సోషల్‌ స్టడీస్, సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్, స్పోర్ట్స్, ఆర్ట్‌ అండ్‌ కల్చర్, భారత చరిత్ర అంశాలపై దృష్టి పెట్టాలి.
- ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్‌కు సంబంధించి అభ్యర్థులు పదో తరగతి స్థాయి పుస్తకాలను అభ్యసనం చేయడం ద్వారా అవగాహన పొందొచ్చు.
- జనరల్‌ అవేర్‌నెస్‌కు సంబంధించి సమకాలీన అంశాలు, 12వ తరగతి వరకు ఎన్‌సీఈఆర్‌టీ సోషల్‌ పుస్తకాలను అధ్యయనం చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

టిస్ -నెట్‌-2023 ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
- **ఆన్‌లైన్‌ దరఖాస్తు చివరి తేదీ:** 2023, జనవరి 15
- **టిస్‌–నెట్‌ ఆన్‌లైన్‌ టెస్ట్‌ తేదీలు:** 2023 జనవరి 28- 2023 ఫిబ్రవరి 28.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విశాఖపట్నం, హైదరాబాద్‌
- **వెబ్‌సైట్‌:** https://admissions.tiss.edu


సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా



చూడు కొంగ బావా.. ముందు చూపు ఉండాలి.. కానీ.. అప్పుడప్పుడు వెనుక వైపు కూడా ఓ లుక్కేసుకోవాలి.. ఇప్పుడు చూడు ఏమైందో.. ఇంతకీ ఏమైంది.. ఏమో మరి.. ఈ ఫొటో తీసిన జీన్ జాక్వస్(ఫ్రాన్స్) ఆ విషయాన్ని చెప్పలేదు మరి.. కొంగను మింగేస్తున్నట్లు ఉన్న ఈ నీటి గుర్రం ఫొటో కామెడీ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ 2022 అవార్డుల్లో 'స్పెక్ట్రం ఫొటో క్రీచర్స్ ఆఫ్ ద ఎయిర్' విభాగంలో మొదటి ప్రైజును గెలుచుకుంది..



ఏ విషయంలో గొడవొచ్చిందో తెలియదు గానీ.. ఇక నుంచి నీకు నాకు కచ్చి అని అనేసుకున్నాయి ఈ రెండు పెంగ్విన్‌లు.. ఆ సమయంలో అక్కడే ఉన్న జెన్నిఫర్ హాడ్లీ అనే ఫొటోగ్రాఫర్ ఈ సీన్‌ను క్లిక్‌మనిపించారు. రెండింటి మధ్య మళ్లీ ఫ్రెండ్‌షిప్ కోసం జెన్నిఫర్ ట్రై చేశారు గానీ.. వర్కవుట్ కాలేదట. అయితే, ఈ ఫొటో మాత్రం వర్కవుట్ అయింది. కామెడీ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పోటీల్లో పీపుల్స్ చాయిస్ అవార్డును కైవసం చేసుకుంది



ఈ కోతికి కొంచెం యాక్టింగ్ పిచ్చి.. ఎప్పటికైనా సినిమాల్లో స్టార్ అయిపోవాలని కలలుగంటోంది..పైగా.. చావు సీన్లలో యాక్ట్ చేయడంలో స్పెషలైజేషన్ కూడా ఉంది. ఎంతలా అంటే యాక్టింగా.. లేక నిజంగానే చచ్చిందా అన్నది సాటి కోతులు కూడా కనిపెట్టలేవు. ఫొటోగ్రాఫర్ ఫెడ్రికా (ఇటలీ) కూడా చనిపోయిందనే అనుకున్నారు. ఇంతలో ఎవరు కట్ అన్నారో తెలియదుగానీ.. చటుక్కున లేచి కూర్చుందట. వైల్డ్ లైఫ్ కామెడీ అవార్డ్స్ జ్యూరీ మెచ్చిన చిత్రమిది.



ఈ గద్ద.. మెస్సీ ఫ్యాన్ అట. ఈ మధ్యే ఫిఫా వరల్డ్ కప్ చూసొచ్చింది. అప్పటి నుంచీ ఇదే వరుస. గోల్ మీద గోల్ కొట్టేస్తోంది. ఏమో.. ఎప్పుడైనా తమ గద్దల్లోనూ ఫుట్ బాల్ పోటీపెడితే.. పనికివస్తుందని ఇప్పటి నుంచే తెగ ప్రాక్టీస్ చేస్తోంది. జియా చెన్ తీసిన ఈ చిత్రం కామెడీ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పోటీల్లో అమేజింగ్ ఇంటర్నెట్ పోర్ట్‌ఫోలియో పురస్కారాన్ని గెలుచుకుంది.

– సాక్షి సెంట్రల్‌డెస్క్


క్లుప్తంగా...

బీడీఎల్ టెక్నికల్ విభాగం డైరెక్టర్‌గా మాధవరావు



సాక్షి, హైదరాబాద్: భారత్ డైనమిక్స్ లిమిటెడ్ టెక్నికల్ డైరెక్టర్‌గా రిటైర్డ్ కమోడోర్ ఎ.మాధవ రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బీడీఎల్ కంచన్‌బాగ్ యూనిట్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన మాధవరావు టెక్నికల్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. బీడీఎల్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పలు కీలక ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్ అండ్‌డీ పనుల్లో ఆయన ముఖ్యులుగా ఉన్నారు. బీడీఎల్‌లో చేరకముందు భారత నౌకాదళంలో విధులు నిర్వర్తించారు. నౌకాదళంలో మూడు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో కార్గిల్, పరాక్రమ్ ఆపరేషన్స్‌లో, భారత నేవీలోకి న్యూక్లియర్ సబ్ మెరైన్స్‌ను విశాఖపట్నంలో ప్రవేశపెట్టడంలో కీలకపాత్ర పోషించారు. నావల్ డాక్‌యార్డ్‌ల ఆధునీకరణలోనూ మాధవరావుది ప్రముఖ పాత్ర.

ద.మ. రైల్వే అదనపు జనరల్ మేనేజర్‌గా ఉదయ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్‌గా ఉదయ్‌కుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వేస్ సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ 1986 బ్యాచ్‌కు చెందిన ఆయన ఇప్పటి వరకు చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. 1983లో జమాల్‌పూర్‌లో స్పెషల్ క్లాస్ రైల్వే అప్రెంటిస్‌గా రైల్వేలో చేరిన ఆయన పలు జోన్లలో వివిధ పోస్టుల్లో పనిచేశారు.

కొత్తగా 14 కరోనా పాజిటివ్ కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సోమవారం 6,408 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, అందులో 14 మంది వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి 12 మంది కోలుకోగా, ఇప్పటివరకు కోలుకున్న వారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 64 మంది ఐసోలేషన్ లేదా చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు. కాగా, రాష్ట్రంలో సోమవారం 1,857 మందికి కరోనా వ్యాక్సిన్లు ఇచ్చారు.అందులో బూస్టర్ డోసు 1,448 మందికి వేయగా, రెండోడోసు 237 మంది, మొదటి డోసు 172 మందికి వేసినట్లు ఆయన తెలిపారు.

శాటిలైట్ రిమోట్ సెన్సింగ్ సిస్టంతో రోడ్ల మ్యాపింగ్

ట్రాక్ సంస్థ ఏడీజీతో బోయినపల్లి వినోద్ భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రోడ్లన్నింటినీ శాటిలైట్ రిమోట్ సెన్సింగ్ సిస్టంతో మ్యాపింగ్ చేయనున్నట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం బంజారాహిల్స్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆయన తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ (ట్రాక్) అదనపు డైరెక్టర్ జనరల్ జి.శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలోని సైంటిస్టులు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పంచాయతీరాజ్, రోడ్లు–భవనాలు, స్టేట్ హైవేస్, నేషనల్ హైవేస్‌ను మ్యాపింగ్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రోడ్ల పొడవు, వెడల్పు స్థితిగతులు, కల్వర్టులు, బ్రిడ్జిల ఆవశ్యకతను శాటిలైట్ రిమోట్ సెన్సింగ్ సిస్టం ద్వారా మ్యాపింగ్ చేయనున్నట్లు చెప్పారు. 'ట్రాక్'లో రోడ్ల రికార్డులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో డబుల్ రోడ్లు, నాలుగు లేన్ల రోడ్లు ఉన్నాయని, అలాగే ప్రతి గ్రామానికి రోడ్డు కనెక్టివిటీ సౌకర్యం ఉందన్నారు. భవిష్యత్తులో షార్ట్ కట్ రోడ్స్ కనెక్టివిటీ సిస్టం కోసం శాటిలైట్ మ్యాపింగ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. నిర్ణీత గడువులోగా రోడ్ల శాటిలైట్ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ట్రాక్ సంస్థ ఏడీజీ శ్రీనివాస్ రెడ్డితోపాటు అధికారులు పాల్గొన్నారు.

ఆఫీసు వేళలు మారాలి పని విధానంలోనూ మార్పులు కావాలి



కోరుకుంటున్న మెజారిటీ ఉద్యోగులు
- అందుకు యాజమాన్యం ఒప్పుకుంటే జీతాలు తగ్గించుకునేందుకు కూడా ఓకే
- సంప్రదాయ 'నైన్ టు ఫైవ్' టైమింగ్స్ స్థానంలో మరింత వినూత్న ప్రత్యామ్నాయాలు కోరుతున్న తీరు...
- వర్క్ ఫ్రం హోంకే చాలామంది మొగ్గు
- 'పీపుల్స్ ఎట్ వర్క్ 2022 @ ఏ గ్లోబల్ వర్క్‌ఫోర్స్ వ్యూ'లో వివిధ అంశాలు వెల్లడి..

సాక్షి, హైదరాబాద్

ఉద్యోగులు ప్రస్తుతం మారుతున్న కాలాన్ని బట్టి తమ రోజువారీ విధులు, వృత్తిగత జీవితంలో గుణాత్మక మార్పులు కోరుకుంటున్నారు. ఆఫీస్ వేళలు–పనివిధానంలో మార్పులు జరగాలని భారత్‌లోని మెజారిటీ ఎంప్లాయిస్ గట్టిగా అభిలషిస్తున్నారు. కార్యాలయ పనివేళల నియమాలు అనేవి తాము కోరుకున్నట్టుగా రూపొందించేందుకు యాజమాన్యాలు ఒప్పుకుంటే జీతాలు తగ్గించుకోవడమే కాదు ఇతర అంశాల్లోనూ రాజీపడేందుకు సిద్ధమంటున్నారు.

→ మొత్తంగా 17 దేశాల్లోని 33 వేలమంది ఉద్యోగులపై నిర్వహించిన సర్వే అధారంగా... ఏడీపీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ 'పీపుల్స్ ఎట్ వర్క్ 2022 @ ఏ గ్లోబల్ వర్క్‌ఫోర్స్ వ్యూ' ఓ నివేదికను రూపొందించింది. ఇందులో అనేక ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. పనిగంటల్లో, విధులు నిర్వహించే విధానంలో వెసులుబాటు ఉండాలని ప్రతి పది మందిలో ఏడుగురు కోరుకున్నట్టు తేలింది. రోజూవారీ చేసే పనిగంటలపై తమకు పూర్తి పట్టు ఉండాలని భారత్‌లోని 76.07 శాతం ఉద్యోగులు స్పష్టం చేశారు. వర్క్ ఫ్రం హోం లేదా ఇల్లు, ఆఫీసుల మధ్య ఎంచుకునే అవకాశం, వారంలో సగం రోజులు ఆఫీసు, సగం రోజులు ఇంటి నుంచి పనిచేసే వెసులుబాటు కల్పిస్తే తమకిచ్చే జీతంలో కొంత తగ్గించుకునేందుకు, ఇతర అలవెన్సుల్లో రాజీపడేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పూర్తిస్థాయిలో ఆఫీసు నుంచే పనిచేయాలని యాజమాన్యాలు స్పష్టం చేస్తున్న పక్షంలో కొత్త కొలువులు వెతుక్కుంటామంటూ 76.38 శాతం భారత ఉద్యోగులు పేర్కొన్నట్టు ఈ రిపోర్ట్ తెలిపింది. వర్క్ ఫ్రంహోం సందర్భంగా తమ సేవలను మంచి గుర్తింపు లభించిందని 73 శాతం, నైపుణ్యాల మెరుగు, శిక్షణా అవసరాలు వంటి వాటిపై యాజమాన్యాలతో చర్చించగలిగామని 74 శాతం చెబుతున్నారు. మానసిక ఒత్తిళ్లను అధిగమించేందుకు, మెంటల్ హెల్త్‌ను కాపాడుకునేందుకు ఇంటినుంచి పనిచేయడం ఉపయోగపడిందని 56 శాతం అభిప్రాయపడ్డారు. సాంప్రదాయ 'నైన్ టు ఫైవ్'ఉద్యోగుల టైమింగ్స్ స్థానంలో సృజనాత్మకతతో కూడిన మరింత వినూత్న ప్రత్యామ్నాయాలను వారు కోరుకుంటున్నారు.

→ కోవిడ్ మహమ్మారి కాలంలో తీవ్రమైన మానసిక సంఘర్షణ, ఒత్తిళ్లను ఎదుర్కొన్నందున చేసే ఆఫీసుపని– గడిపే రోజూవారీ జీవితం మధ్య మంచి సమతూకంతో పాటు ఒత్తిళ్లు లేని పనివిధానం కోరుకుంటున్నారు'అని ఏడీపీ సౌతీస్ట్ ఏషియా, ఇండియా ఎండీ రాహుల్ గోయల్ చెప్పారు. గతంలో ఆచరణ సాధ్యం కాదని భావించిన వారానికి 4 రోజుల పని విధానం అమలు, ఇంటి నుంచి పనిచేసే సౌలభ్యం కల్పించడం ద్వారా ఆయారంగాల్లోని ఉత్తమ నైపుణ్యాలున్న ఉద్యోగులను ఆకర్షించే అవకాశముందని గోయల్ అభిప్రాయపడ్డారు.

ఐటీ అనే కాదు ఇతర రంగాల్లోనూ ఇదే పరిస్థితి



ఐటీ అనే కాకుండా అన్ని రంగాల ఉద్యోగులు ఫ్లెక్సిబుల్ టైమింగ్స్ కోరుకుంటున్నారు. జాబ్ ఇంటర్వ్యూలప్పుడే జీతం ప్యాకేజీ కంటే కూడా వర్క్ ఫ్రం హోం, హైబ్రిడ్ వర్కింగ్ ఇస్తేనే చేరతామంటున్నారు. కోవిడ్ పరిస్థితుల కారణంగా తమకు తోచిన పద్ధతుల్లో పనివేళలు అడుగుతున్నారు. కనీసం వారానికి రెండురోజులైనా ఇంటినుంచి పని విధానం ఉందా లేదా అని ఆరాతీస్తున్నారు. ట్రైనీలు, ఎంట్రీ లెవల్ ఎంప్లాయిస్ కూడా దీనినే కోరుతున్నారు.

– డా. బి. అపర్ణరెడ్డి, హెచ్‌ఆర్ నిపుణురాలు

ఆ స్టీల్ వంతెన బరువు 1,100 టన్నులు


రాజీవ్ రహదారిపై సిద్దిపేట వైపు అమర్చిన బో స్ట్రింగ్ గర్డర్

రాజీవ్ రహదారిపై 'బో స్ట్రింగ్ గర్డర్' రైల్వే వంతెన
- కుకునూరుపల్లి శివారులో నిర్మాణం
- సిద్దిపేట వైపు దారిలో బిగింపు ప్రారంభం
- హైదరాబాద్ దారిలో ఏర్పాటుకు కసరత్తు

సాక్షి, హైదరాబాద్: మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే మార్గంలో రాజీవ్ రహదారిపై ధనుస్సు ఆకారంలో ఉండే ఓ స్టీల్ వంతెన రూపుదిద్దుకుంటోంది. తొలుత ఈ మార్గంలో గజ్వేల్ ఔటర్ రింగురోడ్డుపై ఓ వంతెన నిర్మించగా, ఇప్పుడు దానికంటే మరింత పెద్దదైన ఈ వంతెనను సిద్దిపేట మార్గంలో కుకునూరుపల్లి శివారులో దక్షిణ మధ్య రైల్వే చేపట్టింది. గజ్వేల్ దాటిన తర్వాత కుకునూరుపల్లి పొలిమేరలో రాజీవ్ రహదారిని మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్ దాటుతుంది. మనోహరాబాద్–కొత్తపల్లి సింగిల్‌లైన్ భవిష్యత్తులో మరో రెండు లైన్లకు విస్తరించాల్సి ఉంటుందని రైల్వే శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో మూడు లైన్లకు వీలుగా 'బో స్ట్రింగ్ గర్డర్'పద్ధతిలో నిర్మిస్తోంది. ఇది కాంక్రీట్‌తో సంబంధం లేకుండా పూర్తిగా స్టీల్‌తో రూపొందుతోంది. 60 మీటర్ల పొడవు, 15 మీటర్ల వెడల్పు, 10.5 మీటర్ల ఎత్తుతో ఉండే భారీ స్టీల్ వంతెనను రోడ్డుతో అనుసంధానిస్తారు. ఇలా హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు దారిలో ఒకటి, సిద్దిపేట నుంచి హైదరాబాద్ దారిలో మరోటి ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం సిద్దిపేట వైపు దారిలో దాన్ని బిగిస్తున్నారు. ఒక్కోటి 550 టన్నుల బరువుండే స్టీల్‌తో రూపొందించారు.

నెలలోగా పూర్తి..

సిద్దిపేట వైపు ఉన్న రోడ్డులో ధనుస్సు ఆకారంలో ఉండే స్టీల్ గర్డర్ ఏర్పాటు పూర్తయింది. దానిమీద 8 ఎంఎం మందంతో స్టీల్ షీట్ అమర్చే పని జరుగుతోంది. రెండురోజుల తర్వాత దానిమీద 250 ఎంఎం మందంతో సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మిస్తారు. నెలరోజుల్లోగా ఈ మార్గంలో వాహనాలకు అనుమతిస్తారు. సిద్దిపేట –హైదరాబాద్ రోడ్డు భాగంలో రెండో గర్డర్ రెండు వైపులా రెండు అండర్ పాస్‌లు నిర్మిస్తున్నారు. వంతెన మీద నుంచి వాహనాలు కిందకు రావటానికి, కిందినుంచి వంతెన మీదకు వెళ్లేందుకు వీలుగా వాటిని నిర్మిస్తున్నారు. గజ్వేల్ శివారులో ఔటర్ రింగురోడ్డును క్రాస్ చేసేందుకు వీలుగా ఇదే పద్ధతిలో చిన్న పరిమాణంలో ఉండే బో స్ట్రింగ్ గర్డర్‌లతో వంతెన నిర్మాణం పూర్తయింది. దానికి అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది.


వంతెన పైభాగంలో సిమెంట్ కాంక్రీట్ రోడ్డు వేసేందుకు అమర్చిన 8 ఎంఎం స్టీల్‌షీట్‌పై పనులు

సిద్దిపేట వద్ద బాక్స్ బ్రిడ్జ్..

కుకునూరుపల్లి వద్ద రైల్వే లైన్ రాజీవ్ రహదారిని క్రాస్ చేస్తుండగా, మళ్లీ సిద్దిపేట బైపాస్ దాటగానే మరోసారి క్రాస్ చేస్తుంది. అక్కడ కూడా వెంతెన నిర్మించాల్సి ఉంది. అయితే అక్కడ, రైల్వే లైన్ రోడ్డు పై నుంచి నిర్మిస్తారు. ఇందుకుగాను నగరంలోని ఒలిఫెంటా వంతెన తరహాలో బాక్సు నమూనా వంతెన నిర్మించనున్నారు. సిమెంట్ క్రాంక్రీట్ ప్రీ ఫ్యాబ్రికేటెడ్ బాక్సు రూపొందించి దాని పీదుగా రైల్వే లైన్ దాటేలా ఏర్పాటు చేస్తారు.

డీజే ముసుగులో డ్రగ్ పెడ్లింగ్

- ఎన్సీబీకి పట్టుబడిన మోహిత్ అగర్వాల్
- అతడు సినీనటి నేహా దేశ్‌పాండే భర్త
- దేశంలోనే పేరున్న డీజే నిర్వాహకుడు
- డ్రగ్ డాన్ ఎడ్విన్‌తోనూ సంబంధాలు



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే ఘరానా ఈవెంట్ల డీజే సప్లయర్ మోహిత్ అగర్వాల్ అలియాస్ మైరోన్ మోహిత్‌ను డ్రగ్స్ కేసులో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) అధికారులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. ఆయన భార్య నేహా దేశ్‌పాండే పలు టాలీవుడ్, బాలీవుడ్ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించారు. అతడు డీజే నిర్వాహకులతోపాటు ఈవెంట్లలో మాదకద్రవ్యాలు సరఫరా చేసేవాడని, గోవాకు చెందిన డ్రగ్స్ డాన్ ఎడ్విన్ నుంచి వీటిని ఖరీదు చేసేవాడని అధికారులు గుర్తించారు. హైదరాబాద్ కొండాపూర్ ప్రాంతానికి చెందిన మోహిత్ 2014లో 'ది అన్‌స్క్రిప్టెడ్'పేరుతో సంస్థను ఏర్పాటు చేసి హైదరాబాద్, ముంబై, గోవా, బెంగళూరుల్లో జరిగే అనేక ఈవెంట్లు, పబ్స్‌కు డీజేలు సరఫరా చేస్తున్నాడు. గోవాలో సన్‌బర్న్ బీచ్ క్లబ్ సహా అనేక భారీ ఈవెంట్స్ నిర్వహించాడు. ఆయా పబ్స్ నిర్వాహకులతో కలిసి వాటిలో ప్రత్యేకంగా రేవ్ పార్టీలు నిర్వహించే వాడు. దీనికోసం ఎడ్విన్‌సహా దాదాపు 50 మంది డ్రగ్ పెడ్లర్లతో సంబంధాలు ఏర్పాటు చేసుకుని వారి నుంచే కొకైన్ ఖరీదు చేసి సరఫరా చేసేవాడు.

'క్రూయిజ్'లో ఆధారాల్లేక..

గతేడాది అక్టోబర్ 2న ఎన్సీబీ అధికారులు ముంబై క్రూయిజ్ డ్రగ్ పార్టీపై దాడి చేసి షారూక్ ఖాన్ కుమారుడు ఆర్యన్‌ఖాన్ సహా పలువురిని డ్రగ్స్ కేసులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో మోహిత్ కూడా అదే క్రూయిజ్‌లో ఉన్నా ఇతడి వద్ద ఎలాంటి డ్రగ్స్ దొరక్కపోవడం, ఆర్యన్‌తో సంబంధాలపై ఆధారాలు లేకపోవడంతో అధికారులు విడిచిపెట్టారు. గోవాకు చెందిన డ్రగ్స్ డాన్ ఎడ్విన్‌ను హెచ్–న్యూ అధికారులు గతేడాది నవంబర్ 5న అరెస్టు చేసి విచారించగా మోహిత్ పేరు వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న అతడు గోవా, ముంబైల్లో తలదాచుకున్నాడు. హెచ్–న్యూ ఇన్‌స్పెక్టర్ పి.రాజేశ్ నేతృత్వంలోని బృందం అతడి కోసం వివిధ ప్రాంతాల్లో గాలించింది.

'డిసెంబర్ 31'న గోవాలో తప్పించుకున్నా...

మోహిత్ 'డిసెంబర్ 31'న గోవాలో రూ.2 కోట్లు వెచ్చించి భారీ ఈవెంట్ నిర్వహించినట్లు సమాచారం అందుకున్న హెచ్–న్యూ బృందం అక్కడికి వెళ్లగా తృటిలో తప్పించుకుని విమానంలో హైదరాబాద్ వచ్చేశాడు. వేట కొనసాగించిన హెచ్–న్యూ ఎట్టకేలకు అతడిని పట్టుకుంది. అతడి వద్ద నుంచి గ్రాము కొకైన్ స్వాధీనం చేసుకుంది. రామ్‌గోపాల్‌పేట ఠాణాలో ఉన్న ఎడ్విన్ కేసులోనూ రిమాండ్‌కు తరలించింది. విచారణలో నగరానికి చెందిన అనేక మంది సినీ, రాజకీయ ప్రముఖులతో అతడికి ఉన్న సంబంధాలు బయటపడ్డాయి. అయితే వారిలో ఎందరు డ్రగ్స్ ఖరీదు చేశారు? ఏఏ పబ్స్ నిర్వాహకులతో అతడికి ఒప్పందాలు ఉన్నాయనే వివరాల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. దీనికోసం వారం రోజులు తమ కస్టడీకి అప్పగించాల్సిందిగా కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. డ్రగ్స్ దందాలో మోహిత్ భార్య నేహా దేశ్‌పాండేకు ఏమైనా లింకు ఉందా? అనే అంశాన్నీ పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నేహా దేశ్‌పాండే 'ది కిల్లర్, దిల్ దివానా, బెల్స్'తదితర సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు.

నిరుద్యోగ రేటులో జాతీయ సగటుకన్నా మెరుగ్గా రాష్ట్రం



సాక్షి, న్యూఢిల్లీ: నిరుద్యోగానికి సంబంధించి జాతీయ సగటు కంటే రెండు తెలుగు రాష్ట్రాలు కాస్త మెరుగ్గా ఉన్నాయి. దేశవ్యాప్తంగా నిరుద్యోగ రేటు 2022 డిసెంబర్ నాటికి 8.30 శాతంగా నమోదవగా అదే కాలానికి తెలంగాణలో నిరుద్యోగ రేటు సగటున 4.1 శాతంగా నమోదైనట్లు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) పేర్కొంది. మరోవైపు ఏపీ లో గతేడాది డిసెంబర్‌లో నిరుద్యోగ రేటు సగటున 7.7% నమోదైందని తెలిపింది. అదే కాలానికి నిరుద్యోగ రేటు అత్యధికంగా హరియాణాలో 37.4%, రాజస్తాన్‌లో 28.5%, ఢిల్లీలో 20.8 శాతంగా నమోదైనట్లు సీఎంఐఈ వివరించింది.

ఎట్ల రిజిస్ట్రేషన్ చేస్తావో.. చూస్తా!

రియల్టర్‌కు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హెచ్చరిక
- వారి ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్
- ఎమ్మెల్యేతో సత్సంబంధాలు ఉన్నాయి: రియల్టర్
- నేను బెదిరించలేదు: ఎమ్మెల్యే బాపురావు

సాక్షి, ఆదిలాబాద్: ప్లాట్ల కొనుగోలు, డబ్బులు ముట్టజెప్పే వ్యవహారంలో ఓ రియల్టర్, ఆదిలాబాద్ జిల్లా బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మధ్య జరిగిన ఆడియో సంభాషణ సంచలనం రేపింది. ఏడాది క్రితం జరిగిందని ఎమ్మెల్యే చెబుతున్నా.. ఇటీవలే ఆ ప్లాట్ల వ్యవహారం జరిగినట్టుగా చర్చ సాగుతోంది. ఆ రియల్టర్ నిర్మల్ జిల్లా భైంసా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా, హైదరాబాద్‌లో ప్రైవేట్ హాస్పిటల్ నిర్వహిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్ అని ప్రచారం సాగుతోంది. రియల్టర్ కిరణ్‌కుమార్ బోథ్‌లో కొన్నేళ్ల క్రితం చేసిన లేఅవుట్‌లో కొన్ని ప్లాట్లను కొనుగోలు చేసిన ఎమ్మెల్యే బాపురావు డబ్బులు చెల్లించలేదని చెప్పుకుంటున్నారు. డబ్బుల విషయంలో వారిద్దరి మధ్య ఓ మధ్యవర్తి ఉండటం, రియల్టర్ ఆ మధ్యవర్తిపై ఒత్తిడి తేవడం, దీంతో ఎమ్మెల్యే నేరుగా ఫోన్‌లో సంభాషించినట్లుగా వ్యవహారం సాగింది. ప్రధానంగా డబ్బులు ఇవ్వకపోవడంతో ఆ ప్లాట్లను ఇతరులకు అమ్మేందుకు ఇటీవల ప్రయత్నాలు చేయగా, ఈ వివాదం చోటుచేసుకుందని అంటున్నారు.



రియల్టర్, ఎమ్మెల్యే మధ్య సంభాషణ ఇలా..

ఎమ్మెల్యే: ఎవరో వచ్చి ప్లాట్ చూస్తున్నారటా.. ధన్నూరోల్లటా (బోథ్ మండలం ధన్నూర్ గ్రామస్తులు)..

రియల్టర్: చూస్తారు కదా సార్.. ఏడాదిన్నర, రెండేళ్ల టైం ఇచ్చిన తర్వాత డబ్బులు రాకుంటే నా దగ్గర కూడా పైసల్లేవు కదా సార్.

ఎమ్మెల్యే:ఔనండి.. ఉంటాయి పైసలు ఉంటాయి.. దునియ కూడా ఉంటది.

రియల్టర్: ఏం సర్.. సంవత్సరాల కొద్దీ పేమెంట్ ఆగుతద.

ఎమ్మెల్యే:లెక్కతో లెక్క చేసుకోవాలి కానీ.. లేనిపోని లొల్లి పెట్టుకోకండి..

రియల్టర్: ఎవరు పెడుతున్నరు సార్ లొల్లి.. రమ్మని అంటున్న కద సార్ ఆయన్ని (మధ్యవర్తిని).. లెక్క చేద్దామని, నేను పది సార్ల పోయిన ఆయన దగ్గరికి..

ఎమ్మెల్యే:కండిషన్ పెడుతున్నవట కదా.. రూ.28 లక్షలు నెట్ క్యాష్ తీసుకొని రా అంటున్నవట కదా.

రియల్టర్: నెట్‌కాదు సార్.. ఫస్ట్ నా దగ్గరికి రా అన్న.. ఆయన మాటిమాటికి మీదగ్గరే వస్తున్నడు.

ఎమ్మెల్యే: ఔనండి నేను పైసలు ఇయ్యాల కదా..

రియల్టర్: మరి ఇచ్చేయండి ఆయనకి.. మీరిచ్చేస్తే ఆయన నాకు తెచ్చి ఇస్తాడేమో.. నేను మిమ్మల్ని అడగట్లే.

ఎమ్మెల్యే: నువ్వు బోథ్‌లో ఎట్ల ఉంటావో నేను చూస్తా.

రియల్టర్: సరే సార్ నేను దందానే చేస్తలేను. మీ ఇష్టం. మీరు అట్ల అంటే దానికి ఏం చేయలేను నేను.

ఎమ్మెల్యే: బోథ్‌లో ఎట్ల లేఅవుట్ తీసినవో, ఎట్ల చేసినవో.. పోనియ్యు అని మేము అడుగుతలేం. బోథ్‌కు రా నువ్వు ఎట్ల రిజిస్ట్రేషన్ చేస్తావో చూస్తా నేను.

రియల్టర్: సరే దాందేముంది.. ఎప్పుడు రమ్మంటారో చెప్పండి..

ఆ వాయిస్ నాది కాదు

ఎమ్మెల్యే బాపురావుతో నాకు సత్సంబంధాలు ఉన్నాయి. ఫోన్‌లో వాయిస్ నాది కాదు. మార్ఫింగ్ చేసినట్టున్నారు. ఆయనతో రాజకీయ విభేదాలున్నవారు ఇలా చేసి ఉండొచ్చు. దాంతో నాకు సంబంధం లేదు.

– రియల్టర్ కిరణ్‌కుమార్

బెదిరించలేదు



ఇది నేను రియల్టర్‌తో ఏడాది కిందట మాట్లాడింది. నేను ఆయనను బెదిరించలేదు. బ్లాక్‌మెయిల్ చేయలేదు. నేనే రూ.28 లక్షలు బాకీ ఉన్నట్టు చెబుతున్నాను. అనవసరంగా దీన్ని రాద్ధాంతం చేస్తున్నారు.

– రాథోడ్ బాపురావు, బోథ్ ఎమ్మెల్యే

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.